@vaartanews @mvnewstv

మన మీ.. వార్త

ప్రతి అక్షరం... ప్రజల కోసం

తెలుగు దిన పత్రిక

www.mivaartanews.com

TGBIL/25/A0512

బుధవారం

28 అక్టోబర్ 2026

సూర్యపేట, హైదరాబాద్

MANA MI VARTA NEWS

సంపుటి : 02

సంచిక :115

పేజీలు : 12 వెల : 5/-

IN MEDIA PUBLICATION PVT LTD




PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE |



## కూలీలకు 125 రోజుల

# ఉపాధి

- 8.83 లక్షల అభివృద్ధి పనులకు ఆమోదం
- రూ.6,375 కోట్లతో పనులు
- కేంద్రం వాటా రూ.3,825 కోట్లు
- నవంబర్ 1 నుంచి పనులు ప్రారంభం
- నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యం
- 80 వేల పనులతో నల్గొండ టాప్
- వచ్చే ఏడాది జూన్ వరకు ఉపాధి

హైదరాబాద్

ఇది వరకు వర్షాలు బాగా పడి పంటలు సమృద్ధిగా పండుతుండేవి. రైతు కూలీలకు కూడా ఉపాధి లభించేది. కానీ ప్రస్తుతం ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపుతోంది. రాష్ట్రంలో తీవ్ర వర్షాభావం నెలకొంది. ఫలితంగా రైతులు కూడా తక్కువ విస్తీర్ణంలోనే పంటలు వేశారు. కొంచెం - మిగతా 10లో

## ప్రపంచస్థాయిలో

# తెలంగాణ ప్రతిష్ఠ



- గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్‌ను విజయవంతం చేయండి
- అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం
- ఢిల్లీలో జరగనున్న కార్యక్రమానికి పకడ్బందీ ఏర్పాట్లు..
- పెట్టుబడిదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు
- తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా సమ్మిట్ ప్రాంగణం..
- కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయ నమూనాలకు ప్రాధాన్యం

హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా నిలిపేందుకు నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమ్మిట్‌కు ముందు ఢిల్లీలో నిర్వహించనున్న కర్టెన్ రైజర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం ద్వారా తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు వివరించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి, మౌలిక సదుపాయాలు, నైపుణ్యాభివృద్ధి, భవిష్యత్ రంగాల్లో ఉన్న అవకాశాలను సమర్థంగా ప్రజెంట్ చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. - మిగతా 10లో



## దేశ ప్రయోజనాలే కొనుగోళ్లలో కీలకం

- రష్యా చమురు దిగుమతులపై అమెరికా ఒత్తిడి లేదన్న హర్దీప్ పురి
- యుద్ధానికి ముందు రష్యా చమురుపై భారత్ ఆధారపడింది 0.2 శాతమే
- రాయితీల కారణంగా యుద్ధం తర్వాత పెరిగిన రష్యా చమురు కొనుగోళ్లు
- సెప్టెంబర్‌లో పెరిగిన మధ్యప్రాచ్య చమురు దిగుమతులు



## మణిపూర్‌లో భద్రతా దళాల ఆపరేషన్

- రైఫిళ్లు, గ్రెనేడ్లు సహా భారీగా డ్రగ్స్ స్వాధీనం!
- భద్రతా దళాల సంయుక్త ఆపరేషన్
- రైఫిళ్లు, 240 రౌండ్ల బుల్లెట్లు స్వాధీనం
- 1.027 కిలోల బ్రౌన్ షుగర్ పట్టివేత
- 23 ఏళ్ల యువకుడి అరెస్ట్
- ఇంఫాల్ ఈస్ట్‌లో భారీగా ఆయుధాలు స్వాధీనం
- హెరాయిన్‌తో ఇద్దరు నిందితుల అరెస్ట్
- జాతి ఘర్షణలతో కొనసాగుతున్న ఉద్రిక్తతలు

## సాంకేతిక రంగంలో భారత్ గ్లోబల్ లీడర్‌గా ఎదగాలి

- కీలక టెక్నాలజీల్లో స్వయం సమృద్ధి సాధించడమే లక్ష్యం
- మేడ్ ఇన్ ఇండియా చిప్స్‌కు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు
- అణు, అంతరిక్షం నుంచి ఏఐ, సెమీకండక్టర్ల వరకు సరికొత్త ఆవిష్కరణలు
- భారత సాంకేతిక పరిజ్ఞానం ప్రపంచ సమస్యలకు పరిష్కారం చూపాలి: ప్రధాని మోదీ



## ఈసీ అఫిడవిట్ మోసపూరితం ఆ సంస్థకే నష్టం చేకూర్చేలా ఉంది

- ఈసీ అఫిడవిట్‌పై కాంగ్రెస్ అభ్యంతరం
- ఫారం-6 డిక్లరేషన్‌పై వివాదం
- నిబంధనల ఉల్లంఘన జరిగిందని ఆరోపణ
- ఈసీనెట్ వ్యవస్థపై విమర్శలు
- పిటిషన్లను కొట్టివేయాలని ఈసీ విజ్ఞప్తి
- ర్యాలీకి అనుమతి యథాతథం
- భద్రతకు 3,500 మంది పోలీసులు
- సీసీటీవీలతో పటిష్ఠ నిఘా



- 11 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులు
- 254 మండలాల్లో ఓ మోస్తరు కరువు
- జాబితా విడుదల చేసిన సీఎస్ సంజయ్
- 6 నెలల పాటు అమల్లో నోటిఫికేషన్
- జిల్లా కలెక్టర్ల తక్షణ కర్తవ్యంపై పలు సూచనలు
- గెజిట్‌లో పొందుపర్చాలి.. వెంటనే ఉపశమన చర్యలు చేపట్టాలి
- కేంద్రానికి నివేదికలు పంపాలి..
- ఎప్పటికప్పుడు పరిస్థితులు సమీక్షిస్తుండాలి
- అవసరమైతే మలి జాబితా విడుదల చేస్తామని స్పష్టీకరణ

## కరువు మండలాలు

# 365



హైదరాబాద్

రాష్ట్రంలోని 365 మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రభుత్వం ఈ మేరకు అధికారికంగా నిర్ధారించింది. రాష్ట్రంలోని 31 జిల్లాల పరిధిలోని 365 మండలాల్లో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని ప్రకటించింది. వర్షాభావ పరిస్థితులతో 18 జిల్లాల్లోని 111 మండలాల్లో తీవ్ర కరువు పరిస్థితులుండగా, 27 జిల్లాల్లోని 254 మండలాల్లో ఓ మోస్తరు కరువు ఉందని తెలిపింది. జిల్లాల వారీగా కరువు మండలాల జాబితాను విపత్తు నిర్వహణ శాఖ పక్షాన రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు విడుదల చేశారు. మంగళవారం రాత్రి జీవో ఎంఎస్ నం:3 ద్వారా రాష్ట్రంలోని ఏయే జిల్లాల్లో కరువు మండలాలున్నాయి? అందులో తీవ్రంగా కరువున్న మండలాలేవి ఓ మోస్తరు మండలాలేవి? జిల్లా కలెక్టర్లు ఏం చేయాలి? కరువుతో సంబంధమున్న పలు శాఖల తక్షణ కర్తవ్యమేంటనే వివరాలను వెల్లడించారు. ఆ జీవో ప్రకారం.. 2026 ఖరీఫ్ సీజన్‌కు గాను అక్టోబర్ 30లోగా కరువును నోటిఫై చేయాల్సి ఉంది. ఈ ఏడాది సెప్టెంబర్ 18న రాష్ట్ర అసెంబ్లీలో - మిగతా 10లో



## మందుల కంపెనీల కోసమే మొత్తం వ్యవస్థ పనిచేస్తోందా?

- మందుల ధరలపై సుప్రీంకోర్టు ఆగ్రహం
- రూ.11 వేల మందు రూ.1.30 లక్షలా?
- ఎన్‌పీపీఏ పనితీరుపై అసంతృప్తి
- ఇతర దేశాలతో పోలికపై కేంద్రానికి చురకలు
- నిర్వహణ ఖర్చుల పేరుతో ధరల పెంపా?
- 82 శాతం మందుల ధరలపై నియంత్రణ ఏదీ?
- క్యాన్సర్ మందుల ధరలపైనా గతంలో ప్రశ్నలు

## పగలు ఎండలు..

# రాత్రికి చలి



- పగటిపూట ఎండలు
- రాత్రికి పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- తెలంగాణలో పెరుగుతున్న చలి తీవ్రత
- పటాన్‌చెరులో 13 డిగ్రీలకు పడిపోయిన ఉష్ణోగ్రత
- రాజేంద్రనగర్‌లోనూ చలి ప్రభావం
- గుండె రోగులు అప్రమత్తంగా ఉండాలి
- వృద్ధులు ఎండ వచ్చాకే వాకింగ్‌కు వెళ్లాలి

హైదరాబాద్

తెలంగాణ వ్యాప్తంగా గత రెండు మూడ్రోజులుగా చలి ప్రభావం పెరుగుతోంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ మహానగరంపై కూడా చలి ప్రభావం ఉంది. పగటి పూట ఎండ తీవ్రత అధిక స్థాయిలోనే కొనసాగుతున్నా, రాత్రి ఏడు దాటగానే ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా పడిపోతున్నాయి. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం హైదరాబాద్?లోని పలు ప్రాంతాల్లో సాధారణం కంటే తక్కువగా రాత్రి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శివారు ప్రాంతాలు, ఐటీ కారిడార్ వంటి పరిసరాల్లో చలి గాలుల ప్రభావం ఎక్కువగానే ఉంది. సంగారెడ్డి జిల్లాలోని పటాన్‌చెరు ప్రాంతంలో కనిష్ఠ ఉష్ణోగ్రత ఏకంగా - మిగతా 10లో

## సంపాదకీయం

# ఫెడరల్ ఫ్రంట్ సాధ్యమేనా

జాతీయ రాజకీయాల్లో కాంగ్రెసేతర, బీజేపీయేతర ప్రత్యామ్నాయ శక్తులను ఒకే తాటిపైకి తెచ్చేందుకు భారత రాష్ట్ర సమితి అధినేత కే.చంద్రశేఖర్ రావు మళ్లీ వేగంగా పావులు కదుపుతున్నారని కేటీఆర్ సంకేతాలు ఇచ్చారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీయే కూటమి నియంత్రణను, దర్యాప్తు సంస్థల దూకుడును ఎదుర్కొనేందుకు ఒక పటిష్టమైన ఫెడరల్ ఫ్రంట్ లేదా రీజినల్ అలయన్స్ అవసరమనే చర్చను బీఆర్ఎస్ తిరిగి తెరపైకి తెచ్చింది. ముఖ్యంగా ఏపీలో అధికారం కోల్పోయిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో పాటు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ , ఉత్తరప్రదేశ్ సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఒడిశా మాజీ సీఎం నవీన్ పట్నాయక్ లాంటి బలమైన ప్రాంతీయ దిగ్గజాలతో మళ్లీ టచ్‌లోకి వెళ్లేందుకు గులాబీ దళపతి గ్రౌండ్ వర్క్ సిద్ధం చేస్తున్నట్లు పొలిటికల్ సర్కిళ్లలో చర్చ సాగుతోంది. ఈ ప్రాంతీయ కూటమి ప్రయత్నంలో కేసీఆర్‌తో కలసి రావడానికి ఏ పార్టీకి ఎంతవరకు సానుకూలత ఉందనేది ఇప్పుడు ఆసక్తికరమైన అంశం. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి, కేసీఆర్‌కు మధ్య మొదటి నుంచి సత్సంబంధాలు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ అధికారం కోల్పోయాక, అలాగే రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కాంగ్రెస్, బీజేపీల ఉమ్మడి రాజకీయ ఒత్తిడి పెరిగిన తరుణంలో జగన్–కేసీఆర్‌లు ఒకరికొకరు మద్దతుగా నిలిచే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ముఖ్యంగా కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి ఎదురవుతున్న ఒత్తిళ్లను తట్టుకోవడానికి, పార్లమెంట్ పరిధిలోనూ ప్రాంతీయ బలాన్ని ప్రదర్శించడానికి ఈ ఇద్దరు నేతలు ఒకే వేదికపైకి రావడం ఇరు పార్టీలకు రాజకీయంగా ఊరటనిచ్చే అంశం. పశ్చిమ బెంగాల్‌లో మమతా బెనర్జీ, ఈ థర్డ్ ఫ్రంట్ మోడల్‌కు ప్రధాన భాగస్వామిగా మారే అవకాశాలు ఉన్నాయి. జాతీయ స్థాయిలో కలస్తున్నా.. రాష్ట్ర స్థాయిలో కాంగ్రెస్ నేతలు మమతా బెనర్జీతో కలిసి పని చేసేందుకు సిద్ధంగా లేరు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ తన పెద్దన్న పాత్రను రుద్దడాన్ని దీదీ మొదటి నుంచీ వ్యతిరేకిస్తున్నారు. ప్రాంతీయ పార్టీల ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడానికి, అలాగే బెంగాల్ వేదికగా కేంద్ర ప్రభుత్వంతో సాగిస్తున్న పోరాటంలో ప్రాంతీయ మిత్రుల మద్దతు పొందేందుకు మమత–కేసీఆర్‌ల వ్యూహాలు సులువుగా సరిపోతాయి. గతంలో కూడా కేసీఆర్ కలకత్తా వెళ్లి మమతా బెనర్జీతో జరిపిన భేటీలు, ఆ తర్వాత రూపొందించిన ఫెడరల్ ఫ్రంట్ కార్యాచరణ ఇందుకు నిదర్శనంగా నిలుస్తోంది. ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కూడా కాంగ్రెస్‌పై పూర్తిగా ఆధారపడటానికి సిద్ధంగా లేరు. ఎస్పీకి ఉన్న యాదవ–ముస్లిం ఓటు బ్యాంకును కాపాడుకుంటూనే, జాతీయ స్థాయిలో బీజేపీని ఢీకొట్టేందుకు బలమైన ప్రాంతీయ నాయకత్వాన్ని ఆయన కోరుకుంటున్నారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జాతీయ రాజకీయాల్లో కీలకపాత్ర పోషించబోతున్నారంటూ కేటీఆర్ చేసిన ప్రకటన తెలుగు రాష్ట్రాల్లో చర్చనీయాంశమైంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బలహీనపడుతోందని, ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ వైఫల్యాలు దేశంలో మరో ప్రత్యామ్నాయ రాజకీయ వేదిక అవసరాన్ని తెస్తున్నాయని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ జాతీయ స్థాయిలో ప్రాంతీయ పార్టీలను సమన్వయం చేస్తూ కీలక పాత్ర పోషిస్తారన్న సంకేతాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపుతున్నాయి. కొంతకాలంగా జాతీయ స్థాయిలో రాజకీయ పరిణామాలు మారుతున్నాయి. కేంద్రంలో అధికార బీజేపీ సంకీర్ణ కూటమిపై ఆధారపడాల్సి వస్తోంది. కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండీ' కూటమిలో సమన్వయ లోపాలు బయటపడుతున్నాయి. దీంతో జాతీయ స్థాయిలో కాంగ్రెసేతర, బీజేపీయేతర ప్రత్యామ్నాయం కోసం ప్రాంతీయ పార్టీలు చూస్తున్నట్లు స్పష్టమవుతోంది. ఈ రాజకీయ శూన్యతను భర్తీ చేసేందుకు కేసీఆర్ తన అనుభవం, జాతీయ రాజకీయాలపై ఉన్న పట్టును ఉపయోగించుకోవాలని వ్యూహం రచిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర ప్రభుత్వ విధానాలపై ప్రాంతీయ ఆత్మగౌరవ నినాదంతో ఇతర ప్రాంతీయ పార్టీలను ఏకం చేసే దిశగా తెరవెనుక కసరత్తు జరుగుతున్నట్లు సమాచారం. కేటీఆర్ చేసిన ఈ ప్రకటన వెనుక కేవలం ఢిల్లీ పీఠాన్ని ప్రభావితం చేయడమే కాదు.. తెలంగాణలో రాబోయే స్థానిక సంస్థలు, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలను కూడా ప్రభావితం చేసే అవకాశం ఉంది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత కొంత నైరాశ్యంలో ఉన్న కేడర్‌ను ఉత్తేజపరచడానికి ఇదొక స్ట్రాటజీ అయి ఉండొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కేసీఆర్ జాతీయ స్థాయిలో మళ్లీ చక్రం తిప్పుతారనే ప్రచారం మానసిక స్థైర్యాన్ని ఇస్తుందని భావిస్తున్నారు. అలాగే, రాబోయే రోజుల్లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనే నినాదంతో శ్రేణులను ఎన్నికలకు సమాయత్తం చేసే ప్లాన్ ఇది. అఖిలేష్ పాల్గొనడం, రైతు సమస్యలు, ఫెడరలిజంపై ఒకే విధమైన విధానాలను పంచుకోవడం వల్ల కేసీఆర్ పిలుపునిస్తే కలసి నడిచే ప్రధాన నాయకులలో అఖిలేష్ యాదవ్ ముందువరుసలో ఉంటారని భావించవచ్చు. ఒడిశాలో సుదీర్ఘకాలం పాలించి ఇటీవల ప్రతిపక్షంలోకి వచ్చిన బిజూ జనతాదళ్ అధినేత నవీన్ పట్నాయక్ వైఖరి ఇక్కడ చాలా కీలకమైనది. గతంలో సమాన దూరం పాటించిన బీజేడీ, ఇటీవల ఒడిశాలో బీజేపీ అధికారంలోకి వచ్చాక ఎన్డీయేతో సంబంధాలను పూర్తిగా తెంచుకుంది. రాష్ట్ర ప్రయోజనాలు, ప్రాంతీయ నిధుల సాధన కోసం కఠిన వైఖరి అవసరమని భావిస్తున్న నవీన్ పట్నాయక్, కేంద్రానికి కౌంటర్ ఇచ్చేందుకు ఈ ప్రాంతీయ వేదికకు మద్దతిచ్చే అవకాశాలను కొట్టిపారేయలేమని అంటున్నారు. ప్రాంతీయ పార్టీలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తేవడం వెనుక ఉన్న ముఖ్య ప్రణాళిక రాజకీయ రక్షణ . నిధుల పంపిణీలో కేంద్ర ప్రభుత్వ వివక్షను ప్రశ్నించడం, సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థల వాడకంపై ఉమ్మడిగా పార్లమెంట్ లోపల, బయటా నిరసనలు తెలపడం ద్వారా కేంద్రంపై తీవ్ర రాజకీయ ఒత్తిడి తెవచ్చని వీరు లెక్కలు వేస్తున్నారు. ఒకవేళ కేసీఆర్ అనుకున్నట్లుగా ఈ ప్రాంతీయ దిగ్గజాలందరినీ ఒకే వేదికపైకి తీసుకురాగలిగితే, జాతీయ స్థాయిలో మూడో కూటమి మళ్లీ కీలకమైన శక్తిగా అవతరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# వరంగల్ ముక్కలైనప్పుడు ఏమైందీ స్ఫూర్తి!



'వందలేళ్ల వారసత్వం బొగ్గు కోసం బుగ్గి!' పేరుతో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ రాసిన వ్యాసం (10.10.2026) కేవలం బొగ్గు కోసం వందల ఏళ్ళ చరిత్ర గల రామప్ప దేవాలయాన్ని ప్రమాదంలోకి నెట్టడం పట్ల ఆందోళన వ్యక్తం చేసింది. ఆయనే కాదు, వరంగల్ ఉమ్మడి జిల్లా పౌర సమాజం మొత్తం ఆ ప్రాంతంలో బొగ్గు తవ్వకం నిలిపి వేయాలనీ, కాకతీయుల వారసత్వ సంపదను, రామప్ప దేవాలయాన్ని కాపాడాలనీ ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నారు. రామప్ప దేవాలయ పరిరక్షణ కోసం వినోద్‌కుమార్ ప్రజల పక్షాన నిలబడటాన్ని ఉమ్మడి జిల్లా ప్రజలు స్వాగతిస్తారు. గత ప్రభుత్వ పాలనలో నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్ ఉమ్మడి జిల్లాను ఆరు జిల్లాలుగా ముక్కలు చేయడాన్నే ప్రజలు ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నారు. రాష్ట్రాన్ని 33 జిల్లాలు చేస్తున్న సందర్భంగా 2016లో కేసీఆర్ వరంగల్ నగరాన్ని వరంగల్ అర్బన్ జిల్లాగాను, చుట్టుపక్కల గ్రామాలను వరంగల్ రూరల్ జిల్లాగాను ప్రకటించి 2021 వరకు పాలన కొనసాగించారు. ఆ ఏడాది మరోసారి వరంగల్ నగర పరిధిని రెండు ముక్కలు చేసి తూర్పు భాగాన్ని వరంగల్ జిల్లాగాను, పడమటి భాగాన్ని హనుమకొండ జిల్లాగాను ప్రకటించారు. తన సామాజిక వర్గ కార్పొరేట్ సంస్థకు మెడికల్ కాలేజీ అనుమతి కోసమే ఇలా వరంగల్ నగరాన్ని రెండు జిల్లాలుగా విడదీశారు. పది కిలోమీటర్ల దూరంలో రెండు కలెక్టరేట్లను, పోలీసు కార్యాలయాలను ఏర్పాటు చేశారు. వరంగల్ నగరంలో కాకతీయుల కాలం నాటి వారసత్వం విస్తరించి ఉందని వినోద్‌కుమార్‌కు తెలియనిది కాదు. రామప్ప దేవాలయం, పాకాల, లక్నవరం సరస్సులు, ధర్మసాగరం ఘనపురం భద్రకాళి చెరువులు, వందలాది గొలుసు కట్టు చెరువులు, వేయి స్తంభాల గుడి, శంభుని దేవాలయం... ఇదంతా కాకతీయ వారసత్వంలో భాగమే. వరంగల్లు, హనుమకొండ, కాజీపేట మూడు నగరాలు కలిసి వరంగల్ నగరంగా ఖండాంతరాలలో ప్రసిద్ధి. వరంగల్ హనుమకొండ మధ్యలో నిజాం కాలం నుండి అత్యంత పేరు ప్రతిష్ఠలు కలిగిన, రకరకాల కుటీర పరిశ్రమల్లో ఖైదీలకు శిక్షణ ఇచ్చే వ్యవస్థగా ఎదిగిన, సకల సదుపాయాలతో అభివృద్ధి చెందిన వరంగల్ జైలును కేసీఆర్ ఆదేశాలతో రాత్రికి రాత్రే నేలకూల్చారు. జైలు కూల్చివేత వరంగల్ ప్రజలకే కాక ఉత్తర తెలంగాణ ప్రజలకు కూడా నచ్చలేదు. వెయ్యి మందికి పైగా ఖైదీలను, 400 మంది జైలు ఉద్యోగులను హుటాహుటిన ఇతర ప్రాంతాలకు తరలించారు. 67 ఎకరాల జైలు భూమిని బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రకు అత్యధిక వడ్డీ రేటు వద్ద కుదువపెట్టి రూ.1100 కోట్ల అప్పుతో కాంట్రాక్టులూ కమీషన్ల కొరకు వైద్యశాల నిర్మాణం ప్రారంభించారు. వరంగల్‌లో మరో జైలు నిర్మాణం ఈనాటికీ జరగలేదు. ఈ అనాలోచిత చర్యవల్ల ఉత్తర తెలంగాణ ఖైదీలు, రిమాండ్ ఖైదీలు, వారి కుటుంబ సభ్యులు, జైలు ఉద్యోగులు, వారి పిల్లలు అష్టకష్టాల పాలైనారు. వరంగల్ నగరాన్ని రెండు జిల్లాలుగా విడగొట్టమనీ, జైలును కూలగొట్టమనీ, అప్పు తెచ్చి దవాఖాన కట్టమనీ నగర ప్రజలు ఏనాడూ మన మాజీ ముఖ్యమంత్రిని కోరలేదు. ఇవన్నీ చేసిన ఆ ముఖ్యమంత్రి ప్రజలు అడిగిన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్‌నూ, హైదరాబాద్ వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్ నిర్మాణాన్నీ మాత్రం చేపట్టలేకపోయారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ తర్వాత అతిపెద్ద నగరంగా వరంగల్ ఎదుగుతుందని రాష్ట్ర సాధన ఉద్యమ సందర్భంలో ఉమ్మడి జిల్లా ప్రజలు, ఉద్యమకారులు, మేధావులు భావించారు. కానీ నేడు వరంగల్ జిల్లా ఏ అభివృద్ధికీ నోచుకోకపోగా, సిద్దిపేట సిరిసిల్లతో పోలిస్తే మరింత వెనుకబడిపోయింది. ఓరుగల్లు ప్రజలు నిజాం, వారి తొత్తుల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాయుధ పోరాటంలో ముందువరుసలో నిలబడ్డారు, తెలంగాణ రాష్ట్ర సాధనలోనూ ముందు నిలిచారు. ప్రజా వ్యతిరేక నిర్ణయాలు అమలుచేస్తున్న అధికార పార్టీలను మట్టిగరిపించిన సత్తా ఉన్నవారు. బోయినపల్లి వినోద్‌కుమార్ 2004లో వరంగల్ లోక్‌సభ స్థానం నుంచి టీఆర్ఎస్ అభ్యర్థిగా ఎన్నికైనారు. లోక్‌సభ అభ్యర్థిగా కరీంనగర్ నుంచి ఓటమి పొందిన తర్వాత 2018 నుంచి 2023 వరకు తెలంగాణ ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షులుగా క్యాబినెట్ హోదాలో బాధ్యతలు నిర్వర్తించారు. ఇదే కాలంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు వరంగల్ జిల్లా నుంచి కేసీఆర్ ప్రభుత్వంలో క్యాబినెట్ మంత్రిగా పనిచేశారు. ఈ ఇద్దరూ కాకతీయుల వారసత్వ సంపదపై అవగాహన ఉన్నవారే. వరంగల్ ఉమ్మడి జిల్లా రాజకీయ చైతన్యం గురించి తెలిసినవారే. రామప్ప దేవాలయ వారసత్వ సంపదను కాపాడాల్సిందే. కానీ ఈ జిల్లా నాయకులకు ఇదే స్ఫూర్తి వరంగల్ నగరాన్ని రెండు ముక్కలు చేసినప్పుడూ, జైలును కూల్చిన సందర్భంలోనూ ఉంటే ఎంతో బాగుండేది. కాకతీయ వారసత్వ సంపదకు నిలువుటద్దంగా నిలిచిన ఓరుగల్లు నగరాన్ని రెండు ముక్కలు చేస్తున్న సందర్భంలో ముఖ్యమంత్రికి అతి సమీపంగా అధికారాన్ని పొందిన బోయినపల్లి వినోద్‌కుమార్, ఎర్రబెల్లి దయాకర్ రావులు ప్రజల మనోభావాలకు అద్దం పడుతూ కేసీఆర్‌కు నచ్చచెప్పాల్సింది. ఈ ఇద్దరి నాయకుల మౌనం వరంగల్ ప్రజలకు తీరని అన్యాయం చేసింది. ప్రస్తుతం ప్రధాన ప్రతిపక్ష పార్టీలో కీలకంగా వ్యవహరిస్తున్న ఈ నాయకులు జరిగిన నష్టాన్ని ఎలా నివారిస్తారో మహానగర ప్రజలకు చెప్పాల్సిన బాధ్యత కూడా ఉందని వరంగల్ పౌర సమాజం గుర్తు చేస్తున్నది.

# భావాల తుఫాను ఇప్పుడే వచ్చిందా?

పాశ్చాత్య దేశాల నుంచి ఒక తుఫాను వచ్చింది. అది అన్నిరకాల వ్యవస్థలనూ, మర్యాదలనూ, శుభప్రదమైన విలువలనూ, సంస్కృతినీ, సంస్కారాలనూ వ్యతిరేకిస్తోంది.

దేశ గౌరవానికీ, ప్రతిష్ఠకూ భంగం కలిగించే శక్తులూ, సమాజాన్ని విభజించే వ్యక్తులూ, మన సంస్కృతిపై ద్వేషం చూపించే మనస్తత్వం కలిగిన వాళ్లు.. దేశానికి శత్రువులు.

దసరా పండుగ సందర్భంగా భగవత్, మోదీ చేసిన ఈ వ్యాఖ్యలు చాలా తీవ్రమైనవి. పదునైనవి. మరో కోణం నుంచి చూస్తే మన సంస్కృతిలోని మంచిచెడుల వివేచనకు ఒక సందర్భాన్ని సమకూర్చేవిగానూ భావించొచ్చు!

ఇస్లాం, క్రైస్తవాలను దేశ సాంస్కృతిక ఐక్యతకు నిరోధకాలుగా భావించటం మనకు కొత్తకాదు. 125 ఏళ్లకు పైగా ఆ రెండు మతాలకు వ్యతిరేకంగా ఎన్నో రూపాల్లో విమర్శలూ వ్యాఖ్యలూ వినపడుతూనే ఉన్నాయి. ఆ మతాలను తీవ్రంగా వ్యతిరేకించటానికే కొన్ని సంస్థలు పుట్టుకొచ్చాయి. వాటికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించటానికి రాజకీయపార్టీలూ అవతరించాయి. మన సాంస్కృతిక జీవితాన్ని ఏ రకంగానూ ప్రభావితం చేయలేని స్థాయికి ఆ మతాలను తీసుకెళ్లాలన్న లక్ష్యం దిశగానూ పనిచేశాయి. 1990ల తర్వాత వాటి కార్యాచరణలో అనూహ్యంగా వేగం పెరిగింది. రాజకీయాలన్నీ దాని చుట్టూనే తిరిగాయి. ఇంకా తిరుగుతూనే ఉన్నాయి. హిందూత్వ అనేది మతం కాదనీ, అదొక జీవన విధానమనీ సుప్రీంకోర్టు సైతం వ్యాఖ్యానించటంతో ఆ రాజకీయాలకు బాగా ఊపు వచ్చింది. మన జాతీయ ఐక్యత సురక్షితంగా ఉండాలంటే హిందూత్వను అందరూ ఆమోదించాలనీ, దాన్ని వ్యతిరేకిస్తున్న వాళ్లను అనుమానంతో చూడాల్సిందేనన్న దృక్పథానికి గత మూడున్నర దశాబ్దాల కాలంలో గణనీయంగా బలం పెరిగింది. భారత్‌లో ఉన్న వాళ్లందరూ మాతృభూమిని పుణ్యభూమిగా చూడాలనీ, దేశభక్తికి అదే కొలమానమనీ చెప్పటం కొంతకాలంగా మామూలైపోయింది. దేశ సరిహద్దుల అవతల పుణ్యభూములనూ, పవిత్రస్థలాలనూ (మక్కా, జెరూసలెం) చూసే వ్యక్తుల విధేయతను శంకించాల్సిన అవసరం ఉందన్న ప్రచారం కూడా చాలా దశాబ్దాలుగా సాగుతూనే ఉంది. ఇప్పుడు దానికి మించిన పరిణామాలు జరుగుతున్నాయి. కాక్రోచ్ పార్టీ పేరుతో ఆందోళనలు సాగిస్తున్న యువతను కూడా ఇప్పుడు దేశ సంస్కృతికి వ్యతిరేకులుగా భావించటం మొదలవుతోంది. భగవత్, మోదీ విమర్శలను ఈ నేపథ్యం నుంచి చూస్తేనే వాటి సందర్భశుద్ధి ఏమిటో కొంతైనా అర్థమవుతుంది. భగవత్ అయితే ఫ్రాన్స్, అల్బేనియా, బంగ్లాదేశ్, నేపాల్‌లో జరిగిన పరిణామాలను కూడా తన ఉపన్యాసంలో ప్రస్తావించారు. ఆ పరిణామాల వెనుక విదేశీశక్తుల హస్తం ఉందనీ విమర్శించారు. పాశ్చాత్య సంస్కృతి నుంచి మంచిని స్వీకరించి.. స్వేచ్ఛ, సౌభ్రాత్రం, సమానత్వం, లౌకికవాదం కావాలనీ, సమన్యాయపాలనను అమలుచేయాలనీ కోరుతున్న వాళ్లందరినీ విదేశీశక్తులుగా పరిగణిస్తే మనం మధ్యయుగాల నాటి ఆలోచనల్లోకి వెళ్లిపోతాం. అప్పుడు మన రాజ్యాంగం పునాదులనే ప్రశ్నించుకోవాల్సి వస్తుంది. చట్టం ముందు అందరూ సమానులేనన్న భావన.. మనం గతంలో అనుసరించిన సంప్రదాయక సామాజిక నీతిలో ఎప్పుడూ భాగం కాదు. ధర్మాన్ని కాపాడటం ముఖ్యకర్తవ్యంగా మన సంప్రదాయ రాజనీతి ఉండేది. ఆ నీతిలో ఒక నేరానికి అందరికీ ఒకే విధమైన శిక్షను ఊహించలేం. కులాన్ని బట్టి, వర్ణాలను బట్టి శిక్షలు ఉండేవి. మనుస్మృతితో పాటు ఇతర స్మృతుల్లో అవి చాలా స్పష్టంగానే ఉన్నాయి. వర్ణ ధర్మాన్నీ కుల కట్టుబాట్లనూ కాపాడటమే రాజుల ప్రథమ కర్తవ్యమని స్మృతులు బోధించాయి. ముస్లిం పాలకులకు వ్యతిరేకంగా కత్తిఎత్తిన వీరులు కూడా హైందవమత సామాజిక నీతినీ, వ్యవస్థనూ పునరుద్ధరించటమే లక్ష్యంగా ప్రకటించుకున్నారు. అధికారం కోసం జరిగిన ఏ పోరాటంలోనైనా ఏదో ఒక నీతినీ, ధర్మాన్నీ పునరుద్ధరించటానికే అన్నట్లుగా ప్రకటనలూ ఉంటాయి. ఆ దిశగా ప్రజలను ప్రేరేపించటమూ ఉంటుంది. తన స్వార్థం కోసమే, తను అనుభవించటానికే అధికారాన్ని కోరుకుంటున్నట్లు ఏ రాజూ చెప్పడు. సామాజిక సమానత్వ భావనను మన భక్తికవుల్లో కొందరు గట్టిగానే ప్రచారం చేశారు. కానీ అది ప్రచారస్థాయిని దాటి స్థిరమైన రాజకీయ రూపం సంతరించుకుని, రాజ్యాంగనీతిలో, నడవడిలో ఎప్పుడూ ప్రధానభాగం కాలేదు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అసమ్మతిని తెలపటం.. దానికి మించి ప్రభుత్వాలను గద్దెదింపే స్థాయిలో ఆందోళనలు చేయటం ప్రజాస్వామ్యంలో అతి సహజం. రాజ్యాంగ పరిధిలో వాటిని చేయాలనటంలో తప్పేమీ లేదు. అలాగే హింసకు తావివ్వకుండా ఆందోళనలు చేయాలని కోరటంలో అనౌచిత్యమూ లేదు. ఆందోళనకారులందరినీ దేశ సంస్కృతిని విచ్ఛిన్నం చేసే వాళ్లుగా భావించటంలోనే ప్రమాదం ఉంది. పాశ్చాత్య భావాల స్ఫూర్తితో ఆందోళనలు చేపట్టడం ఏ రకంగానూ తప్పుకాదు. ఏ భావం ఎక్కడ పుట్టినా అది ఎక్కువ మందికి పనికొచ్చేదైతే పనిగట్టుకుని వ్యతిరేకించాల్సిన అవసరమే ఉండకూడదు. అంతదాకా ఎందుకు.. మన రాజ్యాంగమే పాశ్చాత్య భావాల స్ఫూర్తితో రూపొందింది. రాజ్యాంగసభలో ఎన్నో చర్చలు చేసి దాన్ని రూపొందించారు. మన సంప్రదాయ రాజనీతికీ, కులాల అంతస్తుల ప్రాతిపదికన ఏర్పడిన హెచ్చుతగ్గుల భావనలకు రాజ్యాంగంలో చోటు కల్పించకుండా చూడటానికే పెద్ద కసరత్తు జరిగింది. గోవధ నిషేధం, కుటీర పరిశ్రమలకు ప్రోత్సాహం వంటివి రాజ్యాంగంలో ఉన్నా వాటికి పెద్దపీట వేయలేదు. భారత రాజ్యాంగ రచనను నిశితంగా పరిశీలిస్తే మనం ఎరువు తెచ్చుకున్నవే ఎక్కువగా కనపడతాయి. 1935 నాటి గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టంలో నుంచి తీసుకున్నవే అందులో అధికంగా ఉన్నాయి. బ్రిటన్, అమెరికా, ఐర్లాండు, ఆస్ట్రేలియా, కెనడా, ఫ్రాన్సు, రష్యా, జర్మనీ, దక్షిణాఫ్రికా రాజ్యాంగాల నుంచి ఎన్నో తీసుకున్నాం. ఎరువు తెచ్చుకున్న వాటిని కొన్ని మార్పులతో మన రాజ్యాంగంలో పొందుపరచటాన్నీ అంబేడ్కర్ కూడా గట్టిగా సమర్థించారు. హిందూ మహాసభ లాంటి సంస్థలు రాజ్యాంగాన్ని అప్పుడే వ్యతిరేకించాయి. సంప్రదాయ మూలాల్లేని రాజ్యాంగమూ ఒక రాజ్యాంగమేనా అంటూ విమర్శలు కురిపించాయి. హిందూ సంస్కృతినీ, వారసత్వాన్నీ నిర్లక్ష్యం చేసిందనీ గర్హించాయి. అన్ని మతాలను సమానంగా చూసే లౌకిక విధానమూ వాటికి నచ్చలేదు. మనుస్మృతి లాంటి వాటిని పరిగణనలోకి తీసుకోకపోవటాన్నీ తిట్టిపోశాయి. దేశ సంస్కృతిని విచ్ఛిన్నం చేయటానికి విదేశీ భావాలతో ప్రేరణపొంది అసమ్మతిని రాజేస్తున్నారని విమర్శించటం రాజకీయ అవసరంగానే ఉండొచ్చు. కానీ మన ప్రజాస్వామ్యానికి పునాదిగా ఉన్న మన రాజ్యాంగమే అలా ప్రేరణ పొందేలా చేస్తోంది. మన సంప్రదాయాల నుంచి మాత్రమే ప్రేరణ పొందాలని నిర్దేశిస్తే రాజ్యాంగానికి ఆత్మగా ఉన్న ప్రజాస్వామ్యం కనుమరుగవుతుంది. ప్రాథమిక హక్కులు కలిగించే భావనలు అంతర్ధానం అవుతాయి. పాశ్చాత్య భావాలకు అనుగుణంగా రాజ్యాంగ రూపకల్పన చేసినవాళ్లను విమర్శించాలనుకుంటే ఆనాటి ప్రధాన పాత్రధారులనే తప్పుపట్టాల్సి వస్తుంది. నెహ్రూతో పాటు సర్దార్‌పటేల్ కూడా ఆ యజ్ఞంలో ముందువరుసలోనే ఉంటారు. మన రాజ్యాంగ స్ఫూర్తికి అనుగుణంగా లేని సంప్రదాయాలనూ, సంస్కృతినీ విమర్శించటమూ ప్రజాస్వామ్య ఆలోచనల్లో చాలా కీలకమైనది. చాలా సహజమైనది. మార్పులు కావాలనుకునే వాళ్లందరినీ విచక్షణ లేకుండా సంస్కృతిని విచ్ఛిన్నం చేసేవారుగా చిత్రీకరించటం రాజ్యాంగం పెద్దపీట వేసిన భావనలకు వ్యతిరేకమే అవుతుంది. కాక్రోచ్ ఆందోళనలకు నాయకత్వం వహిస్తున్నవారు ప్రత్యేకంగా విదేశీ భావాలతో ప్రేరణ పొందాల్సిన అవసరంలేదు. మన రాజ్యాంగానికే అటువంటి భావాలను ప్రేరేపించే శక్తి ఉంది. ఒక మతమూ, ఒక భాషా, ఒక సంస్కృతీ, భౌగోళిక ఐక్యతా పునాదులుగా ఉండే జాతీయభావం కూడా ముందుగా పాశ్చాత్య దేశాల్లోనే బలపడింది. ఆధునిక భావాల వ్యాప్తిలో భాగంగానే భారత్‌లోనూ జాతీయవాదం వేళ్లూనుకుంది. కాకపోతే ఒక భాష, మతం ఆధారంగా ఉండే జాతీయవాదం స్థానంలో బహు భాషలనూ, బహు సంస్కృతులనూ సమానంగా చూసే జాతీయవాదం భారత్‌లో రూపుదిద్దుకోవాలని రాజ్యాంగ నిర్మాతలు ఆశించారు. మనుషులందరినీ విశ్వకుటుంబంలో భాగమనుకుంటే, విభిన్న సంస్కృతుల మధ్య ఇచ్చిపుచ్చుకోటాలు చరిత్ర పొడవునా జరగటాన్ని విస్మరించలేని వాస్తవంగా గుర్తిస్తే.. ఆందోళనకారులను విచ్ఛిన్నశక్తులుగా భావించలేం. మన సంస్కృతికి చేటుతెచ్చే సమూహాలుగా ముద్రవేయలేం. ఇతర సంస్కృతులతో ప్రభావితం కాని దేశం ప్రపంచంలో ఎక్కడా లేదు. రాజ్యాంగంలో మనం పొందుపరుచుకున్న పాశ్చాత్య భావాలతో సంప్రదాయ సంస్కృతి ఒక్కటే మారటం లేదు. మన ఆర్థిక వ్యవస్థను కూడా ఇతర దేశాల ఆర్థిక వ్యవస్థలతో ఎప్పుడో అనుసంధానం చేశాం. 1991 తర్వాత అది అనూహ్యస్థాయిలో పెరుగుతోంది. మన ఆర్థిక వ్యవస్థలోకి ఎంత ఎక్కువగా విదేశీపెట్టుబడులు వస్తే అంత గొప్పని భావించుకునే పరిస్థితుల్లో, బయట దేశాలతో ప్రేరణపొందిన శక్తులు దేశ సంస్కృతిని నాశనం చేస్తున్నాయని భావించటంలో సహేతుకత ఒకపట్టాన కన్పించదు. ఆర్థిక వ్యవస్థలతో పాటు సంస్కృతులూ ప్రయాణం చేస్తాయి. ఆ ప్రయాణంలో భాగంగా సంప్రదాయాలూ మారతాయి. రాజ్యాంగస్ఫూర్తిని మనం నిక్కచ్చిగా ఒంటబట్టించుకుంటే మన సంప్రదాయాల్లో మంచినీ చెడునీ విడదీయకుండా ఉండలేం. సంస్కృతిని వ్యతిరేకించేవాళ్లు అందులో ఏ అంశాలను విమర్శిస్తున్నారో చూడకుండా, స్పష్టంగా చెప్పకుండా ప్రచార ఉధృతితో వాళ్లను కొంతకాలం దోషులుగా బోనులో నిలబెట్టొచ్చు. అదిప్పుడు సాగుతూనే ఉంది.

# ఆర్ వోబి నిధుల కోసం బీజేపీ బిక్షాటన

(మన మీ వార్త న్యూస్) : అక్టోబర్ 27, (నిజామాబాద్ జిల్లా ప్రతినిధి) :-



మాదవనగర్ ఆర్వోబి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధుల విడుదల జాప్యం చేయడంతో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో బిక్షాటన నిర్వహించారు. మంగళవారం మాదవనగర్ ఆర్ వోబి వద్ద ఎంపీ ధర్మపురి అరవింద్, బీజేపీ శాసనసభపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేధన్ పాల్ సూర్యనారాయణ, బీజేపీ జిల్లా అధ్యక్షులు దినేష్ కులాచారి, జాతీయ పసుపు బోర్డు చైర్మన్ పల్లె గంగారెడ్డి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి స్రవంతిరెడ్డి, బీజేపీ కార్పొరేటర్లు నిరసన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ శాసనసభపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీ ధర్మపురి అరవింద్ లు మాట్లాడుతూ ఈ మాధవ్ నగర్ గేటుతో నరకయాతన పడాల్సిన పరిస్థితి నెలకొంది. నిత్యం ఈ రోడ్డు మీదుగా అన్ని రకాల వాహనాలు సుమారు 4 నుంచి 5 వేల వరకు రాకపోకలు కొనసాగిస్తాయన్నారు. అలాగే ప్రతిరోజు 24 గంటల్లో 58 రైళ్ల రాకపోకలు కొనసాగుతాయని పేర్కొన్నారు. దీంతో ప్రతిసారి 15 నుంచి 20 నిమిషాల వరకు గేటు పడటం,భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. ప్రధానంగా ఈ సమస్యతో స్కూల్ పిల్లలు స్కూల్ కి లేట్... కూలీలు పనికి లేట్..రోగులు హాస్పిటల్ కి లేట్... ప్రభుత్వ ఉద్యోగులు ఉద్యోగానికి లేట్... చివరికి శవాలు కూడా స్మశానానికి లేట్ గా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. ఆర్ వోబీ కొరకు రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ని కలిసి కేంద్ర నిధులు మంజూరు చేయించారన్నారు. రైల్వే శాఖ తనవంతు పని పూర్తి చేసిందని,మరి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. మాధవ్ నగర్ ఆర్ఓబిపై ఆర్ అండ్ బీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డిని గత ఏడాది కలిస్తే వెంటనే పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం ఇచ్చినట్లు గుర్తు చేశారు.కానీ ఇప్పటివరకు ఎందుకు పూర్తి కావడం లేదని ప్రశ్నించారు. నిధులు విడుదల చేసేంత వరకు దీక్ష కొనసాగిస్తామన్నారు.

# బియ్యం ధర దోపిడికి అడ్డుకట్ట వేయాలి

- బ్లాక్ మార్కెట్ వ్యాపారులపై చర్య తీసుకోవాలి
- సిపిఐ ఎంఎల్ జయశంకర్ జిల్లా కార్యదర్శి మారేపల్లి ..మల్లేష్.



ఎల్ నీ నో ప్రభావంతో దిగుమతి తగ్గిందని సాకుతో బియ్యం ధరలు అడ్డగోలుగా పెంచి విక్రయిస్తున్న వ్యాపారులపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ ఎంఎల్ జయశంకర్ జిల్లా కార్యదర్శి మారేపల్లి మల్లేష్ డిమాండ్ చేశారు
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ
ప్రకృతి పరిస్థితులను ఆసరా తీసుకొని కొంతమంది వ్యాపారులు బియ్యం నిల్వలను అక్రమంగా దాచిపెట్టి కృత్రిమ కొరత సృష్టించి సామాన్య మధ్యతరగతి ప్రజల పైన విపరీతమైన భారాలను మోపుతున్నారు ఒక కిలో బియ్యం 90 నుండి 100 రూపాయలకు అక్రమంగా అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు ఇప్పటికే నిత్య అవసర సరుకుల పైన విపరీతమైన ధరల పెంచుతున్నారు మధ్యతరగతి సామాన్య ప్రజలు కొనుగోలు చేసే శక్తి లేకుండా చేస్తున్నారు కేంద్ర ప్రభుత్వం ప్రతి నిత్యవసరవస్తువు పైన విపరీతమైన రేట్లు పెంచుతుంది ఒకపక్క పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలు పెంచడం కాకుండా విపరీతంగా నిత్యవసర సరుకుల ధరలు పెంచుతున్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే మధ్యతరగతి ప్రజలకు సామాన్య ప్రజలకు ఉచితంగా రేషన్ బియ్యం నెలకు 12 కిలోలు ఇవ్వాలని రేషన్ షాప్ ద్వారానే 14 రకాల నిత్యవసర సరుకులు ఇవ్వాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేస్తా ఉన్నాం పౌరసరఫర అధికారులు తక్షణమే జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి అక్రమంగా నిలువ ఉంచుకొని అధిక రేట్లకు అమ్ముతున్న దళారులపై చర్యలు తీసుకోవాలని అన్నారు

# వెంకట సాయి నగర్ కాలనీలో వెంటనే సీసీ రోడ్ల పనులు ప్రారంభించాలి

- అధికారులకు మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆదేశాలు
- కాలనీవాసుల సమక్షంలో అధికారులతో ఫోన్లో మాట్లాడి పనులు వెంటనే చేపట్టాలని స్పష్టం

రామంతాపూర్, అక్టోబర్ 27( మన మీ వార్త):





రామంతాపూర్ డివిజన్ వెంకట సాయి నగర్ కాలనీలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఉప్పల్ నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ అధికారులకు సూచించారు. ఈ మేరకు ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్, సూపరింటెండింగ్ ఇంజనీర్లతో కాలనీవాసుల సమక్షంలో ఫోన్ ద్వారా మాట్లాడి, పనులను తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

కాలనీలో మంజూరైన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఆలస్యం కాకుండా చూడాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను వేగవంతం చేయాలని ఆయన స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, సంబంధిత అధికారులు పనులను పర్యవేక్షిస్తూ నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

కాలనీలో రోడ్ల అభివృద్ధి పనులు ప్రజల అవసరాలకు అనుగుణంగా త్వరితగతిన పూర్తి కావాలని, ఈ విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహించకుండా తక్షణ చర్యలు చేపట్టాలని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు.కాలనీవాసుల సమస్యలపై స్పందించి, సంబంధిత అధికారులతో నేరుగా మాట్లాడి సీసీ రోడ్ల పనులను వెంటనే ప్రారంభించాలని సూచించడంపై వెంకట సాయి నగర్ కాలనీ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి, కాలనీ సభ్యులు, కాలనీ ప్రజలు మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు విజయేందర్ రెడ్డి , బిజెపి మేడ్చల్ జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి వల్లపు జగన్ యాదవ్ , బిజెపి సీనియర్ నాయకులు మహేశ్వర్ రెడ్డి ,నరసింహారెడ్డి, కాలనీ గౌరవ సభ్యులు రమేష్ గౌడ్, గోపాల్ యాదవ్ , సర్వ సత్తయ్య యాదవ్, శివ శంకర్ , సంజీవ , బీరప్ప, కమిటీ సభ్యులు ఆర్ గోవింద్, జి అశోక్, సిహెచ్ శ్రీనివాస్ గౌడ్, డాక్టర్ విద్యాసాగర్, శివకుమార్ , రామకృష్ణ,చలపతిరావు,శెట్టి రమేష్ ,శేఖర్, హరీష్, సిద్దు గౌడ్, చిటికెల శ్రీనివాస్ , పెద్ద నరసింహ, మహేష్ గౌడ్ ,నరసింహ,గణేష్ ,భానుచందర్ , గొట్టికె శ్రీశైలం, వెంకటేష్ , చారి,కాలనీ సభ్యులు పాల్గొన్నారు.

# ఓవైపు నీటి కష్టాలు.. మరోవైపు చెరువుల వద్ద అక్రమ దందాలు!

- ఫాక్స్సాగర్ చెరువుకు ఆక్రమణల ముప్పు..
అక్రమ షెడ్లను హైడ్రా కూల్చివేత!

మీ వార్త / కుత్బుల్లాపూర్ :





నగరంలో నీటి అవసరాలు రోజురోజుకూ పెరుగుతున్న వేళ.. జలవనరులే అక్రమ వ్యాపారాలకు అడ్డాగా మారుతున్నాయనే ఆరోపణలు ఆందోళన కలిగిస్తున్నాయి. చెరువులను పరిరక్షించాల్సిన కొందరు వాటి పరిసరాల్లోనే అక్రమంగా బోర్లు వేసి నీటిని విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు అధికారుల దృష్టికి చేరాయి. ఈ నేపథ్యంలో కుత్బుల్లాపూర్ పేట్ బషీరాబాద్ పరిధిలోని ఫాక్స్సాగర్ చెరువు సమీపంలో హైడ్రా అధికారులు చర్యలకు దిగారు. చెరువు పరిధిలో ఏర్పాటు చేసిన అక్రమ షెడ్లను కూల్చివేసి, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపారు.

ఫాక్స్సాగర్ చెరువు కట్టను ఆనుకుని, చెరువు పరిధిలో బోర్లు వేసి నీటిని విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. చెరువు భూములను ఆక్రమించి షెడ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు రంగంలోకి దిగారు. అక్రమ నిర్మాణాలను తొలగిస్తూ జలవనరుల పరిరక్షణకు చర్యలు చేపట్టారు.

చెరువు పరిసరాల్లో కొంతకాలంగా అక్రమ నీటి వ్యాపారం కొనసాగుతున్నప్పటికీ, సంబంధిత అధికారులను మేనేజ్ చేస్తూ కొందరు ఈ కార్యకలాపాలు సాగిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, చెరువు భూముల ఆక్రమణలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

నగరంలో నీటి అవసరాలు పెరుగుతున్న నేపథ్యంలో చెరువులు, కుంటల పరిరక్షణ అత్యంత కీలకంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో జలవనరుల పరిధిలో ఆక్రమణలు, అనుమతులు లేని నిర్మాణాలు, అక్రమ నీటి వ్యాపారంపై అధికారులు కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. ఫాక్స్సాగర్ పరిసరాల్లో అక్రమ కార్యకలాపాలపై నిఘా కొనసాగిస్తూ, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ ఏఎంసీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్

హైదరాబాద్ ( మల్లేష్ మీవార్త ప్రతినిధి) :



వరంగల్--ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇన్చార్జ్గా నియమితులైన పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని నర్సంపేట మాజీ ఏఎంసీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ హైదరాబాద్లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నర్సంపేటనియోజకవర్గంలో పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని వేగవంతం చేయడంతో పాటు, పార్టీ బలోపేతానికి చేపట్టాల్సిన చర్యలపై ఇరువురు చర్చించారు.నర్సంపేటనియోజకవర్గంలో అధిక సంఖ్యలో పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించి, పార్టీ అభ్యర్థి విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని బత్తిని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డికి ఎమ్మెల్సీ నియోజకవర్గ ఇన్చార్జ్ బాధ్యతలు అప్పగించడంపై నర్సంపేట నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణుల్లో హర్షం వ్యక్తమవుతోంది.

## బాలకృష్ణ నగర్లో వీధి దీపాల సమస్యకు పరిష్కారం

- యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ చొరవతో 10 వీధి దీపాల ఏర్పాటు

వెంకట్ రెడ్డి నగర్, అక్టోబర్ 27 ( మన మీ వార్త):



బాలకృష్ణ నగర్లో వీధి దీపాల సమస్యకు పరిష్కారం లభించింది. కాలనీలో వీధి దీపాలు లేక రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కాలనీవాసులు ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై వెంటనే స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో మాట్లాడి కాలనీలో 10 వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.
ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని అరుణ్ పటేల్ తెలిపారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు.వీధి దీపాల ఏర్పాటు ద్వారా కాలనీలో రాత్రి వేళల్లో వెలుతురు సమస్య తీరడంతో కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఆకారపు అరుణ్ పటేల్కు కృతజ్ఞతలు తెలిపారు.ప్రజలతో కలిసి పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.

## గవర్నర్ కోటా ఎమ్మెల్సీ పదవుల్లో ఇద్దరు బీసీలకు అవకాశం కల్పించాలి

- బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్

భూపాలపల్లి అక్టోబర్ 27 మీ వార్త



ఎలక్షన్ల ముందు బీసీల జపం చేసి, అధికారంలోకి వస్తే విద్యా, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామని నమ్మబలికి..కామారెడ్డి డిక్లరేషన్ పేరుతో బీసీలను నమ్మించి..బీసీల ఓట్లను దండుకొని అధికారంలోకి వచ్చాక..బీసీల వ్యతిరేక వైఖరిని అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం..బీసీల అవలంబిస్తున్న వ్యతిరేక వైఖరిని మార్చుకొని..వచ్చే నెలలో గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న మూడు ఎమ్మెల్సీ నామినేటెడ్ పదవుల్లో రెండు నామినేటెడ్ ఎమ్మెల్సీ పదవులను బీసీలకు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జనాభాలో సగ భాగానికి పైగా ఉన్న బీసీలకు రాజకీయ పదవులు, నిర్ణయాధికారంలో తగిన ప్రాతినిధ్యం దక్కడం లేదని ఆవేదనను వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో అగ్రవర్ణ పార్టీలు బీసీలను ఓటర్లు గానే పరిగణిస్తున్నారని, ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులోనూ ఆర్థిక స్తోమత లేదనే కారణాలతో ఎమ్మెల్యే టికెట్లను నిరాకరిస్తున్నారని మండిపడ్డారు. బీసీలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకుండా..సామాజిక న్యాయం సాధ్యం కాదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఇద్దరు రెడ్లకు టికెట్లను కేటాయించి బీసీలను తీవ్రంగా అవమానించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. త్వరలో గవర్నర్ కోటాలో భర్తీ చేయనున్న ఎమ్మెల్సీ పదవుల్లో అర్హత, సామాజిక సేవ, పార్టీ పట్ల నిబద్ధత కలిగిన బీసీ నాయకులకు అవకాశం కల్పించాలని వేణుగోపాల్ గౌడ్ కాంగ్రెస్ అధిష్టానానికి సూచించారు.

## చామన్ పెల్లి గ్రామం లో స్టీల్ ప్లేట్లు, గ్లాసుల పంపిణీ చేసిన సర్పంచ్ లక్ష్మి సుదర్శన్

లక్ష్మన్ చందా, అక్టోబర్ 27(మన మీ వార్త)



మండలంలోని చామన్ పల్లి గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ అయిట్ల లక్ష్మీ సుదర్శన్ గారి ఆధ్వర్యంలో మంగళవారం రోజున గ్రామ ప్రజలకు విద్యార్థులకు స్టీల్ ప్లేట్లు స్టీలు గ్లాసులు పంపిణీ చేయడం జరిగింది. గ్రామ ప్రజల కోసం 1,000 స్టీల్ ప్లేట్లు, 1,000 స్టీల్ గ్లాసులను పంపిణీ చేశారు. సామూహిక కార్యక్రమాలకు ఉపయోగపడేలా ఈ పాత్రలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, ప్రజల ఆరోగ్యాన్ని మెరుగుపరచడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ప్రతి ఒక్కరు ప్లాస్టిక్ వస్తువులను పక్కనపెట్టి, ఇలాంటి స్టీలు పాత్రలను ఉపయోగించాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో కూడా గ్రామ అభివృద్ధి కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపడతామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఏలేటి గంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి గంగ సాగర్,వార్డు సభ్యులు కొమ్ముల మహిపాల్ రెడ్డి, అయిట్ల నవీన్, బడుగరి మహేష్, బొమ్మెన మధు, నూకల రమణ, మెతుకు రమేష్, గోలి వినోద్, సుంకరి నారాయణ, ఎఫ్ఏ శ్రీనివాస్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సోమనాథ్ ద్వారక బయలుదేరిన ఆర్టీసీ బస్సు



నిర్మల్ జిల్లా, అక్టోబర్ 27(మన మీ వార్త)

ఆర్టీసీ నిర్మల్ నుండి మంగళవారం రోజు 6 జ్యోతిర్లింగాలు యాత్ర సోమనాథ్-ద్వారకా బస్సు డిపోమేనేజర్ కే పండరి ప్రారంభించారు.
ఈ యాత్ర బస్సు ఈ రోజు బయలుదేరి నాందేడ్ గురుద్వార్, భద్ర మారుతి, గృష్ణేశ్వర్ జ్యోతిర్లింగం ఎల్లోరా, శని సిగ్నాపూర్, షిర్డీ, నాసిక్,త్రయంబకేశ్వర్, నిష్కలంక మహాదేవ్, సోమనాథ్ జ్యోతిర్లింగం, ద్వారకా శ్రీ కృష్ణుడి రాజ్యం,నాగేశ్వర జ్యోతిర్లింగం,ఉజ్జయిని మహాకాళేశ్వర్ జ్యోతిర్లింగం, ఓంకారీశ్వర్ జ్యోతిర్లింగం దర్శించుకొని, నవంబర్ 2 న నిర్మల్ చేరుకుంటుందని డిపోమేనేజర్ కే పండరి తెలిపారు. ప్రయాణికుల ఆధారంభిమాణాలతో
నిర్మల్ డిపో పరిధిలో ఎన్నో యాత్రల కొరకు బస్సులు పెట్టాము.విజయవంతం చేశారు. తర్వాత ట్రిప్ నవంబర్ లో ఉంటుంది కర్ణాటక యాత్రలో మంత్రాలయం,హంపి,కుక్కే సుబ్రమణ్యం,ధర్మ స్థల, ఉడిపి,మురుడెష్వర్ ర్, గోకర్ణ లాంటి ప్రాంతాలకు వెళ్తుందని తేదీ నిర్ణయించి చెపుతామని మరిన్ని వివరాలకు 9959226003, 9440018549 లో సంప్రదించాలని ఆయన తెలిపారు.

## హనుమకొండ ప్రతి సొసైటీకి కొత్త పంట రుణాల కింద రూ.10 లక్షలు కేటాయింపు

– హనుమకొండ జిల్లా కలెక్టర్, డీసీసీబీ పర్సన్-ఇన్-ఛార్జి కమిటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయి





మన మీ వార్త అక్టోబర్ 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

ప్రతి సొసైటీకి కొత్త పంట రుణాల కింద రూ.10 లక్షలు కేటాయిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్, డీసీసీబీ పర్సన్-ఇన్-ఛార్జి కమిటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్ పాయి ప్రకటించారు.

వరంగల్ డీసీసీబీ మహాజనసభ సమావేశం

వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు మహాజనసభ సమావేశం హనుమకొండ జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్, బ్యాంకు పర్సన్-ఇన్-ఛార్జి (గాఅజ) కమిటీ అధ్యక్షురాలు చాహత్ బాజ్‌పాయ్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు బ్యాంకు ఐ=/గాణ వెంకటేశ్వర్లు, +వీ ఉషాశ్రీ, ఇతర బ్యాంకు అధికారులు, గాజా అధ్యక్షులు, ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

ఈ సమావేశంలో 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ సర్టిఫికేషన్, వార్షిక ఆర్థిక నివేదికలు, బ్యాలెన్స్ షీట్, లాభనష్టాల ఖాతా, నికర లాభాల వినియోగం ఆడిటర్ల నియామకం వంటి అంశాలను పరిశీలించారు. బ్యాంకు 2025--26 ఆర్థిక సంవత్సరంలో రూ.10.23 కోట్ల నికర లాభాన్ని సాధించగా, సభ్యగాజులకు రూ.1.53 కోట్ల డివిడెండ్ ప్రకటించారు.

జిల్లా కలెక్టర్ 50% కంటే ఎక్కువ రికవరీ సాధించిన అర్హతగల సొసైటీలకు రూ.50 లక్షల వరకు, మిగిలిన గా, దీ కేటగిరీ ఆడిట్ ర్యాంకింగ్ సొసైటీలకు రూ.30 లక్షల వరకు దీర్ఘకాలిక రుణాల (గా రాశీఖఅం) సదుపాయం కల్పించే అంశాన్ని వెల్లడించారు.

రుణ బకాయిదారులకు ఉపశమనం కల్పించేందుకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ (గూ) పథకాన్ని 31 మార్చి 2027 వరకు పొడిగిస్తున్నట్లు తెలిపారు.

బ్యాంకు శాఖల విస్తరణలో భాగంగా భూపాలపల్లి, ములుగు, ఘనపూర్ శాఖల భవన నిర్మాణాలకు స్థల కేటాయింపు ప్రక్రియ పూర్తయినట్లు వెల్లడించారు. గూడూరు బ్రాంచ్ కి చెందిన కస్టమర్ కంచె సునీల్ ప్రమాద మరణ బీమా క్లెయిమ్ కింద రూ.2 లక్షల పరిహార చెక్కును బాధిత కుటుంబానికి అందజేశారు. కొన్ని సొసైటీల ప్రతినిధులు బ్యాంకు అనుబంధం (గాటటఅశ్రీఖ్అశీఅ) గురించి లేవనెత్తిన ప్రశ్నలకు అదనపు కలెక్టర్ ఎన్. రవి గాఅజ కమిటీ సభ్యులు సానుకూలంగా స్పందించి, సంబంధిత అంశాలను పరిశీలిస్తామని తెలిపారు. సహకార సంఘాల ఆర్థిక బలోపేతం, రుణ సదుపాయాల విస్తరణ, రికవరీ మెరుగుదల రైతులకు మెరుగైన సేవలు అందించడంపై సమావేశంలో చర్చించారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎన్. రవి, హనుమకొండ ఐజూ బి. మోహన్,జజూ మహ్మద్ వజీర్ సుల్తాన్ వరంగల్ ఐజూ నిరజ, నాబార్డ్ ఐఐవీ చంద్రశేఖర్, భూపాలపల్లి ఐజూ వల్యా నాయక్, మహబూబాబాద్ ఐజూ సర్దార్ సింగ్ పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదులో అధిక సంఖ్యలో పాల్గొనాలి

– మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు



ఖానాపురం అక్టోబర్ 27 (మల్లేష్ మీవార్త ప్రతినిధి) :

వరంగల్--ఖమ్మం--నల్గొండ ఉమ్మడి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటరు నమోదు ప్రక్రియ తుది దశకు చేరుకున్న నేపథ్యంలో ఖానాపురం మండలంలోని అర్హులైన ప్రతి పట్టభద్రుడు తమ పేరును ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీపీ వేములపల్లి ప్రకాష్ రావు కోరారు.మంగళవారం ఖానాపురం మండలం రాగంపేట గ్రామంలో నిర్వహించిన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, 2023 అక్టోబర్ 31 నాటికి డిగ్రీ పూర్తి చేసిన అర్హులైన పట్టభద్రులు ఫారం-18 ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటరు నమోదుపై పట్టభద్రులు అవగాహన కలిగి ఉండాలని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. పట్టభద్రులు పెద్ద సంఖ్యలో ఓటరు నమోదులో పాల్గొని, ప్రజాస్వామ్య ప్రక్రియలో తమ భాగస్వామ్యాన్ని చాటుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అలాగే బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఏపూరి వెంకన్న, సిరిపోతుల వీరస్వామి, ఖానాపూర్ క్లస్టర్ ఇన్‌చార్జి ఆబోతు అశోక్, అన్నబోయిన శ్రీనివాస్, మద్దికాయల శ్రీను, కందిమల్ల బిక్షపతి, కత్తి సుమన్, గొడిశాల రాంబాబు, పోతరాజు దేవేందర్, బొమ్మెర మునేందర్, తోట అరవింద్ తదితరులు పాల్గొన్నారు. గ్రామస్తులు కూడా అధిక సంఖ్యలో హాజరయ్యారు.

# బెస్ట్ సోషల్ వర్కర్ ఇంటర్నేషనల్ అవార్డుకు స్వాతి కురేటి ఎంపిక

– నవంబర్ 15న న్యూఢిల్లీలో అవార్డు ప్రదానం

– ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు సేవలందిస్తున్న స్వాతి కురేటి

నాచారం, అక్టోబర్ 27 ( మన మీ వార్త):

బెస్ట్ సోషల్ వర్కర్ ఇంటర్నేషనల్ అవార్డు--2026కు కాప్రాకు చెందిన స్వచ్ఛంద సేవకురాలు, స్పెషల్ ఫ్రెండ్స్ సంస్థ నిర్వాహకురాలు స్వాతి కురేటి ఎంపికయ్యారు. ఈ విషయాన్ని జాతీయ అవార్డు ఎంపిక కమిటీ ప్రకటించింది. ఈ అవార్డుకు సంబంధించిన ఆహ్వాన పత్రాన్ని బహుజన సాహిత్య అకాడమీ జాతీయ కార్యాలయంలో జాతీయ అవార్డు సెలక్షన్ కమిటీ చైర్మన్, బహుజన సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ స్వాతి కురేటికి అందజేశారు.కాప్రాలో ప్రత్యేక అవసరాలున్న పిల్లల కోసం ఒక సంస్థను నిర్వహిస్తున్న స్వాతి కురేటి, స్పెషల్ ఫ్రెండ్స్ స్వచ్ఛంద సంస్థ ద్వారా పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. దివ్యాంగులైన పిల్లల సంక్షేమం, అభివృద్ధి కోసం ఆమె చేస్తున్న సేవలను గుర్తించి ఈ అంతర్జాతీయ అవార్డుకు ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

నవంబర్ 15న దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించనున్న బహుజన సాహిత్య అకాడమీ 20వ జాతీయ మహాసభల సందర్భంగా స్వాతి కురేటికి ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి




ప్రపంచంలోని 10 దేశాలతో పాటు భారతదేశంలోని 28 రాష్ట్రాల నుంచి సుమారు 1,000 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. అవార్డు గ్రహీతగా పాల్గొనడంతో పాటు, అతిథిగా హాజరై సామాజిక సేవపై స్వాతి కురేటి ప్రసంగించనున్నారు.

ఈ సందర్భంగా నల్లా రాధాకృష్ణ మాట్లాడుతూ.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాహిత్యాన్ని ప్రోత్సహించడంతో పాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందించే లక్ష్యంతో బహుజన సాహిత్య అకాడమీ ప్రతి సంవత్సరం ప్రజా ఉద్యమకారులు, సామాజిక సేవకులు, రచయితలు, కవులు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులు అందజేస్తోందని తెలిపారు. సమాజానికి సేవలందిస్తున్న వారిని గుర్తించి ప్రోత్సహించడమే ఈ అవార్డుల ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.స్వాతి కురేటికి అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందజేసిన వారిలో బహుజన


बहुजन साहित्य अकादमी (B.S.A.)
BAHUJANA SAHITYA ACADEMY
INTERNATIONAL COMMITTEE
Founder President Radha Krishna Nalla
Founder Gen. Secretary Dr. U. Subramanian
Best Social Worker International Award
Dear Sir / Madam
We have the pleasure to inform you that the Selection Committee of International Awards of Bahujana Sahitya Academy (BSA) has selected your name for the Best Social Worker International Award.
You will be honoured by this Prestigious Award in the Bahujana Sahitya Academy 20th National Conference on 15th November 2026
Karol Bagh, New Delhi.
Academy will provide you a delegate file, Memento and Citation with Lunch during the Conference.
Please send your Acceptance Letter & your Bio-Data along with your Latest photograph for the 'ACADEMY'S BOOK OF RECORDS.
With best wishes.
Swathi Kureti
Medchal - Malkajgiri
Telangana State
Yours Sincerely
Nalla Radha Krishna
Founder President - BSA

సాహిత్య అకాడమీ జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యులు టేకి రాజశేఖర్, కనుకుంట్ల విజయ్ కుమార్, అవార్డు సెలక్షన్ కమిటీ సభ్యుడు కొమ్ముగు వెంకటేశ్వర్లు, మండల ఈశ్వరరావు తదితరులు ఉన్నారు.

# కీసర సర్కిల్‌లో అభివృద్ధి పనుల పరిశీలన

– వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు కమిషనర్ ఆదేశం

జవహర్ నగర్, అక్టోబర్ 27 (వార్త ప్రతినిధి) :

కీసర సర్కిల్ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను మేడ్చల్-మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

శనివారం జరిగిన ఈ పర్యటనలో సర్కిల్ పరిధిలో జరుగుతున్న నాలాల అభివృద్ధి పనులు, ప్రధాన జంక్షన్ల



సుందరీకరణ పనులను, అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న 'స్వచ్ఛ బడి' కార్యక్రమాన్ని ఆయన స్వయంగా తనిఖీ చేశారు.

పనుల నాణ్యత, పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్న కమిషనర్, పనులన్నీ నాణ్యతతో, నిర్ణీత సమయంలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఎక్కడా అలసత్వం వహించవద్దని సూచించారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రామలింగం, SWM DE సంతోష్, మెయింటెనెన్స్ DE మాధవచారి, పద్మలత,AE అనిల్, టౌన్ ప్లానింగ్ అధికారులు, చైన్‌మెన్‌లు మరియు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# మల్లికార్జున్ నగర్ అభివృద్ధికి అండగా ఉంటా

– మాజీ మేయర్ కోటేష్ గౌడ్

జవహర్ నగర్, అక్టోబర్ 27 :(వార్త ప్రతినిధి)

మల్లికార్జున్ నగర్ కాలనీలోని మౌలిక సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి తన వంతుగా పూర్తిగా సహకరిస్తానని జవహర్ నగర్ మాజీ మేయర్, డివిజన్-3 కాంగ్రెస్ అధ్యక్షులు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్ భరోసా ఇచ్చారు.

కాలనీలో నెలకొన్న రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాలనీ నూతన కమిటీ ప్రతినిధులు సోమవారం (అక్టోబర్ 26) మాజీ మేయర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

కాలనీ అధ్యక్షురాలు ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శి కె. బాలు నేతృత్వంలో కమిటీ సభ్యులు మాజీ మేయర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపిన కోటేష్ గౌడ్, కాలనీ అభివృద్ధికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కాలనీ సమస్యలను సంబంధిత మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారమయ్యేలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కమిటీ సభ్యులంతా ఐక్యంగా ఉండి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా నూతన కమిటీకి అభినందనలు తెలిపిన మాజీ మేయర్‌కు కాలనీ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో కోశాధికారి జలంధర్, సలహాదారులు వెంకటేష్, మహేష్, సారమ్మ, ఈశ్వర్, కాంగ్రెస్ నాయకులు బల్లి శ్రీనివాస్, సత్యం వంశరాజ్,



ఎర్రగుడ్ల వెంకటేశ్వర్, గజ్వేల్ శంకర్, మాజీ కార్పొరేటర్ ప్రేమల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# జనగణన--2027 రెండో దశ జనాభా గణనపై అధికారులకు శిక్షణ






– ఖచ్చితమైన గణాంకాలే సమర్థవంతమైన అభివృద్ధికి పునాది: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

మన మీ వార్త అక్టోబర్ 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

జనగణన--2027 కార్యక్రమంలో భాగంగా రెండో దశ జనాభా గణన నిర్వహణపై జిల్లా, సబ్ డిస్ట్రిక్ట్, ఛార్జ్ స్థాయి అధికారులకు ఈ నెల 27, 28 తేదీలలో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, ఐఏఎస్ ముఖ్య అతిథిగా పాల్గొని జనగణన ప్రాముఖ్యత, జనాభా గణన నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమాచార సేకరణలో ఖచ్చితత్వం, పారదర్శకత, అధికారుల బాధ్యతలు తదితర అంశాలపై దిశానిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా జనగణన దేశ అభివృద్ధి ప్రణాళికల రూపకల్పనకు ఎంతో కీలకమని, ప్రజల నుంచి సేకరించే సమాచారం ఖచ్చితంగా, నిష్పక్షపాతంగా ఉండేలా అధికారులు, సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

జనగణనలో సేకరించే గణాంకాలు భవిష్యత్తు అభివృద్ధి కార్యక్రమాల ప్రణాళికకు కీలక ఆధారంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

ఈ శిక్షణ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన జిల్లా సెన్సస్ ఆపరేషన్స్ విభాగం ఎస్వో, శిక్షణ అధికారి సతీష్ అధికారులకు శిక్షణ అందించారు.

జనగణన విధివిధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకుని, క్షేత్రస్థాయిలో జనాభా గణనను సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు సిద్ధం కావాలని సూచించారు.

శిక్షణ కార్యక్రమంలో భాగంగా జనాభా గణన ప్రక్రియ, సమాచార నమోదు విధానం, సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, సందేహాల నివృత్తి, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యల పరిష్కారం వంటి అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్,అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం. విజయలక్ష్మి, వరంగల్ నర్సంపేట ఆర్డీవోలు సుమ ఉమారాణిలు, ముఖ్య ప్రణాళిక అధికారి పి. చంద్రకళ, సంబధిత మండలాల తహసీల్దార్లు, ఎస్వో సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

## హనుమకొండ ఎక్సైజ్ శాఖకు సంబంధించిన ప్రజావాణి దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలి

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

మన మీ వార్త అక్టోబర్ 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో ఎక్సైజ్ శాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షా సమావేశం

ప్రజావాణి కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖకు సంబంధించి వచ్చిన దరఖాస్తులను వేగవంతంగా పరిష్కరించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఎక్సైజ్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఎక్సైజ్ శాఖ అధికారులతో వారి కార్యకలాపాల పైన కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎక్సైజ్ శాఖ కార్యాలయాలు, జిల్లాలో అక్రమ మద్యంపై ఇప్పటి వరకూ నమోదు చేసిన కేసులు, బెల్ట్ షాపుల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను ఎక్సైజ్ శాఖ అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన 27 దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు.

ఈ సమావేశంలో ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ శ్రీనివాస్ రావు, ట్రైనీ అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నీలోఫర్ అజ్మీ, సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

## ములుగు జిల్లా.అర్నబ్ తుపానుపై అప్రమత్తంగా ఉండాలి.

**- మండలాల్లోనే అధికారులు అందుబాటులో ఉండాలి.**

**- పంటల రక్షణ, సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలి.**

**- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు.**

మన మీ వార్త అక్టోబర్ 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



అర్నబ్ తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశమున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు.

ప్రజలకు ముందస్తు సమాచారం అందిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

మంగళవారం జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు, జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలతో గూగుల్ మీట్ నిర్వహించి మండలాల వారీగా ముందస్తు ఏర్పాట్లపై సమీక్షించి దిశా నిర్దేశం చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ శాఖ సూచనల ప్రకారం అక్టోబర్ 28 ఉదయం 8:30 గంటల నుంచి 29 ఉదయం 8:30 గంటల వరకు జిల్లాలో భారీ నుంచి అతిభారీ వర్షాలతోపాటు కొన్ని చోట్ల అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపారు. గంటకు 50--60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే సూచనలున్నాయని, 30వ తేదీ ఉదయం వరకు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తత కొనసాగించాలని సూచించారు.

రాబోయే మూడు రోజుల పాటు అధికారులు తమ ప్రధాన కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు, మండల సంబంధిత శాఖల అధికారులు, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకొని సిబ్బందికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. రాత్రి వేళల్లో స్పందించేందుకు ప్రతి మండలంలో ఒక సీనియర్ అధికారిని నియమించి, వారి పేరు, ఫోన్ నంబరుతోపాటు విధుల్లో ఉండే సిబ్బంది వివరాలను జిల్లా కార్యాలయానికి పంపించాలని సూచించారు.

రైతులను ముందుగానే అప్రమత్తం చేసి పంట రక్షణ చర్యలపై వ్యవసాయ శాఖ అధికారులు సూచనలు అందించాలన్నారు. వరద ముప్పున్న ప్రాంతాల్లోని గర్భిణులను గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించి, వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలన్నారు.

అగ్నిమాపక, మత్స్య, నీటిపారుదల శాఖలు అప్రమత్తంగా ఉంటూ అవసరమైన ప్రాంతాల్లో పడవలు, గజ ఈతగాళ్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. సహాయక చర్యల కోసం ఎన్డీఆర్ఎఫ్ బృందం ఏటూరునాగారం చేరుకుందని తెలిపారు.

గోదావరికి ఎగువ నుంచి వచ్చే వరద ప్రవాహాన్ని నిరంతరం అంచనా వేయాలని ఆదేశించారు. స్థానిక వాగులు తక్కువ సమయంలోనే ఉప్పొంగే ప్రమాదమున్నందున జంపన్నవాగు, దయ్యాలవాగు, జీడివాగు, గుండ్లవాగు ప్రాంతాల్లో సిబ్బందిని నియమించి పర్యవేక్షించాలన్నారు. చెరువు కట్టలు, లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచి, అవసరమైన చోట రాకపోకలను నియంత్రించాలని సూచించారు.

ఈదురుగాలులకు చెట్లు, విద్యుత్ స్తంభాలు కూలే ప్రమాదమున్నందున సంబంధిత శాఖలు సిద్ధంగా ఉండాలన్నారు. విద్యుత్, తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే స్పందించాలని ఆదేశించారు. ప్రజలు ఉరుములు, మెరుపుల సమయంలో పక్కా భవనాల్లో ఆశ్రయం పొందాలని, చెట్ల కింద నిలబడవద్దని, వాగులు, వరద ప్రవాహాలను దాటవద్దని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, జిల్లా అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఎంటీ నగర్‌లో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాయిజెన్ శేఖర్ ఆధ్వర్యంలో ఓటరు నమోదు కార్యక్రమం

నాచారం, అక్టోబర్ 27 ( మన మీ వార్త):




పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఓటరు నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు అర్హులైన పట్టభద్రులు ఓటర్లుగా నమోదు చేసుకునేందుకు వీలుగా హెచ్ఎంటీ నగర్ డివిజన్ పరిధిలో ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేశారు. హెచ్ఎంటీ కమాన్ పక్కన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సాయిజెన్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక ఓటరు నమోదు క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలనుకునే అర్హులైన పట్టభద్రులకు అవసరమైన సహకారం అందించారు. పట్టభద్రులు ఓటరు నమోదుపై అవగాహన కలిగి ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని నిర్వాహకులు సూచించారు.

ఈ కార్యక్రమంలో మేకల ముత్యం రెడ్డి, యాదగిరి రెడ్డి, బాల్ రెడ్డి, వేముల మారయ్య, మక్బూల్ భాయ్, కట్ట బుచ్చన్న గౌడ్, వీరాంజనేయులు, చంద్రశేఖర్, కోటి, సంతోష్, శ్రీనివాస్ యాదవ్, వాసు తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి : సీఐ శ్రీనివాస్

**- ఎస్ఆర్ ఒకేషనల్ కళాశాలలో సైబర్ క్రైమ్‌పై అవగాహన**

నర్సంపేట, అక్టోబర్ 27(మల్లేష్ మీ వార్త ప్రతినిధి) :




విద్యార్థులు మొబైల్ ఫోన్ల వినియోగాన్ని తగ్గించి, సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని నర్సంపేట సీఐ ఎం. శ్రీనివాస్ సూచించారు. మంగళవారం నర్సంపేట పట్టణంలోని ఎస్ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సైబర్ క్రైమ్ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను అవసరమైన మేరకే వినియోగించాలని సూచించారు. అపరిచిత వ్యక్తులు పంపించే లింకులను తెరవకూడదని, ఓటీపీలు, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. ఉద్యోగాల పేరుతో, బహుమతుల ఆశ చూపుతూ జరిగే ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.

౦అనంతరం ఎస్ఐ నిహారిక మాట్లాడుతూ, సైబర్ నేరగాళ్లు వివిధ మార్గాల్లో ప్రజలను మోసం చేస్తున్నారని, విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని బాధ్యతాయుతంగా వినియోగించుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచిత వ్యక్తులతో వ్యక్తిగత వివరాలు, ఫొటోలు పంచుకోవద్దన్నారు. సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112 నంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు. ఆన్‌లైన్‌లో డబ్బులు పోగొట్టుకున్న సందర్భాల్లో వెంటనే ఫిర్యాదు చేయడం ద్వారా నగదు బదిలీని అడ్డుకునే అవకాశం ఉంటుందని వివరించారు.

తెలియని వ్యక్తుల నుంచి బ్యాంకు ఖాతాలో డబ్బులు జమైతే వాటిని స్వయంగా తిరిగి పంపకుండా బ్యాంకు అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. విద్యార్థులు సైబర్ భద్రతా నియమాలను పాటించడంతో పాటు తమ కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని పోలీసు అధికారులు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొయ్యడి సనత్ కుమార్, పారామెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ శిరీష, వైస్ ప్రిన్సిపాల్ సూరయ్య, సంతోష్, వెంకన్న, రమేష్ నాయక్, లయన్ ప్రవీణ్, హరి భూషణ్, సందీప్, శ్వేత, నజీమా, కుమార్‌తో పాటు కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## హనుమకొండ యువతను సామాజిక కార్యక్రమాలలో భాగస్వాములను చేయాలి

**- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి**

మన మీ వార్త అక్టోబర్ 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.





హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో మై భారత్ కో ఆర్డినేటర్లు, అధికారులతో కలెక్టర్ సమావేశం

యువతను పలు సామాజిక కార్యక్రమాలలో భాగస్వాములను చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మై భారత్ కో ఆర్డినేటర్లు, ఇతర అధికారులను ఆదేశించారు.

మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మై భారత్ కో ఆర్డినేటర్లు, అధికారులతో యువత కు సంబంధించిన అంశాలు, హనుమకొండ లోని యూత్ హాస్టల్ నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మై భారత్ పోర్టల్ లో ఎంతమంది యువత నమోదు అయ్యి ఉన్నారు, మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించే వివిధ కార్యక్రమాలను గురించి కలెక్టర్ మై భారత్ జిల్లా అధికారి భూక్యా సంజీవ్ ను అడిగి తెలుసుకున్నారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... టీబీ ముక్త్ భారత్, తదితర సామాజిక కార్యక్రమాలలో మై భారత్ వాలంటీర్లు, యువతను భాగస్వాములను చేయాలన్నారు. శిక్షణకు వచ్చిన మై భారత్ అధికారులు చారిత్రక వరంగల్ జిల్లాలో వేయి స్తంభాల దేవాలయం, రామప్ప, మేడారం, కాకతీయుల కాలం నాటి గొలుసు కట్టు చెరువులు,ఆలయాలను సందర్శించి వాటి ప్రాముఖ్యతను తెలుసుకోవాలని సూచించారు.

అదేవిధంగా హనుమకొండలోని యూత్ హాస్టల్ లో మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపడుతామన్నారు. యూత్ హాస్టల్ లో వసతులు మెరుగ్గా ఉండేలా యువతకు ఉపయోగపడే విధంగా చర్యలు చేపట్టాలన్నారు.

శిక్షణలో భాగంగా జిల్లాకు వచ్చిన వివిధ రాష్ట్రాలకు చెందిన మై భారత్ అధికారులు సుమీ సింగ్, విజయ్ సూర్య, ప్రశాంత్ కుమార్, యష్ మహేశ్వరి, అనూష పారిక్, అబ్దుల్లా అహ్మద్, మెహుల్ బాబూ భాయ్ లతో కలెక్టర్ మాట్లాడారు.

ఈ సందర్భంగా వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ 2026-2027

పోస్టర్లను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు

ఈ సమావేశంలో మై భారత్ జిల్లా అధికారి భూక్యా సంజీవ్, జాతీయ యువజన అవార్డు గ్రహీత మండల పరశురాములు, ఆర్ అండ్ బి డీఈ గోపీ కృష్ణ, ఏఈ ఉదయ్, క్రీడల శాఖ నుండి మౌనిక, పింగళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ రత్నమాల రమా, డాక్టర్ మమత, తదితరులు పాల్గొన్నారు.

## ఈటల రాజేందర్‌తో కలిసి మహా పాదయాత్రలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్







**- ప్రజారోగ్యాన్ని కాపాడే వరకు పోరాటం ఆగదు**

నాచారం, అక్టోబర్ 27 ( మన మీ వార్త) :

జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను తక్షణమే తరలించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ చేపట్టిన 'ఛలో జవహర్‌నగర్' మహా పాదయాత్రలో ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్‌వీఎస్ఎస్ ప్రభాకర్ పాల్గొన్నారు. మంగళవారం ఎదులాబాద్‌లో ప్రారంభమైన ఈ పాదయాత్రలో గౌరవ పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన అడుగులో అడుగు వేస్తూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం తన మద్దతు ప్రకటించారు.డంపింగ్ యార్డ్ నుంచి వెలువడుతున్న భరించలేని దుర్గంధం, భూగర్భ జలాల కలుషితం, వాయు కాలుష్యం కారణంగా పరిసర ప్రాంతాల్లోని వేలాది కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని బీజేపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధుల ఆరోగ్యంపై కాలుష్యం తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. ఈ సమస్యపై పలుమార్లు విజ్ఞప్తులు చేసినప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నాయకులు విమర్శించారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని, డంపింగ్ యార్డ్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేవరకు స్థానిక ప్రజలకు అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

ఈ పాదయాత్రలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి పోతగాని గోపాల్ గౌడ్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు చంద్రమౌళి, కార్మిక విభాగం జిల్లా కన్వీనర్ యోగేశ్వర్ రెడ్డి, హన్మంత్ బిరాదర్, రాజిరెడ్డి, క్రాంతి కుమార్, మంజులవాణి తదితర నాయకులు పాల్గొన్నారు.

## అర్హులందరికీ విబిజి రామ్ జీ పథకం ద్వారా ఉపాధి కల్పించాలి

**- నీటి సంరక్షణ పనులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి: జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**

నిర్మల్ జిల్లా, అక్టోబర్ 27(మన మీ వార్త) :





విబిజి రామ్ జీ పథకం ద్వారా జాబ్ కార్డులు కలిగిన అర్హులందరికీ ఉపాధి కల్పించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నీటి సంరక్షణ పనులను విస్తృతంగా చేపట్టాలని, భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విబిజి రామ్ జీ పథకం అమలుపై సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కల్పిస్తున్న ఉపాధి పనులు, నీటి సంరక్షణ నిర్మాణాల పురోగతిని మండలాల వారీగా సమీక్షించారు.

ప్రతి జాబ్ కార్డుదారుడికి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని, క్లస్టర్ల వారీగా స్థానిక ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అర్హులందరూ పనుల్లో పాల్గొనేలా ప్రోత్సహించాలని సూచించారు. పథకం కింద ఫామ్ పాండ్లు, సోక్ పిట్లు తదితర నీటి సంరక్షణ నిర్మాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు. ఇప్పటికే అనుమతులు పొందిన పనులు, ప్రారంభించిన నిర్మాణాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని, నీటి వృథాను పూర్తిస్థాయిలో అరికట్టాలని కలెక్టర్ ఆదేశించారు. వేసవితో పాటు భవిష్యత్తులోనూ తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన పనులను గుర్తించి ముందస్తు ప్రణాళిక రూపొందించాలని సూచించారు.

సమావేశంలో ఇన్‌చార్జి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాథోడ్ రమేష్, డీఆర్‌డీఓ విజయలక్ష్మి, డీపీఓ శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్ ఈఈలు సందీప్, తుకారాం, అయా మండలాల ఎం పి డి ఓ లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# హనుమకొండ పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ సైకిల్ ర్యాలీ.

మన మీ వార్త అక్టోబర్ 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవంలో భాగంగా వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేతా, ఐపీఎస్ ఆధ్వర్యంలో ఈరోజు నిర్వహించిన సైకిల్ ర్యాలీ ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన కల్పించడంతో పాటు, విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకునే సందేశాన్ని చాటింది. హనుమకొండ కలెక్టర్ చాహత్ బాజ్పాయ్, ఎన్ పి డిసిఎల్ సిఎండి వరుణ్ రెడ్డి, ట్రై సిటీ లోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు ఉత్సాహంగా పాల్గొని పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి సేవలను ఎప్పటికీ మరువకూడదని పేర్కొన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన ఈ సైకిల్ ర్యాలీ వారికి అంకితమైన ఘనమైన నివాళి అని తెలిపారు. సైక్లింగ్ వంటి శారీరక వ్యాయామాలు ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ



దైనందిన జీవితంలో వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు

ఈ కార్యక్రమంలో 60 సంవత్సరాలు పైబడిన వృద్ధులు సైతం ఉత్సాహంగా పాల్గొనడం సంతోషకరమని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.

ముఖ్యంగా 89 సంవత్సరాల వయస్సులోనూ సైకిల్ ర్యాలీలో పాల్గొన్న మామిడి నర్సయ్యను ప్రత్యేకంగా అభినందించారు.

ఆయన ఉత్సాహం అందరికీ స్ఫూర్తిదాయకమని, వయస్సు అనేది వ్యాయామానికి అడ్డంకి కాదని ఈ ర్యాలీ నిరూపించిందని తెలిపారు.



వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ప్రతిరోజూ వ్యాయామం చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ సైకిల్ ర్యాలీ కార్యక్రమాన్ని నిర్వహించిన ఏఆర్ అదనపు డీసీపీలు వి.శ్రీనివాస్, సురేష్, ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, మడికొండ ఇన్స్పెక్టర్ పుల్యాల కిషన్ లను పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.
ఈ కార్యక్రమంలో, సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, హనుమకొండ ఏసీపీ నర్సింహరావు, సీఐలు, ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది, నగరంలోని వివిధ సైక్లిస్ట్ బృందాల సభ్యులు సుమారు 200 మంది పాల్గొన్నారు.

# నాలుగు లేన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలి

- పెండింగ్‌లో ఉన్న అనుమతులు మంజూరు చేసి, అదనపు నిధులు విడుదల చేయాలి:
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి

నిర్మల్ జిల్లా, అక్టోబర్ 27(మన మీ వార్త)

నిజామాబాద్ ఎంపి అరవింద్ మరియు ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన దీక్షలో బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ

కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నాలుగు లేన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో జరుగుతున్న జాప్యంపై బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తొలుత సరైన అంచనాలు రూపొందించకపోవడం వల్లే నిర్మాణ పనులకు ఆటంకాలు ఏర్పడ్డాయని విమర్శించారు. సవరించిన అంచనాల ప్రకారం పెరిగిన నిర్మాణ వ్యయానికి



తక్షణమే పరిపాలనా అనుమతులు మంజూరు చేసి, పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వం తన వాటా నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధుల విడుదలలో జాప్యం చేయడం సరికాదని మహేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న



అనుమతులను వెంటనే మంజూరు చేయడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వం తన వాటా నిధులను సకాలంలో విడుదల చేయాలని తేలియజేశారు.. నిర్మాణ పనులను వేగవంతం చేసి, రైల్వే ఓవర్ బ్రిడ్జిని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు.

# హెబ్రోన్ చర్చి వివాదంలో తప్పుడు కేసులు పెట్టడం రాజ్యాంగ విరుద్ధం

- ప్రభుత్వ ఉద్యోగి, పాస్టర్ అరెస్టులపై విచారణ జరపాలి
- హైదరాబాద్ పోలీస్ కమిషనర్ జోక్యం చేసుకోవాలి: జెరూషలేము మత్తయ్య

హైదరాబాద్, అక్టోబర్ 27 ( మన మీ వార్త):

హెబ్రోన్ చర్చి అంతర్గత వివాదంలో భాగంగా అమాయకులపై తప్పుడు కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నారంటూ ముషీరాబాద్, చిక్కడపల్లి పోలీసుల తీరును క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరూషలేము మత్తయ్య తీవ్రంగా ఖండించారు. చర్చి వివాదంలో న్యాయం కోసం పోరాడుతున్న ప్రభుత్వ ఉద్యోగి కె. వెంకటేశ్వర్లు, పాస్టర్ బానోతు భీమా అలియాస్ బర్నబాస్‌లపై నమోదైన కేసులపై సమగ్ర విచారణ జరపాలని ఆయన డిమాండ్ చేశారు.

మత్తయ్య ఆరోపణల ప్రకారం.. హెబ్రోన్ చర్చి వ్యవహారాలకు సంబంధించి రాగి వీరాచారి అలియాస్ పీటర్ చారి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పోలీసులు మొబైల్ ఫోన్ చోరీ కేసు నమోదు చేశారు. అయితే, మొబైల్ ఫోన్ ఎప్పుడు, ఎక్కడ, ఏ సమయంలో పోయిందనే వివరాలు స్పష్టంగా లేవని, నిందితులుగా పేర్కొన్న వ్యక్తులకు వ్యతిరేకంగా తగిన ఆధారాలు లేకుండానే పోలీసులు చర్యలు తీసుకున్నారని ఆయన ఆరోపించారు.

చర్చి వ్యవహారాలపై న్యాయపరంగా పోరాడుతున్న ప్రభుత్వ ఉద్యోగి కె. వెంకటేశ్వర్లును కొత్తగూడెంలోని ఆయన నివాసం నుంచి పోలీసులు అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తీసుకువచ్చారని తెలిపారు. పాస్టర్ బానోతు భీమా అలియాస్ బర్నబాస్‌ను కూడా అరెస్టు చేసేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఎలైట్ హోటల్‌లో రాగి రవికాంత్‌ను బెదిరించారనే ఆరోపణలకు సంబంధించి సీసీటీవీ ఫుటేజీతో పాటు ఇతర ఆధారాలను పరిశీలించకుండా ఏకపక్షంగా కేసులు నమోదు చేయడం సరికాదని విమర్శించారు.

----చర్చి నిధుల వినియోగంపై విచారణ జరపాలి

హెబ్రోన్ చర్చి ఆస్తులు, భక్తులు సమర్పించే కానుకల నిధుల వినియోగంపై గత కొంతకాలంగా వివాదాలు కొనసాగుతున్నాయని మత్తయ్య ఆరోపించారు. రాగి వీరాచారి కుటుంబ సభ్యులు చర్చి నిర్వహణను తమ ఆధీనంలో ఉంచుకుని, చర్చి నిధులను వ్యక్తిగత అవసరాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలని కోరారు. ఈ వ్యవహారంలో పోలీసులకు, రాజకీయ నాయకులకు లంచాలు ఇచ్చినట్లు పేర్కొంటున్న ఆడియోలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్నాయని, వాటి నిజానిజాలను ఫోరెన్సిక్ నిపుణులతో నిర్ధారించాలని డిమాండ్ చేశారు.

దశాబ్దాల చరిత్ర కలిగిన హెబ్రోన్ చర్చికి, దైవసేవకుడు బ్రదర్ భక్తసింగ్ పేరుకు భంగం కలగకుండా చూడాలని ఆయన అన్నారు. చర్చి ఆస్తులు, పేద క్రైస్తవ భక్తులు సమర్పించే కానుకల నిధుల నిర్వహణ పారదర్శకంగా ఉండేలా ప్రభుత్వం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని పలు క్రైస్తవ సంఘాలు కోరుతున్నాయని తెలిపారు.

----పోలీస్ కమిషనర్ జోక్యం చేసుకోవాలి

హెబ్రోన్ చర్చి వివాదానికి సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర విచారణ జరిపించాలని, సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న ఆడియోలను పరిశీలించాలని, చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మత్తయ్య కోరారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని, ముషీరాబాద్ పోలీసులపై వచ్చిన ఆరోపణలను విచారించి, అక్రమ అరెస్టులు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# డ్రగ్స్ మరియు గుడుంబా రహిత కాలనీగా రాంనగర్

- యువత చెడు దారి పట్టకుండా పాటు పడాలి
- సర్పంచ్ తౌటం లక్ష్మి - అంతయ్య
- గంజాయి గుడుంబా అమ్మే వారి పై ,ఉక్కు పాదంలిమోపుతం.
- ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్



చిట్యాల అక్టోబర్ 27 మీవార్త :

చిట్యాల సర్పంచ్ తౌటం లక్ష్మి అంతయ్య సూచన మేరకు రామ్ నాగర్ కాలనీ 11 వ వార్డ్ సభ్యులు వేల్పుల లక్ష్మి - బాపు ఆధ్వర్యం లో డ్రగ్స్,నిర్మూలన,గంజాయి వలన నష్టాల పై వినూత్న కార్యక్రమం నిర్వహించారు
కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ హాజరై పోస్టర్ విడుదల చేశారు
ఈ సందర్భంగా ఉపసర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ

గుడుంబా మరియు డ్రగ్స్ రహిత కాలనీ కోసం ఇలాంటి ప్రయత్నం చేయడం అభినందనీయమని



పోస్టర్ను ఆవిష్కరిస్తున్న ఉపసర్పంచ్ వెంకటేష్ గౌడ్

, యువకులు మాదకద్రవ్యాలు సేవించకుండా భవిష్యత్తుపై దృష్టి సారించాలని , గంజాయి వలన అనేకమైనటువంటి సమస్యలకు దారితీస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో వార్డ్ సభ్యులు మైదం శ్రావ్య- శ్రీకాంత్, శనిగరపు మొగిలి, కాలని వాసులు గురుకుంట్ల కిరణ్ గారు, కట్కూరి రాజు ,వెంకట్, శశి వర్ధన్, బన్నీ,నాగేంద్రబాబు,తిరుపతి తదితరులు పాల్గొన్నారు

## 4 ట్రాక్టర్ ల పై కేసు నమోదు - ఎస్ఐ పోచంపల్లి సతీష్

చిట్యాల, అక్టోబర్ 27 మీ వార్త :



చిట్యాల మండలం జడల పేట క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా గిద్దెముత్తారం నుండి భూపాలపల్లి వెలుతున్న 4 ఇసుక లోడ్ ట్రాక్టర్లును ఆపి వారి అనుమతి పత్రములు బండి పేపర్లు మరియు లైసెన్సు లు అడగ్గా వారి వద్ద లేవని తెలిపిన ట్రాక్టర్ డ్రైవరు మరియు ఓనర్లు అయిన నేరేడుపల్లి గ్రామానికి చెందిన దువ్వాల ఉమేష్ గొర్లవీడు గ్రామానికి చెందిన సంగ ప్రవీణ్ నేరేడుపల్లి గ్రామానికి చెందిన గాజు దేవేందర్ నాచారం గ్రామానికి చెందిన చెనావేణి రమేష్ ఓనర్ మెట్టు రజనీకాంత్, కొత్తపల్లి భూపాలపల్లికి చెందిన ఒర్సు రాజేందర్ ఓనర్ గుగులోతు రమేష్ ల పై కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్సై పోచంపల్లి సతీష్ తెలిపారు.

## జరిగే సమాధుల పండుగ సందర్భంగా ఏర్పాట్లు నిర్వహించారు

అక్టోబర్ 28, 10,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త



హనంకొండ జిల్లా పరకాల సి.ఎస్.ఐ మిషన్ కాంపౌండ్ నందు నవంబర్ 2 వ తేదీన జరిగే సమాధుల పండుగ సందర్భంగా 1 టవ వార్డు కౌన్సిలర్ దుబాసి వెంకటస్వామి , పరకాల మున్సిపల్ వర్క్ ఇన్స్పెక్టర్ వెంకటరెడ్డి మరియు జవాన్ మహేశ్ గార్ల పనుల పరిశీలనలో సి.ఎస్.ఐచర్చి పాస్టర్ రెవ. యం. సుధాకర్ గారు చర్చ్ సెక్రటరీ బొచ్చు. అశోక్ కమిటీ మెంబెర్స్ పర్యవేక్షణలో శుభ్రత మరియు లైటింగ్ పనులు ప్రారంభించడం జరిగింది.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారిని పరామర్శించిన నిషీధర్ రెడ్డి

అక్టోబర్ 28 ,10,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త



జయశంకర్ భూపాలపల్లి: సోమవారం రేగొండ మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన హరికిషోర్, అఖిల్‌లు ప్రస్తుతం హనుమకొండలోని గార్డెన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు.
విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా అధ్యక్షులు ఏడునూతుల నిషీధర్ రెడ్డి గార్డెన్ హాస్పిటల్‌కు వెళ్లి హరికిషోర్, అఖిల్‌లను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా అవసరమైన చికిత్స అందించాలని వైద్యులను కోరారు.

## ఎమ్మెల్సీ ఓటు నమోదు కోసం ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ నేతలు

- కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒంటరి శ్రావణ్
- తోటి కార్యకర్తలతో కలిసి నిర్వహించారు

అక్టోబర్ 28, 10,2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త



హనంకొండ జిల్లా పరకాల 21వ కౌన్సిల్ పరిధిలో వరంగల్ నల్గొండ ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని ఇంటింటికి ప్రచారంలో భాగంగా గ్రాడ్యుయేట్స్ ఓటు నమోదు కొరకు గ్రాడ్యుయేషన్ కలిసి వాళ్ల ఓటు నమోదు చేయించడం జరిగింది ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఒంటేరు శ్రావణ్ స్థానిక కౌన్సిలర్ సుధమల్ల రమేష్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి జాఫర్ రిజ్వి బివిఎ దేవ్ రమేష్ సీనియర్ నాయకుడు జీడిమెట్ల మహేందర్ లు పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ 10వ వార్డులో నూతన డ్రైనేజ్ నిర్మాణ ప్రారంభోత్సవం చేసిన మున్సిపాలిటీ చైర్మన్ పావుశెట్టి సునీల్



హనంకొండ జిల్లా పరకాల మాధారం కాలనీ పోచమ్మ గుడి నుండి బంధం రోడ్డు వరకు సైడ్ డ్రైనేజ్ నిర్మాణం కోసం స్థానిక కౌన్సిలర్ పసుల లావణ్య రమేష్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ పావుశెట్టి సునిల్, మున్సిపల్ కమిషనర్ పవన్ సమక్షంలో కొబ్బరికాయలు కొట్టి ప్రారంభోత్సవం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు , సమన్వయ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కాలనీ వాసులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరులకు కాగడాలతో శ్రద్ధాంజలి ఘటించారు

అక్టోబర్ 28,10, 2026 పరకాల ప్రతినిధి మన మీ వార్త



హనంకొండ జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలో సి ఐ బాబూలాల్ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించడం జరిగినది విధినిర్వహణలో అమరులైన పోలీసులకు నివాళులు అర్పించడం మైనది ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మన మీ వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం



## నీటి సంరక్షణకు నడుం బిగిద్దాం.. నీటి సంక్షోభాన్ని నివారిద్దాం!

**- నీటి సంరక్షణే భవిష్యత్తుకు పునాది: కంది శ్రవణ్ కుమార్ రెడ్డి**

**హబ్సిగూడ , అక్టోబర్ 27 ( మన మీ వార్త):**




భవిష్యత్తులో నీటి సంక్షోభాన్ని నివారించేందుకు ప్రతి ఒక్కరూ నీటి సంరక్షణకు నడుం బిగించాలని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు.

నీటి పొదుపునకు పాటించాల్సిన సూచనలు:

- సగం గ్లాసు నీరు: అతిథులకు అవసరమైనంత మాత్రమే నీటిని అందించి, మిగిలిపోయే నీటి వృథాను అరికట్టాలి.
- బకెట్‌తో స్నానం: షవర్‌కు బదులుగా బకెట్‌తో స్నానం చేయడం ద్వారా నీటిని పొదుపు చేయవచ్చు.
- నీటి పునర్వినియోగం: వృథాగా పోయే నీటిని ఇతర అవసరాలకు ఉపయోగించుకునేలా చర్యలు తీసుకోవాలి.
- కుళాయి కట్టేయండి: పళ్లు తోముకునే సమయంలో, షేవింగ్ చేసేటప్పుడు కుళాయిని తెరిచి ఉంచకుండా నీటి వృథాను అరికట్టాలి.

**ప్రతి నీటి చుక్కా విలువైనదే!**

నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన పెంపొందించి, నీటి వనరులను కాపాడుకోవాలని కంది శ్రవణ్ కుమార్ రెడ్డి సూచించారు. నేటి నీటి పొదుపు భావితరాల భవిష్యత్తుకు భరోసా ఇస్తుందని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి నీటి సంరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన కోరారు.

## కరాటే పోటీల్లో కాంస్య పతకం సాధించిన కాసిపేట విద్యార్థిని

**కాసిపేట, అక్టోబర్ 27 :(మన మీ వార్త మండల ప్రతినిధి)**



దక్షిణ భారత స్థాయి కరాటే పోటీల్లో కాసిపేట తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ఏడో తరగతి విద్యార్థిని డి. శ్రీవైష్ణవి కాంస్య పతకం సాధించింది. కరాటే ఇండియా అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నం రాజీవ్ ఇండోర్ స్టేడియంలో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించిన సౌత్ జోనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో ఆమె తృతీయ స్థానంలో నిలిచి పతకాన్ని కైవసం చేసుకుంది.

కరాటేతో పాటు యోగా పోటీల్లోనూ శ్రీవైష్ణవి ప్రతిభ కనబరుస్తోందని పాఠశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ప్రిన్సిపాల్‌తో పాటు వ్యాయామ ఉపాధ్యాయుడు పి. శ్రీనివాస్, ఇతర ఉపాధ్యాయులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

## దేవాలయం నుండి ఆదాయం 1.69 లక్షలు

**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (27):**



ఆలయ హుండీ ఆదాయాన్ని మంగళవారం దేవాదాయ శాఖ పర్యవేక్షకులు రంగారావు ఆధ్వర్యంలో లలీత సేవా సమితి ఉప్పల్ బృందం లెక్కించారు.గత ఐదు నెలలకు సంబంధించిన హుండీ ఆదాయం రూ 1 లక్ష 69 వేల 382 వచ్చినట్లు రంగారావు తెలిపారు.హుండీ ద్వారా వచ్చిన ఆదాయాన్ని బ్యాంకులో జమ చేసి, దేవాదాయ శాఖ ఆదేశాల మేరకు ఆలయ అభివృద్ధికి వినియోగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. హుండీలోకి మూషికలు ప్రవేశించి చాలా నోట్లను చించి వేయడంతో నోట్లు పనిచేయకుండా పోయాయి.కార్యక్రమంలో ఆలయ ఈవో సార శ్రీనివాస్,సర్పంచ్ అరుణ సురేందర్ రెడ్డి,ప్రధాన అర్చకులు ధనుంజయ శర్మ, ఆలయ క్లర్క్ నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ ప్రభాకర్ భక్తులు పాల్గొన్నారు.



హుండీలోకి ప్రవేశించి ఎలుకలు చింపిన నోట్లు

## డీఏపీ బస్తాకు రూ.100 అధిక వసూలు

**-బిల్లు అడిగితే నిరాకరించారని రైతు ఆవేదన..**

**-డీలర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్**

**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (27):**





ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తున్న ఫర్టిలైజర్ డీలర్‌పై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని మంగళవారం రైతు మాధవరెడ్డి డిమాండ్ చేశారు.మండల పరిధిలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలోని శ్రీలక్ష్మి ఫర్టిలైజర్ దుకాణంలో డీఏపీ ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన నిర్ణీత ధర కంటే అధికంగా విక్రయించారని ఆయన ఆరోపించారు.

మనోహరాబాద్ మండలం పోతారం గ్రామానికి చెందిన రైతు మాధవరెడ్డి రెండు డీఏపీ బస్తాల కోసం సోమవారం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్నారు. మంగళవారం పెద్దగొట్టిముక్ల లోని శ్రీలక్ష్మి సీడ్స్ దుకాణంలో డీఏపీ బస్తాలు అందుబాటులో ఉన్నట్లు చూపించడంతో అక్కడికి వెళ్లి ఎరువులు కొనుగోలు చేశారు.అయితే ఒక్కో డీఏపీ బస్తాను రూ.1,350కు విక్రయించాల్సి ఉండగా, రూ.1,450 చొప్పున వసూలు చేశారని రైతు తెలిపారు.ఒక్కో బస్తాపై రూ.100 అదనంగా తీసుకున్నారని,దీనిపై బిల్లు అడిగితే ఇవ్వడానికి నిరాకరించారని మాధవరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ఎరువులను నిర్ణీత ధరలకే విక్రయించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, అధిక ధరలు వసూలు చేసిన సంబంధిత డీలర్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ విషయంపై శ్రీలక్ష్మి సీడ్స్ డీలర్‌ను సంప్రదించగా,రవాణా ఛార్జీలు ఎక్కువ కావడంతో రైతు నుంచి అదనపు డబ్బులు వసూలు చేసినట్లు తెలిపారు.ఈ విషయమై ఏవో లావణ్య సంప్రదించగా సంబంధిత డీలర్ పై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జనగామ తుఫాను నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలి

**- అధికారులు అప్రమత్తంగా ఉండాలి.. 24 గంటల పాటు కంట్రోల్ రూమ్‌ల నిర్వహణ**

**- సెలవులు రద్దు.. అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ విడిచి వెళ్లరాదు**

**- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

**మన మీ వార్త అక్టోబర్ 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

బంగాళాఖాతంలో ఏర్పడిన 'అర్ణబ్' తుఫాను ప్రభావంతో జిల్లాకు అక్టోబర్ 28, 29 తేదీలలో ఎల్లో అలర్ట్ జారీ అయిన నేపథ్యంలో సంబంధిత శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.

ఈ మేరకు విపత్తు నిర్వహణకు సంబంధించి ముందస్తు జాగ్రత్త చర్యలు, ఏర్పాట్లపై ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలని స్పష్టం చేశారు.

**కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు**

జిల్లా కలెక్టరేట్‌లో అక్టోబర్ 27వ తేదీ ఉదయం 6 గంటల నుంచి తదుపరి ఆదేశాలు వచ్చే వరకు 24 గంటల పాటు జిల్లా ఎమర్జెన్సీ కంట్రోల్ రూమ్ పనిచేస్తుంది. కంట్రోల్ రూమ్ నోడల్ అధికారిగా సి-6 సెక్షన్ సూపరింటెండెంట్ వ్యవహరించనుండగా, మొత్తం బాధ్యతను జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) పర్యవేక్షిస్తారు. కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ 08716-1077 అందుబాటులో ఉంటుంది. అదే విధంగా ప్రతి తహశీల్దార్ కార్యాలయంలోనూ మండల స్థాయి కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి నిరంతరం అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.

అధికారులు, సిబ్బంది సెలవులు రద్దుజిల్లా అధికారులు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, నీటిపారుదల, ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, టీజీఎన్‌పీడీసీఎల్ ఇంజనీరింగ్ అధికారులు, వైద్యాధికారులు, వ్యవసాయాధికారులు, గ్రామ పాలన అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అక్టోబర్ 27 నుంచి 31వ తేదీ వరకు మంజూరైన అన్ని రకాల సెలవులను రద్దు చేశారు. కలెక్టర్ ముందస్తు అనుమతి లేకుండా ఏ అధికారి కూడా తమ హెడ్‌క్వార్టర్స్‌ను విడిచి వెళ్లరాదని స్పష్టం చేశారు.



చెరువులు, నీటి వనరులపై నిరంతర పర్యవేక్షణ

జిల్లాలోని మైనర్ ఇరిగేషన్ చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లలో ప్రస్తుత నీటి నిల్వల వివరాలను అక్టోబర్ 27వ తేదీ నాటికి అందజేయాలని ఇరిగేషన్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌ను ఆదేశించారు. ఎఫ్‌టీఎల్ స్థాయిలో (లేదా) అంతకంటే ఎక్కువ నీరు ఉన్న ప్రతి చెరువు వద్ద లస్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లను 24 గంటల పాటు కాపలాగా ఉంచాలి. చెరువులకు గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, మండల కేంద్రాల్లో ఇసుక బస్తాలు, ఖాళీ గోనె సంచులు, ఎర్త్ మూవింగ్ యంత్రాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు.

కాజ్‌వేలు, వంతెనల వద్ద భద్రతా చర్యలుతక్కువ ఎత్తులో ఉన్న కాజ్‌వేలు, వంతెనల వద్ద అక్టోబర్ 27వ తేదీ నాటికి బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కాజ్‌వేలపై నుంచి నీరు ప్రవహిస్తున్నప్పుడు ఇరువైపులా ట్రాఫిక్‌ను వెంటనే నిలిపివేసి, పోలీసులతో పాటు రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బందిని పహారాగా ఉంచాలి. నీటి లోతుతో సంబంధం లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రజలను కాజ్‌వేలు దాటేందుకు అనుమతించరాదని స్పష్టం చేశారు.

విద్యుత్ సరఫరాపై అప్రమత్తత

టీజీఎన్‌పీడీసీఎల్ అధికారులు ప్రతి విద్యుత్ సెక్షన్ పరిధిలో అవసరమైన విద్యుత్ స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లను సిద్ధంగా ఉంచుకోవాలి. నీట మునిగిన ప్రాంతాలు, కాలనీలలో విద్యుత్ సరఫరాను వెంటనే నిలిపివేయాలి. భారీ వర్షాల సమయంలో ప్రాణనష్టం జరగకుండా తెగిపడిన విద్యుత్ తీగలు, వంగిన విద్యుత్ స్తంభాలను వెంటనే సరిచేయాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక జాగ్రత్తలు

జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలను వర్షం నుంచి రక్షించేందుకు సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. ధాన్యం బస్తాలను నేలపై కాకుండా ప్లాట్‌ఫారమ్‌లపై నిల్వ చేయాలి. ఇప్పటికే కొనుగోలు చేసిన ధాన్యం రవాణాను అక్టోబర్ 27వ తేదీ నాటికి పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

పాఠశాలలు, వసతి గృహాల్లో భద్రతకు ప్రాధాన్యం

శిథిలావస్థలో ఉన్నట్లు గుర్తించిన పాఠశాలలు, హాస్టళ్లలో తరగతులు నిర్వహించరాదు. వర్షం కురుస్తున్న సమయంలో విద్యార్థులను బయటకు పంపడం, వాగులు, కాజ్‌వేలు దాటించడం చేయకూడదు. వర్షపాత పరిస్థితులను సమీక్షించి, అక్టోబర్ 28వ తేదీ ఉదయం పాఠశాలల సెలవులపై కలెక్టర్ తగిన నిర్ణయం తీసుకుంటారు.

వైద్య, ఆరోగ్య సేవలు సిద్ధంగా ఉంచాలి

ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (పీహెచ్‌సీ) ఓఆర్ఎస్ ప్యాకెట్లు, పాము కాటు నివారణకు అవసరమైన మందులు, క్లోరిన్ బిళ్లలు అందుబాటులో ఉంచి వైద్య బృందాలను సిద్ధంగా ఉంచాలి. మండల కేంద్రాల్లో 108 అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలి. మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తాగునీటిని క్లోరినేషన్ చేసి సురక్షిత తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలి.

ప్రజలకు ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలి

ఉప్పొంగి ప్రవహించే వాగులు, కాలువలు, కాజ్‌వేలను దాటవద్దని ప్రజలకు చాటింపు ద్వారా విస్తృతంగా అవగాహన కల్పించాలి. వర్షం సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడరాదని సూచించాలి. చేపల వేటకు వెళ్లడం, బట్టలు ఉతకడం వంటి పనుల కోసం చెరువుల వద్దకు వెళ్లకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని అధికారులను ఆదేశించారు.

తుఫాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై విపత్తు నిర్వహణ చట్టం-2005 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

# ఎల్ నినో వర్షాభావ పరిస్థితులలో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులు







**- ఆయిల్ పామ్ ఉద్యాన పంటల సాగు లాభదాయకం**

**పంట మార్పిడితో అధిక ఆదాయం**

**మన మీ వార్త అక్టోబర్ 27 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.**

ఆయిల్ పామ్, ఉద్యాన, కూరగాయలు, పండ్లు, పూలు, మల్బరీ మొదలైన మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల సాగు

మహబూబాబాద్, అక్టోబర్.27.

ఎల్ నినో, వర్షాభావ పరిస్థితుల్లో బోర్లు, బావులు కింద సాగు అవుతున్న ఆయిల్ పామ్ తోటలలో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్ధతులను అవలశీభించాలని జిల్లా ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు.

మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని ఏటిగడ్డ తండ లోని రైతు వేదిక వద్ద ఎల్.ని.నో పరిస్థితులపై ఆయిల్ ఫామ్ రైతులకు అవగాహన సదస్సు మరియు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా అధికారి మాట్లాడుతూ ఆయిల్ పామ్ వేరు వ్యవస్థ:పీచు వేరు వ్యవస్థ, వేర్లు పైపైన ఉంటాయి. మొదటి సంవత్సరం ఒక మీటరు, రెండవ సంవత్సరం రెండు మీటర్లు, మూడవ సంవత్సరం మూడు మీటర్లు "ఎడం" వదలి అంతరకృషి / అంతర పంటల సాగు చేసుకోవాలన్నారు.

కొత్తగా నాటిన మొక్కలచుట్టూ జనుము, జీలుగ, పెసర, అపరాలను ఐదు నుండి ఆరు వరుసలుగా విత్తుకోవాలి. దీనివలన పాదులో తేమ ఆరిపోకుండా ఉంటుంది. వీటిని పూత సమయంలో భూమిలో వేయడం వలన సేంద్రియ పదార్థము పెరుగుతుందన్నారు.

అబ్లేషన్:నాటిన తదుపరి 14 నుండి 18 నెలల వరకు ఎలాంటి పొత్తులు (మగ ఆడ పూల గుత్తులు) ఉండకుండా తొలిగించాలి. దీనినే "ూదీూాూ×ూచీ"అబ్లేషన్ అంటారన్నారు.

నీరు పెట్టుట :ప్రతిరోజు, ప్రతి మొక్కకు 200 నుండి 400 లీటర్ల పైబడి మొక్క వయస్సు బట్టి నీరు అందించాలన్నారు.

2 సంవత్సరంవయస్సుగల తోటలో పరపరాగ సంపర్కానికి ఇలడోబియస్ కెమరూనికాస్(జుశ్రీఖవసశీఎఱబంఖుఎవతీబఅఱఎఱబం) అనే "ఔజుజుఎ×ూూ"ను వదలాలన్నారు.

కాపుకి వచ్చిన ముదురు తోటలలో గెలలు కోసిన వెంటనే ఆకులను ముక్కలు ముక్కలుగా చేసి చెట్టు చుట్టూ వేయాలి. దీనివలన ఆకులు మంచిగా చివికి, భూమిలో కలుస్తాయన్నారు.

మట్టలను చాఫ్ కట్టర్ సహాయంతో కట్ చేసి చెట్టుచుట్టూ వేయాలని, పక్వానికి వచ్చిన గెలలను మాత్రమే కోయాలని,తోటలలో ఎప్పుడు తేమ ఉండేటట్లు చూసుకోవాలన్నారు.నీరును బిందుసేద్య పద్ధతిలో జెట్స్ తో అందించాలని, ఎరువులను బిందుసేద్య పద్ధతి (ఫర్టిగేషన్) ద్వారా ఇవ్వాలన్నారు. బిందుసేద్య పద్ధతిలో ఎరువులు ఇవ్వడం వలన అన్ని రకాలుగా రైతులకు మేలు జరుగునన్నారు.

ఆయిల్ పామ్ ఉప ఉత్పత్తులు అయిన డి-మక్, ఖాళీ గెలలు, గెలల పీచులను మల్చింగ్ గా వాడి, నేలలో సేంద్రియ పదార్థమును పెంచుకోవాలని, సిఫారసు చేసిన ఎరువులు వేయాలని,సూక్ష్మపోషకలైన బోరాన్, మెగ్నీషియం లను క్రమం తప్పకుండా వాడాలన్నారు.

ఎలుకలు, అడవి పందులు, ఇతర క్షీరదాల బారినుండి రక్షణ కొరకు "వల" నెట్ ను మొక్కలకు, తోట చుట్టూ అమర్చుకోవాలని, ఆకు మచ్చ, మొవ్వ కుళ్ళు, బాగ్ వార్మ్, కాండము తడి తెగులనుండి ఎప్పటికప్పుడు మొక్కలను కాపాడుకోవాలి. నివారణకు లీటరుకు మోనోక్రోటోఫాస్ 1 మీ.లీ మరియు 1 గ్రా. బావిస్టిన్ కలిపి పిచికారి చేయాలన్నారు. జీవ నియంత్రణ పద్ధతులు పాటించి నివారించుకోవాలని, నల్ల కొమ్ము పురుగు నుండి ఎప్పటికప్పుడు మొక్కలను కాపాడుకోవాలన్నారు.

20 గ్రాముల ఫోరేట్ గుళికలను మొవ్వలో పెట్టాలి. లింగాకర్షక బుట్టలు వాడాలని, జీవ నియంత్రణ పద్ధతులు పాటించి నివారించుకోవాలని, అంతర పంటలు సాగు మరియు కలుపు నివారణ: కలుపు రాకుండా అంతర పంటలు సాగు చేసుకోవాలి, దీనివలన అదనపు ఆదాయం వస్తుంది. నేలకు పోషకాలు అందుతాయన్నారు.

సాధారణంగా ఎక్కువగా ఉండే కలుపు మొక్కలు: మాబీర, డెవిల్ కలుపు, వయ్యారిభామ. స్లాషర్ /బ్రష్ కట్టర్ తో కలుపు నివారించవచ్చునని సర్పిలాకార తెల్లదోమ ఔప్తిఙవతశ్రీఎ: (అలేరోడికాస్ రుగియో పెర్క్యులెటస్): నివారణకు ఒక మిల్లీ లీటరు వేప నూనె (10000 పి.పి.యం) మరియు ఐదు గ్రాముల రిన్ సర్ఫ్ పొడిని ఒక లీటరు నీటికి చొప్పున బాగా కలిపి ఈ ద్రావణాన్ని తెల్లదోమ ఆశించిన "ఆకుల క్రిందబాగం" బాగా తడిచేలా వారం రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారి చేయాలన్నారు. ఒక లీటరు ఇజారియా ఫ్యుమసోరోజియా అనే శిలీంద్ర కల్చర్ ను, 5 మీల్లి లీటర్లు నీటికి కలిపి తెల్లదోమ ఆశించిన "ఆకుల క్రిందబాగం" బాగా తడిచేలా వారం రోజుల వ్యవధితో రెండు సార్లు పిచికారి చేయడం ద్వారా తెల్లదోమను సమర్ధవంతంగా నియంత్రించవచ్చు. జీవ నియంత్రణ పద్ధతులు పాటించి నివారించుకోవాలన్నారు.

బవేరియ బసియానా, మెటారర్జింలను కూడా పిచికారి చేయాలని మొక్కలు, చెట్లు ఖూణ (ఖుజూశీబతీ్రాతీవంంబతీవ ఐవటఅఱఖ) కి గురికాకుండా చూసుకోవాలి. దీనినే చెట్లకు వడదెబ్బ అనవచ్చు. ఇది బాగా ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో నీరు సరిగ్గా పెట్టనప్పుడు సంభవించి, మొవ్వలో ఆకులు విప్పారావు, మొగిలో, మొగిక్రింద ఆకులు వ్రేలాడి విరిగిపోవును. మట్టలు వంగిపోవునన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్. విజయ చంద్ర, ఎల్. డి. యం. కె. యాదగిరి, డి. డి. యం. నాబార్డ్ సి. హెచ్. సాయి రామ్, ఆత్మ ఛైర్మన్ వి. గోవర్ధన్ రెడ్డి, ఉద్యాన అధికారి ఎ. జె. శాంతిప్రియదర్శిని, మండల వ్యవసాయ అధికారులు ఎన్. తిరుపతి రెడ్డి, బి. రాంజీ, సహాయ రిజిస్ట్రార్ బి. సుమలత, వ్యవసాయ విస్తరణ అధికారులు లయ, పున్నమి, సరిత, బాలాజీ, ఉద్యాన విస్తరణ అధికారి బి. రమేష్, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ అధికారులు బి. శ్రీకాంత్, పి. నర్మద, బి. నాగరాజు, మహబూబాబాద్ మండల ఆయిల్ పామ్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు రోజు వారీగా తినే కూరగాయలను ప్రతి రైతు పొలం గట్ల మీద, పొలం చుట్టూ, పెరట్లో, ఆయిల్ పామ్, పండ్ల తోటలలో అంతర పంటలుగా, డాబాల మీద, ఇంటి ముంగిట రోజువారి కూరగాయల సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, నూతన రకాల సాగు, ప్రోట్రేలో నారు పెంపకం, ఎత్తు మడులు, మల్చింగ్, బిందు సేద్యం, ఫర్టిగేషన్, వేప పిండి, ఆముదం పిండి వాడకం, వేప నూనె పిచికారి చేయటం, పసుపు రంగు అట్టల వాడకం, సిఫారసు చేసిన ఎరువులు వాడటం, పందిరిపై కూరగాయల సాగు, ట్రెల్లిస్ మెథడ్ లో టమాటా సాగు మొదలైన పద్ధతులు పాటించాలని అన్నారు.

# రహదారులపై ధాన్యం ఆరబెడితే ప్రమాదాలకు ఆహ్వానమే!

-రోడ్డుపై వరి కుప్పలు.. పక్కనే బండరాళ్లు
-టిక్యా తండా రహదారిపై పొంచి ఉన్న ప్రమాదం..
పట్టించుకోని అధికారులు

**శివ్వంపేట మీ వార్త ప్రతినిధి అక్టోబర్ (27):**

పంట చేతికొచ్చిందన్న ఆనందంలో రైతులు రహదారులపై ధాన్యం ఆరబెడుతుండటంతో వాహనదారులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి.రోడ్లపై ధాన్యం ఆరబెట్టడం,వరి కుప్పలపై పెద్ద పెద్ద బండరాళ్లు పెట్టడం వల్ల రాత్రి వేళల్లో ప్రయాణించే వాహనదారులు వాటిని గుర్తించలేక ప్రమాదాలకు గురవుతున్నారు.ఈ పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోతున్నా రహదారులపై ధాన్యం ఆరబెట్టే విధానంలో మార్పు రావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండల పరిధిలోని టిక్యా తండా , చెన్నాపూర్ తో పాటు ఇతర గ్రామాల్లో రహదారిపై వరి కుప్పలు,బండరాళ్లు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తున్నాయి.ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన ప్రజాప్రతినిధే రహదారిపై వరి కుప్పలు ఏర్పాటు చేసి, వాటిపై పెద్ద పెద్ద రాళ్లు పెట్టడంతో పాటు రోడ్డుకు మరోవైపు ఇంటి నిర్మాణం కోసం రోడ్డుకు ఆనుకుని



గ్రనైట్ రాళ్లు వేయడం విమర్శలకు తావిస్తోంది. దీంతో రహదారికి ఇరువైపులా ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. ఎదురుగా వాహనాలు వచ్చినప్పుడు పక్కకు తప్పుకునేందుకు కూడా తగినంత స్థలం లేకపోవడంతో ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి సమయంలో రహదారిపై ఉన్న వరి కుప్పలు,వాటిపై పెట్టిన రాళ్లు సరిగా కనిపించకపోవడంతో ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉంది.ఈ మార్గంలో ప్రతి ఏటా ఇద్దరు నుంచి ముగ్గురు వ్యక్తులు వరి కుప్పలను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ రహదారిపై ధాన్యం ఆరబెట్టడం, రాళ్లు వేయడం వంటి చర్యలు



కొనసాగుతుండటంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

రహదారులు ప్రజల రాకపోకల కోసం ఉపయోగించాల్సి ఉండగా, వాటిపై ధాన్యం ఆరబెట్టడం, రాళ్లు వేయడం వల్ల ఇతరుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి టిక్యా తండా రహదారిపై ఉన్న వరి కుప్పలు, బండరాళ్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు,వాహనదారులు కోరుతున్నారు.రోడ్లపై ధాన్యం ఆరబెట్టకుండా అవగాహన కల్పించడంతో పాటు నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

# పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ ఎన్రోల్మెంట్‌కు హెల్ప్ డెస్క్ ఏర్పాటు- మేడల మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో

- ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలతో నాచారంలో ప్రత్యేక కేంద్రం

**నాచారం, అక్టోబర్ 27 ( మన మీ వార్త):**

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ప్రక్రియను సులభతరం చేసేందుకు నాచారం డివిజన్‌లోని కార్తీకయ నగర్, వీఎస్టీ పార్క్ సమీపంలో, నాచారం వార్డు కార్యాలయానికి ఎదురుగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ ఎన్రోల్మెంట్ హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేశారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాల మేరకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు మేడల మల్లికార్జున్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

పట్టభద్రులు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందించడమే ఈ హెల్ప్ డెస్క్ ప్రధాన ఉద్దేశమని




నిర్వాహకులు తెలిపారు. అర్హులైన పట్టభద్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు టేకులపల్లి రాంచందర్, ఎర్రం శ్రీనివాస్ రెడ్డి, మాంగోళ్ల




శివకుమార్, జోరరిపోతుల భాస్కర్, మధుసూదన్ రెడ్డి, సుగుణాకర్, కే. రామకృష్ణ రెడ్డి, పీడీ మూర్తి, హరిప్రసాద్, జబ్బార్, యూసఫ్, గోల్లూరి ప్రభాకర్, గణేష్, సుంచు వాసు, చిన్న నాయక్, గద్దల సురేందర్, గజ్వేలి శ్రీనివాస్, స్వర్ణ, రితిక, చందన, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించకుంటే లక్ష మందితో మహాధర్నా!

- ఎన్నికల హామీలను వెంటనే అమలు చేయాలి
- రేషన్ డీలర్లకు అండగా ఉంటాం:పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరిక

**పటాన్ చేరు అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి :**

**పటాన్‌చెరు, అక్టోబర్ 27:** రేషన్ డీలర్ల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుంటే లక్ష మందితో హైదరాబాద్‌లో భారీ నిరసన చేపడతామని పటాన్‌చెరు ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంఘం గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి హెచ్చరించారు. రేషన్ డీలర్ల హక్కుల సాధనకు తన సంపూర్ణ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. మంగళవారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో తెలంగాణ రాష్ట్ర రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి గౌరవ వేతన సాధన సభ, నూతన రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు



హరీశ్ రావుతో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ పల్లె నుంచి పట్టణం వరకు ప్రజలతో నిత్యం మమేకమై నిత్యావసర సరుకుల పంపిణీలో కీలక పాత్ర పోషిస్తున్న రేషన్ డీలర్లను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. ప్రకృతి విపత్తులు, కరోనా మహమ్మారి వంటి క్లిష్ట పరిస్థితుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ప్రజలకు సేవలందించిన రేషన్ డీలర్ల కష్టాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. క్షేత్రస్థాయిలో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న డీలర్లకు గౌరవ వేతనం కల్పించడంతో పాటు వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గత



అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. హామీల అమలులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో లక్ష మందిని సమీకరించి హైదరాబాద్‌లో భారీ ఆందోళన చేపడతామని హెచ్చరించారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి అవసరమైన ప్రతి పోరాటంలో తాను ముందుంటానని, వారి హక్కుల సాధనకు అండగా నిలుస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# శ్రీనివాస కాలనీ డ్రైనేజీ సమస్యకు రూ.50 లక్షలతో పరిష్కారం

- అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ మోటే సుమలత శ్రీకాంత్
- 17వ వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా: కౌన్సిలర్ కేతావత్ వెంకటేష్

**పటాన్ చేరు, అక్టోబర్ 27, మీ వార్త ప్రతినిధి:**

ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డు శ్రీనివాస కాలనీలో దీర్ఘకాలంగా నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కారానికి రూ.50 లక్షల వ్యయంతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపట్టారు. మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మోటే సుమలత శ్రీకాంత్, స్థానిక కౌన్సిలర్ కేతావత్ వెంకటేష్‌తో కలిసి ఈ పనులను ప్రారంభించారు.

కాలనీలో డ్రైనేజీ నీరు రోడ్లపైకి చేరడంతో స్థానిక



ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తొలగించేందుకు అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులను నాణ్యతా ప్రమాణాలతో, త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సంబంధిత అధికారులకు చైర్‌పర్సన్ సూచించారు.

ఈ సందర్భంగా 17వ వార్డు కౌన్సిలర్ కేతావత్ వెంకటేష్ మాట్లాడుతూ, వార్డులో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. వార్డు అభివృద్ధికి సహకరిస్తూ, డ్రైనేజీ పనుల ప్రారంభానికి తోడ్పడిన మున్సిపల్ చైర్‌పర్సన్ మోటే సుమలత శ్రీకాంత్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, డీఈ, కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు నరసింహారెడ్డి, సంపత్, రాఘవేందర్, గోపాల్‌రెడ్డి, సందీప్, నారాయణదాస్, మణి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్ గౌడ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచ్, మాజీ ఉపసర్పంచ్, కాంగ్రెస్ నాయకులు, శ్రీనివాస కాలనీ వాసులు పాల్గొన్నారు.

## మహా రుద్రాభిషేకం విజయంపై ఆదర్శ్ రెడ్డితో భాస్కర్ రెడ్డి భేటీ

**పటాన్ చేరు అక్టోబర్ 27 మీ వార్త ప్రతినిధి :**





బీరంగూడ డివిజన్ పరిధిలోని జయలక్ష్మి నగర్ ఫేజ్-2లో గల శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి దేవాలయంలో ఇటీవల నిర్వహించిన మహా రుద్రాభిషేకం, పుష్పార్చన కార్యక్రమాలు విజయవంతంగా ముగియడంతో పటాన్‌చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి వెన్నవరం ఆదర్శ్ రెడ్డిని మాజీ వార్డు సభ్యుడు, ఆలయ నిర్వాహకుడు భాస్కర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఆలయ కమిటీ సభ్యులు, జయలక్ష్మి నగర్ కాలనీ వాసులతో కలిసి ఆదర్శ్ రెడ్డిని కలిసిన ఆయన, మహా రుద్రాభిషేకం విజయవంతానికి అందించిన సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆధ్యాత్మిక కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, కాలనీ వాసులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులోనూ ఆలయ అభివృద్ధికి, ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు సహాయ సహకారాలు అందించాలని ఆదర్శ్ రెడ్డిని కోరారు. ఆలయ అభివృద్ధికి అందరి సహకారం అవసరమని భాస్కర్ రెడ్డి పేర్కొన్నారు.

## ఆత్మకూర్ విద్యుత్ శాఖలో కలకలం!

- రూ.10 వేల లంచం ఆరోపణలు.. ఏఈపై సస్పెన్షన్ వేటు!
- వ్యవసాయ విద్యుత్ పనుల్లో అవకతవకల ఆరోపణలు!
- 2025--26 పనులపై సమగ్ర విచారణకు స్థానికుల డిమాండ్!

**ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో అక్టోబర్ 27 మీ వార్త :**




**ఆత్మకూర్ న్యూస్ :** వనపర్తి జిల్లా ఆత్మకూర్ మండల విద్యుత్ శాఖలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆత్మకూర్ విద్యుత్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్ (ఏఈ) నర్సింహులును సస్పెండ్ చేసినట్లు ఆ శాఖ ఎస్‌ఈ తాతారావు వెల్లడించారు. ప్రభుత్వం మంజూరు చేసిన వ్యవసాయ విద్యుత్ పనులకు సంబంధించి విద్యుత్ స్తంభాలు, ఇతర సామగ్రి సరఫరా విషయంలో కాంట్రాక్టర్ నుంచి రూ.10 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరించినట్లు వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నట్లు సమాచారం.

**రూ.10 వేల లంచం ఆరోపణలు.. అధికారుల చర్యలు!**

ప్రభుత్వం మంజూరు చేసిన వ్యవసాయ విద్యుత్ పనులకు సంబంధించిన సామగ్రి సరఫరా వ్యవహారంలో ఏఈపై లంచం ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఫిర్యాదు ఆధారంగా ఉన్నతాధికారులు సస్పెన్షన్ చర్యలు తీసుకున్నట్లు ఎస్‌ఈ వెల్లడించారు. అయితే, ఆరోపణలకు సంబంధించిన పూర్తి వివరాలు, విచారణ ఫలితాలు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది.

**2025--26 పనుల్లోనూ అవకతవకల ఆరోపణలు!**

ఆత్మకూర్ మండలంలో 2025--26 సంవత్సరానికి సంబంధించిన ఇంప్లిమెంట్ పనుల్లోనూ భారీ అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరో కాంట్రాక్టర్‌తో కలిసి పనులు పూర్తిచేయకుండానే పెద్ద మొత్తంలో నిధులు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయని స్థానికులు పేర్కొంటున్నారు.ఈ ఆరోపణలపై ఇప్పటివరకు అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా తుది నిర్ధారణకు రావడం సాధ్యం కాదు. పనుల వివరాలు, బిల్లులు, నిధుల విడుదల రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించినప్పుడే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

**ఉన్నతాధికారులు స్పందించాలి!**

ఒకవైపు లంచం ఆరోపణల నేపథ్యంలో ఏఈ సస్పెన్షన్.. మరోవైపు గత పనులపై అవకతవకల ఆరోపణలు.. ఈ నేపథ్యంలో విద్యుత్ శాఖలో జరిగిన పనులపై సమగ్ర విచారణ చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది.జిల్లా ఉన్నతాధికారులు 2025--26 సంవత్సరానికి సంబంధించిన పనుల అంచనాలు, కాంట్రాక్టు వివరాలు, బిల్లులు, నిధుల చెల్లింపులు, పనుల పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. పనులు పూర్తికాకుండానే నిధులు చెల్లించినట్లు విచారణలో తేలితే, నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమ చెల్లింపులు జరిగినట్లు నిర్ధారణ అయితే నిధుల రికవరీ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**ప్రజాధనానికి రక్షణ ఏది?**

ప్రభుత్వం ప్రజల అవసరాల కోసం మంజూరు చేస్తున్న నిధులు నిర్దేశిత పనులకే వినియోగించబడుతున్నాయా? కాంట్రాక్టు పనులు నిబంధనల ప్రకారం జరుగుతున్నాయా? బిల్లుల చెల్లింపులకు ముందు పనుల నాణ్యత, పూర్తి స్థాయిని పరిశీలిస్తున్నారా? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.లంచం ఆరోపణలపై విచారణతో పాటు, గత పనులపై వచ్చిన ఆరోపణలను కూడా అధికారులు నిష్పక్షపాతంగా పరిశీలిస్తేనే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.
స్థానికుల ప్రధాన డిమాండ్: సమగ్ర విచారణ చేపట్టాలి.. అవకతవకలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.. ప్రభుత్వ నిధులను రికవరీ చేయాలి..

## పటాన్‌చెరులో 'ఓటు బచావో--దేశ్ బచావో'పై సమీక్ష

**పటాన్‌చెరు, అక్టోబర్ 27: మీ వార్త ప్రతినిధి:**





ఓటు హక్కు పరిరక్షణ, ఓటరు జాబితా సవరణపై పటాన్‌చెరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కాట శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏఐసీసీ అబ్జర్వర్ సరల్ పటేల్, డీసీసీ అధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, కోఆర్డినేటర్లు నాగరిగారి ప్రీతమ్, గూడూరు శ్రీనివాస్ హాజరయ్యారు.ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటరు జాబితాలోని తప్పులను సరిచేయడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడంపై చర్చించారు. ప్రజల్లో అవగాహన పెంచి 'ఓటు బచావో--దేశ్ బచావో' కార్యక్రమాన్ని విస్తృతంగా నిర్వహించాలని నిర్ణయించారు.

## కాటేదాన్‌లో కెమికల్ బ్లాస్ట్..

## ఇద్దరికి గాయాలు

**ఒకరి పరిస్థితి విషమం..**

**ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స...**

**రంగారెడ్డి** కాటేదాన్ లోని బాటిళ్ల తయారీ కంపెనీలో కెమికల్ బ్లాస్ట్ ఘటన చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడగా, వారిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటనలో సాయి అనే వ్యక్తికి ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. అలాగే కాలిపాదం సగం మేరకు తెగిపోవడంతో అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. మరో వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రస్తుతం ఇద్దరూ ఉస్మానియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.ప్రమాదానికి గల కారణాలు, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మరో ఎనిమిదిమంది ఖైదీలు దొరికారు

**చెన్నై** తేని జైలునుంచి పరారయిన ఖైదీల్లో మరో ఎనిమిది మంది పోలీసులకు దొరికిపోయారు. డ్రోన్ సహాయంతో వారిని గుర్తించారు. తేని లోని ఆటవీ ప్రాంతంలో వీరిని గుర్తించారు. మొత్తం పదిహేడు మంది జైలు నుంచి తప్పించుకోగా, పదమూడు మంది ఖైదీలను పోలీసులు పట్టుకున్నారు. మిగిలిన నలుగురికోసం గాలింపు ముమ్మరం చేసారు. మరోవైపు, ఖైదీల పరారీ విషయంలో తొమ్మిది మంది జైలు అధికారులు, సిబ్బందిని సస్పెండ్ చేసారు.

## రెండేళ్ల కుమార్తెతో సహా దంపతుల ఆత్మహత్య

**హైదరాబాద్** కూకట్‌పల్లిలో విషాదంఘటన చోటు చేసుకుంది. కేపీహెచ్‌బీ కాలనీ మూడో ఫేజ్‌లో ఆర్థిక ఇబ్బందులతో దంపతులు లతమ రెండేళ్ల కుమార్తె తో సహ ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతులను పశ్చిమ బెంగాల్‌కు చెందిన గోపి, సమతగా గుర్తించారు. తమ చావుకు ఎవరూ కారణం కాదని, ఇతరులను వివరాలు అడగవద్దని గోడపై రాశారు.

## మందుల కంపెనీల కోసమే మొత్తం వ్యవస్థ పనిచేస్తోందా?



ఔషధాల ఎంఆర్‌పీకి, రిటైలర్లు కొనుగోలు చేసే ధర మధ్య భారీ వ్యత్యాసం ఉండటంపై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఔషధ తయారీదారులకు అనుకూలంగా వ్యవస్థ మొత్తం ఎందుకు పనిచేస్తోందని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. మందుల ధరల నియంత్రణకు బాధ్యత వహించే నేషనల్ ఫార్మాస్యూటికల్ ప్రైసింగ్ అథారిటీ (ఎన్‌పీపీఏ) కూడా పూర్తిగా నిర్వీర్యమైన సంస్థలా కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. దేశంలో మందుల ధరల దాఖలపై రెండు పిటిషన్లపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. మందుల ఎంఆర్‌పీకి, రిటైలర్లకు వాటిని విక్రయించే ధరకు మధ్య ఉన్న భారీ తేడాను ప్రస్తావిస్తూ, ఇలాంటి పరిస్థితి ప్రభుత్వ పర్యవేక్షణలోనే కొనసాగుతోందని పేర్కొంది. ఔషధ తయారీదారులకు ప్రయోజనం చేకూర్చేలా మొత్తం వ్యవస్థ ఎందుకు పనిచేస్తోందని ప్రశ్నించింది. ఇదంతా ప్రభుత్వ కళ్ల ముందే జరుగుతోందని వ్యాఖ్యానించింది. ధరల వ్యత్యాసాన్ని ఇలాగే నియంత్రణ లేకుండా కొనసాగనివ్వాలా? అని నిలదీసింది. ఇదంతా ప్రభుత్వ కళ్ల ముందే జరుగుతోందని వ్యాఖ్యానించింది.

**రూ.11 వేల మందు రూ.1.30 లక్షల ధర!**

మందుల కొనుగోలు ధరకు, రోగులకు విక్రయించే ధరకు మధ్య ఉన్న వ్యత్యాసాన్ని ధర్మాసనం ప్రస్తావించింది. రూ.11 వేలకే లభించే మందును రూ.1.30 లక్షలకు విక్రయించడాన్ని ధరల సర్దుబాటుగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నించింది. ధరల పెరుగుదలపై ప్రభుత్వం ఇప్పటివరకు ఇచ్చిన వివరణలు సంతృప్తికరంగా లేవని అభిప్రాయపడింది. రిటైలర్లు రూ.15కు కొనుగోలు చేసే డ్రిప్ లైన్‌ను రూ.250కు విక్రయిస్తున్న ఉదంతాన్ని కూడా కోర్టు ప్రస్తావించింది. ఇలాంటి భారీ వ్యత్యాసాలు కొనసాగుతుంటే ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వు (డీపీసీవో) ఉద్దేశం ఏమిటని ప్రశ్నించింది. ధరల నియంత్రణ సంస్థ ఎన్‌పీపీఏ పనితీరు పూర్తిగా నిర్వీర్యమైనట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది.

**ఇతర దేశాలతో పోలిస్తే ధరలు తక్కువే: కేంద్రం**

దేశంలో మందుల ధరలు ప్రపంచంలోని ఇతర దేశాలతో పోలిస్తే తక్కువగా ఉన్నాయని కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదించారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ, తలసరి ఆదాయం తక్కువగా ఉన్న దేశంలో మందుల ధరలను ఇతర దేశాలతో పోల్చి మాత్రమే అందుబాటులో ఉన్నాయా లేదా అన్నది నిర్ణయించలేమని పేర్కొంది. రోగుల ప్రయోజనాల కంటే వ్యాపార ప్రయోజనాలను ముందు ఉంచకూడదని స్పష్టం చేసింది.

**నిర్వహణ ఖర్చుల పేరుతో అధిక ధరలా?**

ప్రైవేటు ఆసుపత్రుల తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. ఆసుపత్రులు 24 గంటల పాటు వైద్య సేవలు అందించేందుకు అవసరమైన మౌలిక సదుపాయాలను నిర్వహించాల్సి ఉంటుందని తెలిపారు. రోగులు బయట కొనుగోలు చేసిన మందులను వినియోగించడంలో నకిలీ ఔషధాల ప్రమాదం కూడా ఉంటుందని వివరించారు. అయితే, ఈ వాదనలను ధర్మాసనం అంగీకరించలేదు. ఆసుపత్రులు వైద్య సేవలకు రుసుములు వసూలు చెయొచ్చు, కానీ మందుల ధరలను వాటి కొనుగోలు ధర కంటే 100 నుంచి 200 రెట్లు పెంచడం ఎలా సమర్థనీయమని ప్రశ్నించింది. నిర్వహణ ఖర్చుల కోసం ఇతర మార్గాలను అన్వేషించాలి తప్ప, మందుల ధరల పెంపుతో రోగులపై భారం వేయకూడదని వ్యాఖ్యానించింది. ఇలాంటి వసూళ్లతో ఆసుపత్రులు మనుగడ సాగించకూడదని ఘాటుగా పేర్కొంది.

**82 శాతం మందులపై ధరల పరిమితులు లేవా?**

డీపీసీవో-2013 ప్రకారం షెడ్యూల్డ్ ఔషధాలపై ధరల పరిమితులు వర్తిస్తుండగా, షెడ్యూల్‌లో లేని మందుల ప్రారంభ ధరలపై తగిన నియంత్రణ లేదని పిటిషనర్ కిషన్ చంద్ర జైన్ వాదించారు. దేశంలో సుమారు 82 శాతం మందులు షెడ్యూల్ పరిధిలోకి రావని, వాటి ప్రారంభ ధరలను ముందుగానే నిర్ణయించే విధానం లేకపోవడం వల్ల తయారీ సంస్థలకు ఎంఆర్‌పీ నిర్ణయంలో అధిక స్వేచ్ఛ లభిస్తోందని పేర్కొన్నారు.

**క్యాన్సర్ మందుల ధరలపైనా గతంలో ప్రశ్నలు**

అక్టోబర్ 12న ఈ విషయంపై విచారణ జరిగింది. అప్పుడు కూడా ఔషధాల ధరల నియంత్రణపై సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. క్యాన్సర్ మందులపై ట్రేడ్ మార్జిన్‌ను ఎంఆర్?పీలో 30 శాతానికి పరిమితం చేయడంపై కేంద్రం ఇచ్చిన వివరణ సంతృప్తికరంగా లేదని పేర్కొంది. ఇలాంటివి ఇతర మందులకు ఎందుకు విస్తరించలేదని ప్రశ్నించింది. గతంలో ఆసుపత్రులు క్యాన్సర్ మందులను అధిక ధరలు వసూలు చేస్తున్నాయన్న అంశంపైనా అత్యున్నత న్యాయస్థానం కేంద్రంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో క్యాన్సర్ మందుల ట్రేడ్ మార్జిన్‌ను ఎంఆర్‌పీలో 30 శాతానికి పరిమితం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనివల్ల రోగులకు ఏటా సుమారు రూ. 2,500 కోట్ల ఆదా అవుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపింది.

## దేశ ప్రయోజనాలే కొనుగోళ్లలో కీలకం



రష్యా నుంచి ముడి చమురు దిగుమతులను తగ్గించాలంటూ అమెరికా తమపై ఎలాంటి ఒత్తిడి చేయలేదని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురి తెలిపారు. మంగళవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు, రాయితీల ఆధారంగానే చమురు కొనుగోళ్లపై నిర్ణయాలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. రష్యా నుంచి భారత్ చమురు దిగుమతులు ఉక్రెయిన్ యుద్ధానికి ముందు చాలా తక్కువగా ఉండేవని పురి గుర్తుచేశారు. అప్పట్లో దేశ చమురు దిగుమతుల్లో రష్యా వాటా కేవలం 0.2 శాతమేనని చెప్పారు. యుద్ధం ప్రారంభమైన తర్వాత రష్యా చమురుపై లభించిన రాయితీల కారణంగా దిగుమతులు పెరిగాయని వివరించారు. అయితే, ఇటీవల పరిస్థితుల్లో మార్పు కనిపిస్తోందని మంత్రి తెలిపారు. మధ్యప్రాచ్య దేశాల నుంచి చమురు సరఫరాలు పెరుగుతున్నాయని, ఆ ప్రాంతం నుంచి మరింత చమురు సరఫరా అవుతుందని పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో మధ్యప్రాచ్య దేశాల నుంచి భారత్ దిగుమతులను పెంచుకుంది. అదే సమయంలో చైనా నుంచి పోటీ పెరగడం, గల్ఫ్ దేశాల చమురుపై రాయితీలు లభించడంతో భారత రిఫైనరీలు రష్యా చమురు కొనుగోళ్లను తగ్గించినట్లు నౌకల రవాణా గణాంకాలు వెల్లడించాయి. రష్యా చమురు కొనుగోళ్లు ఇతర దేశాల చమురు ధరలతో పోలిస్తే ఎంత రాయితీ లభిస్తుందనే అంశంపై ఆధారపడి ఉంటాయని పురి తెలిపారు. "చివరకు ప్రతి నిర్ణయం దేశ ప్రయోజనాల ఆధారంగానే తీసుకుంటాం" అని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, రష్యా ఇంధన ఎగుమతులపై కొత్త ఆంక్షలు, సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అక్టోబర్‌లో జాతీయ ప్రయోజనాల నిబంధనల కింద మినహాయింపులు ఇచ్చారు. దీంతో భారత్‌పై విధించే అవకాశం ఉన్న భారీ సుంకాల నుంచి కొంత ఉపశమనం లభించింది. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల మధ్య కూడా భారత్ ఇంధన సరఫరాలను స్థిరంగా కొనసాగించిందని పురి గతంలో పేర్కొన్నారు. రాబోయే రెండు దశాబ్దాల్లో ప్రపంచ ఇంధన డిమాండ్ పెరుగుదలలో దాదాపు నాలుగో వంతు భారత్ నుంచే ఉంటుందని ఆయన తెలిపారు.

# బోడుప్పల్ జిల్లా పరిషత్ పాఠశాలలో పోక్సో చట్టంపై విద్యార్థులకు అవగాహన








బోడుప్పల్ సర్కిల్ అక్టోబర్ 27 (మన మీ వార్త)

పిల్లలకు పోక్సో చట్టంపై అవగాహన కల్పించేలా ఉపాధ్యాయులు,తల్లిదండ్రులు ప్రయత్నించాలని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి బాలభాస్కర్ సూచించారు. మంగళవారం బోడుప్పల్ జిల్లా పరిషత్ పాఠశాలలో పోక్సో చట్టం--2012 పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి బాలభాస్కర్,జిల్లా పోలీసు అధికారి ప్రియాంక, మేడిపల్లి పోలీస్ స్టేషన్ సిఐ డి.జలంధర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా అధికారులు విద్యార్థులకు పోక్సో చట్టం--2012లోని ముఖ్య నిబంధనలు, కీలక విభాగాల గురించి వివరించారు. చిన్న పిల్లలను తాకడంలో మంచి--చెడులను ఎలా గుర్తించాలో, పిల్లల భద్రత కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు.లగిక వేధింపులకు గురైతే భయపడకుండా వెంటనే పోలీసులకు, తల్లి దండ్రులకు లేదా ఉపాధ్యాయులకు సమాచారం అందించాలని అధికారులు సూచించారు. 18 ఏళ్ల లోపు బాలికలను వేధింపులకు గురిచేస్తే అది పోక్సో చట్టం పరిధిలోకి వస్తుందని తెలిపారు.మహిళల భద్రతకు షీ టీమ్స్ మహిళలు, బాలికల భద్రతను కాపాడటంలో షీ టీమ్స్ పాత్ర కీలకమని అధికారులు పేర్కొన్నారు. వేధింపులను నివారించే చర్యలు, ఫిర్యాదు చేసే విధానం గురించి కూడా విద్యార్థులకు అవగాహన కల్పించారు. పిల్లల రక్షణ, చట్టపరమైన హక్కులు, లైంగిక నేరాల నివారణ పై సమాజంలో అవగాహన పెంచడమే ఈ కార్యక్రమ లక్ష్యమని పోలీసు అధికారులు తెలిపారు .పిల్లల భద్రత కోసం అందరూ విజిలెన్స్‌గా వ్యవహరించాలని ఏదైనా అనుమానాస్పద ఘటన జరిగితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు,విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# వనపర్తి డీటీఓ కార్యాలయంలో సమయపాలన ఏదీ?

- ఉదయం 10:11 నుంచి 11:07 వరకు.. జీపీఎస్ ఫొటోల్లో ఖాళీగా కనిపించిన కార్యాలయం!
- అధికారుల హాజరుపై సందేహాలు,బయోమెట్రిక్ అమలుపై ప్రజల డిమాండ్!
- జిల్లా కలెక్టర్, రవాణా శాఖ కమిషనర్ స్పందించాలి,హాజరు రికార్డులు తనిఖీ చేయాలి!

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో । అక్టోబర్ 27 । మీ వార్త :

వనపర్తి జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో సమయపాలన, అధికారుల హాజరు విధానంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఉదయం కార్యాలయ పనివేళల్లో తీసినట్లు పేర్కొన్న మూడు జీపీఎస్ ఫొటోల్లో కార్యాలయ ప్రాంగణం, లోపలి గదులు ఖాళీగా కనిపించడం చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వ కార్యాలయాల్లో విధి నిర్వహణ, సిబ్బంది అందుబాటు అత్యంత కీలకమైన నేపథ్యంలో.. ఈ ఫొటోల ఆధారంగా సంబంధిత అధికారులు సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

**10:11 నుంచి 11:07 వరకు.. ఫొటోల్లో ఏం కనిపించింది?**

అక్టోబర్ 27న తీసినట్లు పేర్కొన్న జీపీఎస్ ఫొటోల వివరాల ప్రకారం.. ఉదయం 10:11:49 గంటలకు తీసిన ఫొటోలో కార్యాలయ బోర్డు కనిపిస్తోంది. 10:12:36 గంటలకు తీసిన మరో ఫొటోలో కార్యాలయంలోని కుర్చీలు, టేబుళ్లు కనిపిస్తున్నాయి. అలాగే 11:07:57 గంటలకు తీసిన మూడో ఫొటోలోనూ కార్యాలయం ఖాళీగా ఉన్నట్లు కనిపిస్తోంది.కార్యాలయ పనివేళల్లో తీసినట్లు పేర్కొన్న ఈ ఫొటోలు అధికారుల హాజరు, సిబ్బంది అందుబాటుపై పలు ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి. అయితే, ఫొటోలు తీసిన సమయంలో అధికారులు క్షేత్రస్థాయి విధుల్లో ఉన్నారా? ఇతర అధికారిక పనులపై బయటకు వెళ్లారా? కార్యాలయానికి ఆలస్యంగా వచ్చారా? అనే అంశాలు ఇంకా నిర్ధారణ కావాల్సి ఉంది. ఇందుకు సంబంధించిన హాజరు రికార్డులు, విధుల వివరాలను పరిశీలిస్తేనే వాస్తవ పరిస్థితి స్పష్టమవుతుంది.

**బయోమెట్రిక్ హాజరు అమలులో ఉందా?**

ప్రభుత్వ కార్యాలయాల్లో ఉద్యోగుల హాజరును పారదర్శకంగా నమోదు చేయడం, విధి నిర్వహణను పర్యవేక్షించడం కీలకం. ఈ నేపథ్యంలో వనపర్తి డీటీఓ కార్యాలయంలో బయోమెట్రిక్ హాజరు అమలులో ఉందా? ఉంటే సంబంధిత సమయాల్లో ఎవరు హాజరయ్యారు? లేక మాన్యువల్ అటెండెన్స్ రిజిస్టర్ ద్వారానే హాజరు నమోదు చేస్తున్నారా? అనే ప్రశ్నలకు సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.మాన్యువల్ హాజరు విధానం అమలులో ఉంటే, రిజిస్టర్‌లో నమోదైన సమయాలను ఇతర అధికారిక రికార్డులతో సరిపోల్చి పరిశీలించాలని ప్రజలు కోరుతున్నారు. జీపీఎస్ ఫొటోల్లో కనిపిస్తున్న పరిస్థితికి, అధికారిక హాజరు వివరాలకు మధ్య ఏమైనా వ్యత్యాసం ఉందా అనే అంశాన్ని కూడా విచారణలో భాగంగా పరిశీలించాల్సి ఉంది.







**లైసెన్సులు, ఫిట్‌నెస్, పర్మిట్ల కోసం వచ్చే ప్రజల పరిస్థితి ఏంటి?**

రవాణా శాఖ కార్యాలయానికి డ్రైవింగ్ లైసెన్సులు, వాహన రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పర్మిట్లు తదితర పనుల కోసం ప్రతిరోజూ ప్రజలు వస్తుంటారు. అలాంటి సమయంలో సంబంధిత అధికారులు, సిబ్బంది అందుబాటులో లేకపోతే ప్రజలు అనవసరంగా వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు సకాలంలో సేవలు అందించడం అధికారుల బాధ్యత. అందువల్ల కార్యాలయ పనివేళలను కచ్చితంగా పాటిస్తున్నారా? ప్రజలకు అందాల్సిన సేవలు సక్రమంగా అందుతున్నాయా? అనే అంశాలపై పర్యవేక్షణ అవసరమని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

**కలెక్టర్, రవాణా శాఖ కమిషనర్ స్పందించాలి!**

వనపర్తి జిల్లా కలెక్టర్, తెలంగాణ రవాణా శాఖ ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. జీపీఎస్ ఫొటోల్లో కనిపిస్తున్న పరిస్థితిని సంబంధిత రికార్డులతో సరిపోల్చి పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.అవసరమైతే డీటీఓ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అధికారుల హాజరు రిజిస్టర్లు, బయోమెట్రిక్ వివరాలు, విధుల కేటాయింపు రికార్డులను పరిశీలించాలని కోరుతున్నారు. డీటీఓతో పాటు ఏఎంవీఐ, ఎంవీఐ, ఏఓ తదితర అధికారుల హాజరు, విధుల నిర్వహణపై కూడా నిబంధనల ప్రకారం సమీక్ష జరపాలని డిమాండ్ చేస్తున్నారు.

అలాగే కార్యాలయంలో సీసీటీవీ పర్యవేక్షణ, బయోమెట్రిక్ హాజరు అమలు పరిస్థితులను పరిశీలించి, పారదర్శకమైన హాజరు విధానాన్ని బలోపేతం చేయాలని కోరుతున్నారు.

**నాలుగు నెలలుగా బాధ్యతలు...సమయపాలనపై సమీక్ష ఎప్పుడు?**

డీటీఓ బాధ్యతలు చేపట్టి నాలుగు నెలలు గడిచిన నేపథ్యంలో కార్యాలయ నిర్వహణ, సిబ్బంది హాజరు, ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్ష జరగాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కార్యాలయంలో ఎవరు ఏ సమయానికి విధులకు హాజరవుతున్నారు? ప్రజలకు సేవలు అందించడంలో ఎలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి? వాటిని పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.అయితే, ఫొటోల్లో కార్యాలయం ఖాళీగా కనిపించినంత మాత్రాన అధికారులు విధులకు గైర్హాజరయ్యారని నిర్ధారించలేం. సంబంధిత హాజరు రికార్డులు, విధుల వివరాలు, అధికారుల వివరణ ఆధారంగా వాస్తవాలను నిర్ధారించాల్సి ఉంటుంది.

**ఫొటోలపై విచారణ...వాస్తవాలు వెల్లడించాలి!**

ఉదయం 10:11, 10:12, 11:07 గంటలకు తీసినట్లు పేర్కొన్న మూడు జీపీఎస్ ఫొటోలు వనపర్తి డీటీఓ కార్యాలయ సమయపాలనపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు స్పందించి, సంబంధిత రికార్డులను పరిశీలించి, కార్యాలయంలో హాజరు విధానం ఎలా అమలవుతోందో వెల్లడించాలని ప్రజలు కోరుతున్నారు.ప్రభుత్వ కార్యాలయాల్లో సమయపాలన, పారదర్శకత, ప్రజలకు మెరుగైన సేవలు అందించడం అత్యంత ముఖ్యం. జీపీఎస్ ఫొటోల్లో కనిపిస్తున్న పరిస్థితిపై విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించడంతోపాటు, ఏవైనా ఉల్లంఘనలు నిర్ధారణ అయితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు...

## తెలంగాణ హైకోర్టుకు కొత్త ప్రధాన న్యాయమూర్తి.. ఎవరీ తపబ్రత చక్రవర్తి..?

**హైదరాబాద్ :** తెలంగాణ హైకోర్టు శాశ్వత ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ తపబ్రత చక్రవర్తిని నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ శ్యాంకోశీని ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా పంపాలని ప్రతిపాదించింది. కలకత్తా హైకోర్టులో మూడు దశాబ్దాలకు పైగా న్యాయరంగ అనుభవం కలిగిన జస్టిస్ తపబ్రత చక్రవర్తి రాజ్యాంగ, సివిల్, సర్వీసు, విద్యాచట్టాలకు సంబంధించిన కేసుల్లో నైపుణ్యం సంపాదించారు. రాష్ట్రపతి ఆమోదం, అధికారిక ఉత్తర్వుల తర్వాత కొత్త నియామకాలు అమల్లోకి వస్తాయి.తెలంగాణ హైకోర్టుకు కొత్త సీజే రానున్నారు. కలకత్తా హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ తపబ్రత చక్రవర్తిని తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. ప్రస్తుతం తెలంగాణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న జస్టిస్ శ్యాంకోశీని పదోన్నతిపై ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని ప్రతిపాదించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో సోమవారం సమావేశమైన కొలీజియం నాలుగు హైకోర్టులకు ప్రధాన న్యాయమూర్తులను నియమించేందుకు పేర్లను ఖరారు చేసింది.తెలంగాణ, ఢిల్లీ హైకోర్టులతోపాటు గుజరాత్, ఉత్తరాఖండ్ హైకోర్టులకు కూడా కొత్త ప్రధాన న్యాయమూర్తులను నియమించాలని కొలీజియం నిర్ణయించింది. గుజరాత్ హైకోర్టులో ప్రస్తుతం న్యాయమూర్తిగా సేవలందిస్తున్న జస్టిస్ మానస్ రంజన్ పాఠక్‌ను అదే హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సిఫార్సు చేసింది. పట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్ సింగ్‌ను ఉత్తరాఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని ప్రతిపాదించింది. ఈ సిఫార్సులకు రాష్ట్రపతి ఆమోదం తెలిపి, అధికారిక నియామక ఉత్తర్వులు జారీ చేసిన తర్వాత సంబంధిత న్యాయమూర్తులు కొత్త బాధ్యతలు చేపట్టనున్నారు.తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా గతంలో పనిచేసిన జస్టిస్ అపరేష్‌కుమార్ సింగ్ ఈ నెల 6న పదోన్నతిపై సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. దీంతో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థానం ఖాళీ అయింది. అప్పటి నుంచి జస్టిస్ శ్యాంకోశీ తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆ స్థానంలో శాశ్వత ప్రధాన న్యాయమూర్తిని నియమించేందుకు కొలీజియం నిర్ణయం తీసుకుంది. కలకత్తా హైకోర్టులో సీనియారిటీ పరంగా రెండో స్థానంలో ఉన్న జస్టిస్ తపబ్రత చక్రవర్తికి ఈ బాధ్యతలు అప్పగించాలని సిఫార్సు చేసింది.జస్టిస్ తపబ్రత చక్రవర్తి 1966 నవంబరు 27న పశ్చిమబెంగాల్‌లో జన్మించారు. 1991 జనవరి 29న కలకత్తా హైకోర్టులో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని న్యాయవృత్తిని ప్రారంభించారు. సుమారు 22 ఏళ్లపాటు సివిల్, రాజ్యాంగ, సర్వీసు, విద్యాచట్టాలకు సంబంధించిన కేసుల్లో వాదనలు వినిపించారు. ముఖ్యంగా రాజ్యాంగపరమైన అంశాలపై కేసుల వాదనలో ప్రత్యేక నైపుణ్యం సంపాదించారు. న్యాయవాదిగా సుదీర్ఘ అనుభవం గడించిన అనంతరం 2013 అక్టోబరు 30న కలకత్తా హైకోర్టు అదనపు న్యాయమూర్తిగా నియమితులయ్యారు.

# ప్రపంచస్థాయిలో తెలంగాణ ప్రతిష్ఠ

-మొదటిపేజీ తరువాయి

ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్ల పురోగతిపై ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. సమ్మిట్ నిర్వహణ, పెట్టుబడిదారులు, వ్యాపారవేత్తలతో సమావేశాలు, రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్ వంటి కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు. వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, సంస్థల ప్రతినిధులు, సీఈవోలు ఈ కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

### ఢిల్లీ కర్టెన్ రైజర్‌పై ప్రత్యేక దృష్టి

గ్లోబల్ సమ్మిట్‌కు సంబంధించిన వివరాలను విస్తృతంగా ప్రచారం చేయడంలో కర్టెన్ రైజర్ కార్యక్రమం కీలకమని సీఎం పేర్కొన్నారు. ఢిల్లీలో జరిగే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడం ద్వారా తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను మరింత విస్తృతంగా పరిచయం చేయవచ్చని తెలిపారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రముఖులు, పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు అవసరమైన ఏర్పాట్లు సమర్థంగా చేపట్టాలని అధికారులకు సూచించారు. సమ్మిట్‌కు సంబంధించిన సమాచారం స్పష్టంగా, ఆకర్షణీయంగా ఉండాలని, తెలంగాణలో ఇప్పటికే ఉన్న పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, రవాణా సౌకర్యాలు, ఐటీ రంగంలో సాధించిన పురోగతి, కొత్త పరిశ్రమలకు అందుబాటులో ఉన్న అవకాశాలను వివరించాలని ఆదేశించారు. పెట్టుబడిదారులు రాష్ట్రంలో వ్యాపారాలు ప్రారంభించేందుకు అనువైన వాతావరణం ఉందనే విశ్వాసం కలిగించేలా కార్యక్రమాన్ని రూపొందించాలని సూచించారు.

### ప్రపంచస్థాయిలో తెలంగాణ ప్రతిష్ఠ పెంచాలి

గ్లోబల్ సమ్మిట్ నిర్వహణతో తెలంగాణ రాష్ట్ర ప్రతిష్ఠ అంతర్జాతీయ స్థాయిలో మరింత పెరిగే అవకాశం ఉందని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని రాష్ట్ర అభివృద్ధి, పారిశ్రామిక పురోగతి, పెట్టుబడుల ఆకర్షణకు సంబంధించిన అంశాలను ప్రపంచానికి చాటిచెప్పాలని తెలిపారు. సమ్మిట్‌కు వచ్చే అతిథులకు తెలంగాణ ప్రత్యేకతలు, ఇక్కడి వ్యాపార అవకాశాలు, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలని, కార్యక్రమాల నిర్వహణలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో



ముందుకు సాగాలని ఆదేశించారు. అతిథుల రాకపోకలు, సమావేశాల నిర్వహణ, సమాచార వ్యవస్థలు, ప్రచార కార్యక్రమాల విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు.

### తెలంగాణ సంస్కృతికి అద్దం పట్టేలా డిజైన్లు

గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసే నమూనాలు, అలంకరణలు తెలంగాణ చరిత్ర, కళలు, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉండాలని ముఖ్యమంత్రి సూచించారు. ముఖ్యంగా కాకతీయ కళాతోరణం, రామప్ప ఆలయ నిర్మాణ శైలికి ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. రాష్ట్ర చారిత్రక వారసత్వాన్ని అంతర్జాతీయ అతిథులకు పరిచయం చేసే విధంగా ప్రాంగణాన్ని తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. తెలంగాణ ప్రత్యేకతను చాటిచెప్పే కళారూపాలు, సంప్రదాయ అలంకరణలు, సాంస్కృతిక అంశాలను సమ్మిట్ ఏర్పాట్లలో భాగం చేయాలని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిని మాత్రమే కాకుండా, ఇక్కడి చారిత్రక వైభవం, సాంస్కృతిక వారసత్వాన్ని కూడా ప్రపంచానికి పరిచయం చేయడం ద్వారా అతిథులకు ప్రత్యేక అనుభూతి కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు.

### బతుకమ్మ ప్రత్యేకతను చాటిచెప్పే ఏర్పాట్లు

తెలంగాణ సంస్కృతిలో విశిష్ట స్థానం కలిగిన బతుకమ్మ పండుగ గురించి అంతర్జాతీయ అతిథులకు తెలియజేసేలా ప్రత్యేక డిజైన్లు, ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్ర పండుగలు, సంప్రదాయాలు, కళారూపాల ద్వారా తెలంగాణ సాంస్కృతిక గుర్తింపును చాటిచెప్పేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. సాంస్కృతిక అంశాలను ఆధునిక సాంకేతికతతో మేళవించి ప్రదర్శించడం ద్వారా అతిథులను ఆకట్టుకునేలా ఏర్పాట్లు చేయాలని సీఎం సూచించారు. తెలంగాణ సంప్రదాయాలకు ప్రాధాన్యం ఇస్తూనే, రాష్ట్రం సాంకేతికంగా, పారిశ్రామికంగా సాధిస్తున్న పురోగతిని కూడా ప్రతిబింబించేలా ప్రాంగణాన్ని రూపొందించాలని స్పష్టం చేశారు.

### డ్రోన్ ప్రచారం.. ఏఐ, వాతావరణ రంగాల ప్రముఖులకు ఆహ్వానాలు

గ్లోబల్ సమ్మిట్ గురించి విస్తృత ప్రచారం కల్పించేందుకు హైదరాబాద్‌లోని పలు ప్రాంతాల్లో డ్రోన్ ఆధారిత ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని రేవంత్‌రెడ్డి సూచించారు. ఆధునిక ప్రచార పద్ధతులను వినియోగించుకుని సమ్మిట్ ప్రాధాన్యాన్ని ప్రజలకు, పెట్టుబడిదారులకు తెలియజేయాలని ఆదేశించారు.

కృత్రిమ మేధస్సు (ఏఐ), వాతావరణ మార్పులు (క్లైమేట్ చేంజ్) వంటి భవిష్యత్ అవసరాలకు సంబంధించిన రంగాల్లో పనిచేస్తున్న ప్రముఖులను కూడా ఆహ్వానించాలని తెలిపారు. ఈ రంగాల్లో పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, పెట్టుబడులకు ఉన్న అవకాశాలను చర్చించేందుకు సమ్మిట్ వేదికగా ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని సూచించారు.

### రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్ కార్యక్రమాలపైనా సమీక్ష

గ్లోబల్ సమ్మిట్‌తోపాటు రక్షా ఎక్స్‌పో, ఇండియా జాయ్ కార్యక్రమాలకు సంబంధించిన ఏర్పాట్లపైనా ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు. ఆయా కార్యక్రమాల లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని, పాల్గొనే సంస్థలు, ప్రతినిధులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు. వివిధ రంగాల్లో తెలంగాణకు ఉన్న అవకాశాలను ప్రదర్శించేందుకు ఈ కార్యక్రమాలను సమర్థంగా వినియోగించుకోవాలని తెలిపారు. పెట్టుబడిదారులకు అనుకూల వాతావరణం కల్పించడం, రాష్ట్ర ప్రత్యేకతలను అంతర్జాతీయ వేదికలపై పరిచయం చేయడం, కొత్త పరిశ్రమలు, సాంకేతిక సంస్థలను ఆకర్షించడం వంటి లక్ష్యాలతో సమన్వయంతో పనిచేయాలని అధికారులకు సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# రుణపరిమితి పెంచడం సాధ్యమేనా



**హైదరాబాద్ :** తెలంగాణలో రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి ఎల్‌నినో రూపంలో ఊహించని ప్రకృతి, పరిపాలనా సవాళ్లు ఎదురవుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి నిల్వలు క్షీణించి భూగర్భ జలాలు అట్టడుగుకు పడిపోవడంతో, క్షేత్రస్థాయిలో వ్యవసాయం దెబ్బతింటోంది. మరోవైపు సాగునీటి పంపింగ్ కోసం వ్యవసాయ విద్యుత్ వినియోగంతో పాటు పగటి ఉష్ణోగ్రతల వల్ల గృహ వినియోగం అనూహ్యంగా పెరిగింది. రైతులకు రెండో పంట వేసుకునే అవకాశం తగ్గడం వల్ల పంటల నష్టం వేల కోట్లకు చేరే ప్రమాదం పొంచి ఉంది. ఇటు విద్యుత్ కొనుగోళ్లకు అదనపు భారం పడటం, అటు నష్టపోతున్న వర్గాలను ఆదుకునేందుకు ఇందిరమ్మ కిట్ వంటి సంక్షేమ పథకాలు అమల్లోకి తెస్తుండటంతో ప్రభుత్వ ఖజానాపై ఊహించని భారం పడుతోంది. ఈ అదనపు ఖర్చులను తట్టుకునేందుకు మరియు హామీ ఇచ్చిన సంక్షేమ పథకాలను నిరంతరా యంగా కొనసాగించేందుకు నిధులు అత్యవసరంగా మారాయి. అయితే, రాష్ట్ర సొంత ఆదాయం సరిపోకపోవ డంతో మార్కెట్ రుణాల ద్వారా నిధులను సేకరించాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీనికోసం కేంద్ర ప్రభుత్వం విధించే ఎఫ్ఆర్‌బీఎమ్ రుణ పరిమితిని పెంపుదల చేయాలని తెలం గాణ సర్కార్ కేంద్రాన్ని కోరేందుకు సిద్ధమవుతోంది. ప్రస్తుతం జీఎస్‌డీపీలో 3 శాతంగా ఉన్న రుణ పరిమితిని కనీసం 4 నుంచి 4.5 శాతానికి పెంపు చేయాలని విజ్ఞప్తి చేస్తోందిగతం నుంచి వస్తున్న అనుభవాలు, ఆర్థిక నియమావళి భిన్నమైన సంకేతాలను ఇస్తున్నాయి. సాధారణంగా కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ కఠినమైన ద్రవ్య లోటు లక్ష్యాలను అనుసరిస్తుంది. గతంలో కోవిడ్ మహమ్మారి లేదా తీవ్రమైన జాతీయ విపత్తుల సమయంలో మాత్రమే అన్ని రాష్ట్రాలకు సడలింపులు ఇచ్చింది. ఎల్‌నినో వల్ల కేవలం తెలంగాణలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ప్రభావం ఉంటుంది కాబట్టి, ఒకే రాష్ట్రానికి ప్రత్యేకంగా ఎఫ్ఆర్‌బీఎమ్ పరిమితి పెంచడం కేంద్రానికి నిబంధనల రీత్యా సులభం కాకపోవచ్చు. కేంద్రం రుణ పరిమితి పెంచాలంటే కొన్ని షరతులు విధించే అవకాశం ఉంది. ఉదాహరణకు, గతంలో విద్యుత్ రంగ సంస్కరణలు అమలు చేయడం , పట్టణ స్థానిక సంస్థల్లో ఆస్తి పన్ను సంస్కరణలు చేపట్టడం వంటి నిబంధనలు తీర్చినప్పుడే అదనంగా 0.5% బిజినెస్ రారో ఆప్షన్ ఇచ్చేవారు. రేవంత్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ విధానానికి కట్టుబడి ఉన్నందున, కేంద్రం విధించే విద్యుత్ సంస్కరణలకు అంగీకరించడం రాజకీయంగా పెద్ద సవాలుగా మారుతుంది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం, తెలంగాణలో ప్రతిపక్ష హోదాలో తీవ్ర పోటీనిస్తోంది. తెలంగాణ ప్రభుత్వం తగినన్ని సంస్కరణలు చేయకుండా లేదా ఆర్థిక క్రమశిక్షణ పాటించకుండా రుణాలు పెంచుకోవడానికి అనుమతినిస్తే, దానికి బాధ్యత వహించాల్సి వస్తుందనే ఆలోచనలో కేంద్ర ఆర్థిక శాఖ ఉంది. బిఆర్ఎస్ హయాంలో చేసిన భారీ అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం పదే పదే ప్రస్తావిస్తున్న తరుణంలో, కొత్తగా అప్పుల పరిమితి పెంచే విషయంలో కేంద్రం వెనుకాడే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. కేంద్రం ఎఫ్ఆర్‌బీఎమ్ పెంపుకు నిరాకరిస్తే, రేవంత్ సర్కార్ ముందు ప్రత్యామ్నాయ మార్గాలు పరిమితం గానే ఉన్నాయి. క్యాపిటల్ ఎక్స్‌పెండిచర్ ను తగ్గించుకో వడం, నాన్-టాక్స్ రెవెన్యూ పెంచుకోవడం లేదా సంక్షేమ పథకాల అమలును దశలవారీగా వేగవంతం చేయడం తప్ప వేరే మార్గం ఉండదు. కరెంట్ సర్దుబాటు కోసం విద్యుత్ సంస్థలపై డిస్కం లోన్లు పెంచే ప్రతిపాదనలు ఉన్నప్పటికీ, అది కూడా తాత్కాలిక ఉపశమనమే అవుతుంది. ఎల్‌నినో సృష్టించిన నీటి, విద్యుత్ సంక్షోభం నుంచి బయటపడటానికి ఎఫ్ఆర్‌బీఎమ్ పరిమితి పెంపు అనేది తెలంగాణ ప్రభుత్వానికి అత్యంత తక్షణ అవసరమే. కానీ, నిబంధనలు, రాజకీయ విభేదాలు, కేంద్ర ఆర్థిక విధానాల నేపథ్యంలో కేంద్రం నుంచి బేషరతుగా ఈ పరిమితి పెంపు దక్కడం అత్యంత సంక్లిష్టమైన విషయమేనని ఆర్థిక నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## తెలంగాణలోనూ కూటమి...

**నల్గొండ :** ఉమ్మడి ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం రాజకీయంగా తీవ్ర ఆసక్తి రేపుతోంది. ఈ స్థానానికి జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ముందస్తుగానే మాజీ హెల్త్ డైరెక్టర్, పార్టీ అధికార ప్రతినిధి డాక్టర్ గడల శ్రీనివాసరావును అభ్యర్థిగా ప్రకటించి ప్రచారంలోకి దింపారు. ఇప్పుడు తమ అభ్యర్థికి మద్దతివ్వాలని జనసేన పార్టీ బీజేపీని కోరుతోంది. తెలంగాణలో తాము సొంతంగానే బరిలోకి దిగుతామని, స్థానికంగా పొత్తులు ఉండవని బీజేపీ రాష్ట్ర నాయకులు పైకి ఎంతగా చెబుతున్నప్పటికీ.. జాతీయ స్థాయిలో ఎన్డీయే మిత్రపక్షంగా ఉన్న జనసేన ప్రతిపాదనను పూర్తిగా తిరస్కరించలేని పరిస్థితిలో కమలనాథులు పడిపోయినట్లు పొలిటికల్ సర్కిల్స్‌లో ప్రచారం సాగుతోంది. ఇటీవల బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్ బన్సల్, సహ ఇన్‌చార్జుల సమక్షంలో జరిగిన ముఖ్యనేతల భేటీలో ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పొత్తు అంశం ప్రధానంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. జనసేనతో అధికారికంగా పొత్తు పెట్టుకుంటే ప్రత్యర్థి పార్టీలు స్థానిక సెంటిమెంట్‌ను అస్త్రంగా చేసుకుంటాయనే ఆందోళనను కొంతమంది రాష్ట్ర నేతలు వ్యక్తం చేసినప్పటికీ.. జాతీయ అధిష్ఠానం స్థాయిలో ఉన్న సమీకరణాల రీత్యా జనసేనను ఆమోదించక తప్పదనే అభిప్రాయం వ్యక్తమైంది. ఈ క్రమంలోనే బీజేపీ ఆశావహుల తుది జాబితాతో పాటు జనసేన అభ్యర్థి గడల శ్రీనివాసరావు పేరును కూడా జాతీయ నాయకత్వానికి నివేదించినట్లు తెలుస్తోంది. వైద్యశాఖలో సుదీర్ఘ అనుభవం ఉన్న డాక్టర్ గడల శ్రీనివాసరావుకు గ్రాడ్యుయేట్లు, ఉద్యోగ వర్గాల్లో ఉన్న పరిచయాలు, సామాజిక వర్గ సమీకరణలు ఈ స్థానంలో సానుకూల అంశాలుగా మారుతున్నాయి. అంతేకాకుండా పవన్ కళ్యాణ్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసి వ్యూహాత్మకంగా నియోజకవర్గ సమన్వయకర్తలను సైతం నియమించడంతో జనసేన ప్రచారం ఇప్పటికే వేగవంతమైంది. బీజేపీ తరఫున రేసులో ఉన్న ఇతర ఆశావహుల కంటే గడల శ్రీనివాసరావు క్షేత్రస్థాయిలో ముందంజలో ఉండటం వల్ల, నేరుగా కాకపోయినా పరోక్షంగానైనా ఆయనకు మద్దతు ఇవ్వడమే లాభదాయకమని కమలదళం భావిస్తున్నట్లు తెలుస్తోంది. తెలంగాణలో సొంతంగా బలపడాలని బీజేపీ ప్రయత్నిస్తున్నప్పటికీ, పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లో ఎన్డీయే కూటమి విజయవంతంగా కొనసాగుతున్న తరుణంలో జనసేనను తెలంగాణలో ఒంటరిని చేయడం సమంజసం కాదని ఢిల్లీ పెద్దలు భావిస్తున్నట్లు సమాచారం. దీంతో పొత్తులు ఉండవు అని పైకి గంభీర ప్రకటనలు చేస్తున్నప్పటికీ, అంతర్గతంగా గడల శ్రీనివాసరావుకే మద్దతు పలకక తప్పని పరిస్థితి ఏర్పడింది. చివరకు బీజేపీ-జనసేనల మధ్య ఈ స్థానంపై అవగాహన కుదిరితే, ఖమ్మం-నల్లగొండ-వరంగల్ పట్టభద్రుల పోరు మరింత ఉత్కంఠభరితంగా మారడం ఖాయంగా కనిపిస్తోంది.

## ఐకరువు మండలాలు 365

-మొదటిపేజీ తరువాయి

చేసిన తీర్మానం మేరకు రాష్ట్రంలోని అన్ని మండలాల్లో బహుళ ప్రాతిపదికన శాస్త్రీయ అంచనాలు నిర్వహించాం. టెలీమెట్రీ పద్ధతిలో జూన్1 నుంచి సెప్టెంబర్ 30 వరకు వచ్చిన వర్షపాతాన్ని లెక్కించాం. వ్యవసాయ సాగులో తగ్గుదల, భూమితో తేమ శాతం, భూగర్భ జలాలు, రిమోట్ సెన్సింగ్ అనే నాలుగు రకాలుగా ఈ అంచనా వేశాం. ప్రతి మండలంలోని 10 శాతం గ్రామాల్లో భూగర్భ పరిస్థితులను శాంపిల్ సర్వే ద్వారా నిర్ధారించిన మీదట అన్ని శాఖల అంచనాల మేరకు రూపొందించిన జాబితాను కేబినెట్ సబ్ కమిటీ ముందుంచాం. అక్టోబర్ 23న జరిగిన ఈ సమావేశం 31 జిల్లాల్లోని 365 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆ మేరకు వాటిని కరువు మండలాలుగా ప్రకటిస్తున్నాం. ఈ మేరకు విడుదల చేసే నోటిఫికేషన్ ఆరు నెలల పాటు అమల్లో ఉంటుంది.

### కలెక్టర్లు గెజిట్ నోటిఫికేషన్ చేయాలి

ప్రస్తుత జాబితాలో లేని మండలాల్లో పరిస్థితులను ఎప్పటికప్పుడు గమనిస్తూ అవసరమైతే మలి జాబితాను కూడా విడుదల చేస్తాం. ఈ వివరాలను అన్ని జిల్లాల కలెక్టర్లు గెజిట్ నోటిఫికేషన్ చేయాలి. జిల్లా యంత్రాంగాలు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపు, భూగర్భజలాల పెంపుదలకు తీసుకోవాల్సిన చర్యలు, గడ్డి ఏర్పాట్లు, పశు శిబిరాలు నిర్వహించడం, వీబీజీ రాంజీ చట్టానికి అనుగుణంగా ఉపాధి కల్పన లాంటి ఉపశమన చర్యలు తీసుకోవాలి. రిజర్వు బ్యాంకు నిబంధనలకు అనుగుణంగా వ్యవసాయ రుణాల రీస్ట్రక్చర్, రుణాల రికవరీ కోసం ఒత్తిడి తేకుండా ఉండడం లాంటి చర్యలు తీసుకోవాలి. తీవ్ర కరువు పరిస్థితులు ఉన్న మండలాల్లో అవసరమైన చర్యలు తీసుకునేందుకు గాను అన్ని వివరాలను ప్రణాళిక శాఖ ఏడు రోజుల్లో కేంద్ర వ్యవసాయ, హోంశాఖలకు నివేదిక రూపంలో పంపాలి. కరువు ఉపశమన చర్యలకు సంబంధించిన అన్ని వివరాలను, లబ్ధిదారులు, ఖర్చు గణాంకాలతో సహా ప్రతి రోజూ ప్రగతి నివేదికలను వ్యవసాయ, పశు సంవర్ధక శాఖ డైరెక్టర్, పౌరసరఫరాల శాఖకు పంపాల్సి ఉంటుంది. కరువు పరిస్థితులకు సంబంధించి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు పూర్తి సవివర నివేదికను పంపిచండంతో పాటు, త్వరగా కేంద్ర బృందం రాష్ట్రంలో పర్యటించేలా విజ్ఞప్తి చేసేలా ప్రణాళిక శాఖ నివేదికను పంపించాలి.

### ఓ మోస్తరు కరువున్న మండలాలివే..

ఆదిలాబాద్‌లో 16, భద్రాద్రి కొత్తగూడెంలో 12, హనుమకొండలో 14, జగిత్యాలలో 3, జనగామలో 3, భూపాలపల్లిలో 5, కామారెడ్డిలో 4, కరీంనగర్ 3, ఖమ్మంలో 7, ఆసిఫాబాద్‌లో 5, మహబూబాబాద్‌లో 7, మహబూబ్‌నగర్‌లో 11, మంచిర్యాలలో 11, మెదక్‌లో 1, మేడ్చల్ మల్కాజ్‌గిరిలో 6, ములుగులో 4, నాగర్‌కర్నూల్‌లో 3, నల్లగొండలో 8, నిర్మల్‌లో 8, నిజామాబాద్‌లో 18, రాజన్న సిరిసిల్లలో 2, రంగారెడ్డిలో 13, సంగారెడ్డిలో 26, సిద్దిపేటలో 7, సూర్యాపేటలో 19, వికారాబాద్‌లో 9, వనపర్తిలో 5, వరంగల్‌లో 8, యాదాద్రి భువనగిరిలో 16 మండలాల్లో మోస్తరు కరువు పరిస్థితులున్నాయి.

## కూలీలకు 125 రోజుల ఉపాధి

-మొదటిపేజీ తరువాయి

పంట కూడా చేతికొస్తుందన్న గ్యారెంటీ లేదు. దీంతో గ్రామాల్లో వ్యవసాయ ఆధారిత పనులు తగ్గిపోయాయి. పంచాయతీ రాజ్?, గ్రామీణాభివృద్ధి అధికారులు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రానున్న ఎనిమిది నెలలపాటు పెద్ద ఎత్తు కూలి పనులు కల్పించాలని నిర్ణయించారు.

### 8.83 లక్షల అభివృద్ధి పనులు

వీబీ జీ రాంజీ పథకంలో భాగంగా 8.83 లక్షల అభివృద్ధి పనుల ద్వారా ఉపాధి కల్పించనున్నారు. దీంతో రాష్ట్రంలో ఎల్?నినో ప్రభావం కారణంగా ఏర్పడిన పరిస్థితులను ఎదుర్కొనేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. దీనికోసం ఈ నెల 2న ప్రత్యేక గ్రామ సభలను నిర్వహించింది. 12,760 గ్రామ పంచాయతీల్లో దీనికి సంబంధించిన ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆ శాఖ అధికారులు సూచించారు. 31 జిల్లాల కలెక్టర్లు సమర్పించిన 8,83,845 పనులకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది.

### కేంద్ర ప్రభుత్వం అనుమతి

జీ రాంజీ పథకం కింద మొత్తం రూ.6,375.52 కోట్ల విలువైన పనులకు కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఇందులో కేంద్రం తన వాటాగా 60 శాతం అంటే రూ.3,825.31 కోట్లు కేటాయిస్తుంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రూ.2,550.21 కోట్లను సమకూర్చనుంది. దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నిరంతరాయంగా ఉపాధి కల్పించాలని భావిస్తోంది. ఆయా గ్రామాల్లో చేయాల్సిన అభివృద్ధి పనుల గురించి పంచాయతీరాజ్? శాఖ సమీక్షించి ఆమోదం తెలిపింది.

### నవంబర్ 1 నుంచి ప్రారంభం

ఈ పనుల్లో నీటి సంరక్షణకు అధిక ప్రాధాన్యతనిచ్చారు. ఆమోదం పొందిన పనుల సంఖ్యాపరంగా చూస్తే నల్గొండ జిల్లా 80,496 పనులతో మొదటి స్థానంలో ఉంది. ఆ తర్వాత స్థానాల్లో ఖమ్మం -79,586, ఆదిలాబాద్ - 57,001, వికారాబాద్ - 56,898 జిల్లాలు ఉన్నాయి. పెద్దపల్లి జిల్లాలో అత్యల్పంగా 8,464 పనులు మంజూరయ్యాయి. వచ్చే నెల 1వ తేదీ నుంచి ఈ పనులను ప్రారంభించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి గ్రామంలో గుర్తించిన కూలీలకు, నవంబర్ 1వ తేదీ నుంచి వచ్చే ఏడాది జూన్ వరకు మొత్తం 125 రోజుల పని దినాలను కల్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

## పగలు ఎండలు.. రాత్రికి చలి



-మొదటిపేజీ తరువాయి

13 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోవడం ఆందోళనకరంగా మారింది. ఇక్కడి సాధారణ ఉష్ణోగ్రత కంటే ఇది 5.3 డిగ్రీలు తక్కువగా నమోదైంది.

### పలు ప్రాంతాల్లో నమోదైన ఉష్ణోగ్రతలు ఇలా

ఇక రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్‌లో సైతం చలి ప్రభావం తీవ్రంగా ఉంది. అక్కడ 15.0 డిగ్రీల సెల్సియస్ అంటే సాధారణం కంటే 3.6 డిగ్రీలు తక్కువగా కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ముఖ్యమైన ప్రాంతాల్లో వాతావరణం కాస్త నిలకడగా ఉంది. హైదరాబాద్ కేంద్రంగా 19.6 డిగ్రీలు, హకీంపేటలో 19.5 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు రాత్రి నమోదయ్యాయి. మేడ్చల్ జిల్లాలోని దుండిగల్‌లో 18 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. రంగారెడ్డి జిల్లా హయత్‌నగర్ పరిసరాల్లో మాత్రం సాధారణం కంటే 4 డిగ్రీలు ఎక్కువగా అంటే 22 డిగ్రీల సెల్సియస్ నమోదు అయ్యింది.

### బయట నడక వద్దు

ఇప్పుడిప్పుడే రాష్ట్రంలో చలి పెరుగుతున్న నేపథ్యంలో గుండెకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ఉదయాన్నే ఆరు బయట తిరగకపోవడం ఉత్తమమని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. బహిరంగ ప్రదేశాల్లో వ్యాయామం చేయొద్దని చెబుతున్నారు. చల్లదనంతో గుండె రక్తాన్ని పంపింగ్? చేయడంతో సమస్యలు తలెత్తే ప్రమాదముందని సూచిస్తున్నారు. దీంతో గుండెపోటు కూడా వచ్చే ప్రమాదముంటుందని అంటున్నారు. వృద్ధాప్యంలో ఉన్నవాళ్లు చలికాలంలో తెల్లవారుజామునే వాకింగ్?కు వెళ్లొద్దని, వెచ్చటి దుస్తులు వేసుకుని ఎండ వచ్చిన తర్వాతే నడవాలన్నారు. ధ్యానం, యోగా లాంటివి చేసుకోవడం ఉత్తమమని చెబుతున్నారు.

బిజినెస్

### బంగారంపై నడిచే రోజులు వస్తున్నాయ్!



పర్యాటకులను ఆకట్టుకోవడంలో ఎప్పుడూ ముందుండే దుబాయ్.. మరో కొత్త ఆకర్షణకు సిద్ధమవుతోంది. ఈసారి ఏకంగా 24 క్యారెట్ల బంగారంతో నడకదారిని ఏర్పాటు చేయాలని నిర్ణయించుకుంది. ఇది 2026 చివరి నాటికి అందుబాటులోకి తీసుకురావాలని దుబాయ్ గోల్డ్ డిస్ట్రిక్ట్ భావిస్తోంది. బంగారంతో ఏర్పాటు చేసిన నడకదారి అందుబాటులోకి వస్తే.. ప్రపంచంలోనే మొదటిది, అత్యంత పొడవైన బంగారు నడకదారిగా నిలుస్తుందని నిర్వాహకులు చెబుతున్నారు. దుబాయ్ గోల్డ్ డిస్ట్రిక్ట్ కమర్షియల్ విభాగం సీనియర్ డైరెక్టర్ రషీద్ అల్ హర్మోది వెల్లడించిన వివరాల ప్రకారం.. మరో రెండు నెలల్లోనే దీన్ని ప్రారంభించే అవకాశం ఉంది. బంగారు ఆభరణాలకు ప్రసిద్ధి చెందిన దుబాయ్.. ఇప్పుడు బంగారంతోనే పర్యాటకులను ఆకర్షించేందుకు సన్నద్ధమవుతోంది. ఈ నడకదారి సందర్శకులకు కొత్త అనుభూతిని అందించడంతో పాటు, అంతర్జాతీయ బంగారు వ్యాపార కేంద్రంగా దుబాయ్‌కు ఉన్న గుర్తింపును మరింత పెంచుతుందని అధికారులు భావిస్తున్నారు. ఇదిలా ఉండగా.. జోయాలుక్కాస్ జ్యువెలరీ రూపొందించిన సంప్రదాయ భారతీయ జుంకా చెవిపోగులు కూడా ఇటీవల రెండు గిన్నిస్ వరల్డ్ రికార్డులు సాధించాయి. ప్రపంచంలోనే అత్యంత బరువైన జత బంగారు చెవిపోగులు, అతిపెద్ద జత చెవిపోగులుగా అవి గుర్తింపు పొందాయి.

### జియో 27 లక్షలు.. ఎయిర్‌టెల్ 26 లక్షలు




ఇంటర్నెట్ డెస్క్: దేశంలోని టెలికాం వినియోగదారుల సంఖ్య సెప్టెంబర్‌లో పెరిగింది. కొత్తగా 65 లక్షల మంది (6.57 మిలియన్) సబ్‌స్క్రైబర్లు చేరారు. దీంతో మొత్తం వినియోగదారుల సంఖ్య 130 కోట్లకు చేరింది. ఈ మేరకు టెలికాం నియంత్రణ సంస్థ ట్రాయ్ గణాంకాలను వెలువరించింది. సెప్టెంబర్ నెలలో అన్ని టెలికాం కంపెనీలూ తమ సబ్‌స్క్రైబర్ల బేస్‌ను పెంచుకోవడం గమనార్హం. ఎప్పటిలానే జియో ఎయిర్‌టెల్ ముందు వరుసలో నిలిచాయి. సెప్టెంబర్ నెలలో జియో నెట్‌వర్క్‌లోకి 27.12 లక్షల మంది వచ్చారు. దీంతో కంపెనీ సబ్‌స్క్రైబర్ల సంఖ్య 511.14 మిలియన్లకు (51 కోట్లకు) చేరింది. అదే సమయంలో ఎయిర్‌టెల్ నెట్‌వర్క్‌ను 26.92 లక్షల మంది కొత్తగా ఎంచుకున్నారు. దీంతో మొత్తం సబ్‌స్క్రైబర్ బేస్ 494.29 మిలియన్లకు (49 కోట్లు) పెరిగింది. వొడాఫోన్‌ను కొత్తగా 5.50 లక్షల మంది ఎంచుకోగా.. బీఎస్ఎన్ఎల్‌లో 6.25 లక్షల మంది చేరారు. సెప్టెంబర్ నెలలో 1.6 కోట్ల మంది మొబైల్ నంబర్ పోర్టబిలిటీని ఎంచుకున్నట్లు ట్రాయ్ తెలిపింది.

## ల్యాప్‌టాప్‌లు ఆఫ్.. ఐడీలు డీయాక్టివేట్..

# లంచ్ టైమ్‌లో లేఆఫ్‌లు!



మనుషులు చేసే చాలా పనులు ఏఐ చేస్తోందని, కంపెనీ ప్రాధాన్యతలకు తగ్గట్టుగా ఉద్యోగుల పునర్వ్యవస్థీకరణ అంటూ టెక్ పరిశ్రమలు కొంతకాలంగా లేఆఫ్‌లు ప్రకటిస్తూనే ఉన్నాయి. కొన్ని సంస్థలు ముందుగా సమాచారం ఇస్తుంటే.. ఇంకొన్ని అకస్మాత్తుగా సిబ్బందిని తొలగించి షాక్‌కు గురిచేస్తున్నాయి. తాజాగా ఏఐ సర్వీసెస్, గ్లోబల్ డేటా ఇంజినీరింగ్ సంస్థ ఇన్నోడేటా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో ఉద్యోగులకు ఇలాంటి పరిస్థితే ఎదురైంది. ఎప్పటిలాగే విధుల్లో నిమగ్నమైన పలువురు ఉద్యోగుల ల్యాప్‌టాప్‌లు అనూహ్యంగా లాగౌట్ అయ్యాయని, వారి ఐడీలు డీయాక్టివేట్ అయ్యాయని సోమవారం జరిగిన లేఆఫ్‌ల గురించి ఓ జాతీయ మీడియా కథనం వెల్లడించింది. "ఎప్పటిలాగే మా రోజూవారీ పనిని ప్రారంభించాం. మధ్యాహ్నం సమయంలో ఉద్యోగాల కోత గురించిన వార్తలు ఒక్కసారిగా గుప్పుమన్నాయి. ఆ వెంటనే ఒకరి తర్వాత ఒకరు కంపెనీ సిస్టమ్స్ నుంచి యాక్సెస్ కోల్పోయారు. ఐడీలు డీ-యాక్టివేట్ అయ్యాయి. అనంతరం వ్యక్తిగత ఈ-మెయిల్ ఖాతాలకు తొలగింపు మెయిల్స్ వచ్చాయి" అని ఉద్యోగులను ఉటంకిస్తూ సదరు మీడియా కథనం పేర్కొంది. వ్యాపార అవసరాలకు తగ్గట్టుగా ఈ నిర్ణయం తీసున్నామని, పనితీరు ఆధారంగా తొలగింపులు కాదని ఉద్యోగులకు పంపిన ఈ-మెయిల్‌లో ఆ సంస్థ తెలిపింది.

మొత్తంగా భారత్‌లో 550 మంది సిబ్బందిపై ఈ లేఆఫ్‌ల ప్రభావం పడింది ఫిలిప్పీన్స్‌లోని తన కార్యాలయాల్లో పలువురు ఉద్యోగులను ఇన్నోడేటా తొలగించింది. హెచ్‌ఆర్ యాప్‌నకు యాక్సెస్ కూడా నిలిపివేయడతో ఉద్యోగులు తమ పేస్లిప్‌లు, ఇతర కీలక డాక్యుమెంట్లను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశం కూడా లభించలేదని తెలుస్తోంది. దాంతో బాధితులంతా సోషల్ మీడియాలో ఒక గ్రూప్‌ను ఏర్పాటు చేసుకొని, కంపెనీకి తమ పరిస్థితిని వివరించే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం.

అమెరికాలోని న్యూజెర్సీ కేంద్రంగా ఇన్నోడేటా సేవలందిస్తోంది. టెక్ కంపెనీలకు ఏఐ వ్యవస్థలను నిర్మించడానికి, సేవలను మెరుగుపర్చుడానికి సహకరిస్తోంది. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, యాపిల్, సోనీ, బోయింగ్, డెలాయిట్ వంటి దిగ్గజ సంస్థలు ఈ సంస్థ కస్టమర్ల జాబితాలో ఉన్నాయి. 2025 వార్షిక నివేదిక ప్రకారం.. అంతర్జాతీయంగా ఇన్నోడేటా సంస్థలో 10,107 మంది సిబ్బంది ఉన్నారు.

## జియో ప్లాట్‌ఫామ్స్ లిస్టింగ్.. ఊరిస్తున్న టాప్-2!




ఇంటర్నెట్ డెస్క్: రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన టెలికాం, డిజిటల్ విభాగం జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ అక్టోబరు 28న స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్ట్ కానుంది. అప్పర్ ప్రైస్ బ్యాండ్ వద్ద రూ.10.3 లక్షల కోట్ల మార్కెట్ విలువతో బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో నమోదు కానుంది. రూ.10 లక్షల కోట్ల మార్కెట్ విలువతో వస్తున్న తొలి కంపెనీగా జియో రికార్డులకెక్కనుంది. ఇప్పటి వరకు ఏ భారతీయ కంపెనీ కూడా ఈ మార్కెట్ విలువ వద్ద లిస్టింగ్‌కు రాలేదు. ప్రస్తుతం స్టాక్ మార్కెట్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ (రూ.16.2 లక్షల కోట్లు), భారతీ ఎయిర్‌టెల్ (రూ.12.2 లక్షల కోట్లు), హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (రూ.10.6 లక్షల కోట్లు) మార్కెట్ విలువ పరంగా టాప్-3లో ఉన్నాయి. ఐపీఓ వాల్యూషన్ ప్రకారం జియో ప్లాట్‌ఫామ్స్ నాలుగో అతిపెద్ద కంపెనీగా అవతరించనుంది. జియో ప్లాట్‌ఫామ్స్ షేర్లు ప్రీమియంతో లిస్టయ్యే అవకాశం ఉన్నట్లు గ్రే మార్కెట్ ప్రీమియం సూచిస్తోంది. ఆ లెక్కన ఇష్యూ ధరతో (రూ.1119) పోలిస్తే 20 శాతం ప్రీమియంతో రూ.1340 వద్ద లిస్టయ్యే అవకాశం ఉందని అంచనాలున్నాయి. అదే జరిగితే కంపెనీ మార్కెట్ విలువ రూ.12.3 లక్షల కోట్లకు చేరుతుంది. దీంతో మార్కెట్ విలువ పరంగా రిలయన్స్ ఇండస్ట్రీస్ తర్వాత రెండో అతిపెద్ద కంపెనీగా జియో ప్లాట్‌ఫామ్స్ నిలుస్తుంది.

ఐపీఓ వాల్యూషన్ ప్రకారం చూసినా రిలయన్స్ ఇండస్ట్రీస్, జియో ప్లాట్‌ఫామ్స్ కంపెనీల మార్కెట్ విలువ రూ.27 లక్షల కోట్లుగా ఉంది. 2026 అక్టోబరు 27నాటికి టాటా గ్రూపునకు చెందిన 32 లిస్టెడ్ కంపెనీల కంబైన్డ్ మార్కెట్ విలువ రూ.25.7 లక్షల కోట్లుగా ఉంది. అదానీ గ్రూపునకు చెందిన 11 లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.16.6 లక్షల కోట్లుగా ఉంది. ఒకవేళ జియో ప్లాట్‌ఫామ్స్ లిమిటెడ్ (జేపీఎల్) ప్రీమియం ధర వద్ద లిస్టయితే రిలయన్స్ గ్రూప్ మార్కెట్ విలువ సుమారు రూ.30 లక్షల కోట్లకు చేరుతుంది.

# వెల్లింగ్టన్‌లో అభిషేక్ సునామీ..
# రికార్డుల మోతతో సిరీస్ భారత్ కైవసం

**కివీస్‌పై మూడో టీ20లో టీమిండియా ఘన విజయం**

**యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ 38 బంతుల్లోనే 113 పరుగులు**

**పవర్‌ప్లేలో 118 పరుగులు చేసి ప్రపంచ రికార్డు సృష్టించిన భారత్**

**ఈ విజయంతో 3-0 తేడాతో టీ20 సిరీస్‌ను కైవసం చేసుకున్న టీమిండియా**

**భారీ లక్ష్యాన్ని కేవలం 13.2 ఓవర్లలోనే ఛేదించిన భారత జట్టు**





న్యూజిలాండ్‌తో జరిగిన మూడో టీ20లో యంగ్ ఓపెనర్ అభిషేక్ శర్మ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. పరుగుల సునామీ సృష్టిస్తూ కేవలం 38 బంతుల్లోనే 9 ఫోర్లు, 11 సిక్సర్ల సహాయంతో 113 పరుగులు చేయగా, టీమిండియా మరపురాని విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌ను మరో రెండు మ్యాచ్‌లు మిగిలి ఉండగానే 3-0 తేడాతో భారత్ కైవసం చేసుకుంది. కివీస్ నిర్దేశించిన 199 పరుగుల భారీ లక్ష్యాన్ని భారత బ్యాటర్లు ఊది పారేశారు. అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగడంతో ఈ భారీ స్కోరు కూడా చిన్నబోయింది. ఈ పోరులో భారత్ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోగా.. న్యూజిలాండ్ బ్యాటర్లు మెరుగైన ఆటతీరు కనబర్చారు. డారిల్ మిచెల్ (52 బంతుల్లో 89 నాటౌట్), ఫిన్ అలెన్ (25 బంతుల్లో 40) మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆతిథ్య నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు సాధించింది. భారత బౌలర్లలో అర్ష్‌దీప్ సింగ్, అక్షర్ పటేల్, నితీశ్ రెడ్డి తలో వికెట్ పడగొట్టారు. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియా ఆరంభం నుంచే ఎదురుదాడికి దిగింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ (19 బంతుల్లో 45) కివీస్ బౌలర్లను ఊచకోత కోశారు. వీరిద్దరూ పవర్‌ప్లేలోనే టీ20 క్రికెట్‌లో సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించారు. తొలి 6 ఓవర్లలోనే వికెట్ నష్టపోకుండా 118 పరుగులు జోడించారు. ఇది టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో అత్యధిక పవర్‌ప్లే స్కోరు కావడం విశేషం. ఈ క్రమంలో రొమేనియా (116/0) రికార్డును భారత్ బద్దలుకొట్టింది. కేవలం 2.2 ఓవర్లలోనే 50 పరుగులు, 5 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తి చేసి పలు రికార్డులను తమ ఖాతాలో వేసుకుంది. తొలి వికెట్‌కు 133 పరుగుల భాగస్వామ్యం తర్వాత వైభవ్ ఔటైనా, అభిషేక్ తన జోరు కొనసాగించాడు. విధ్వంసకర ఇన్నింగ్స్‌తో 35 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అనంతరం అభిషేక్, కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (5), సంజూ శాంసన్ (18) స్వల్ప వ్యవధిలో ఔటయ్యారు. చివర్లో తిలక్ వర్మ (1), నమన్ ధీర్ (4) లాంఛనాన్ని పూర్తి చేశారు. దీంతో టీమిండియా కేవలం 13.2 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించి 6 వికెట్ల తేడాతో అద్భుత విజయాన్ని నమోదు చేసింది. ఈ విజయంతో సిరీస్‌ను భారత్ 3-0 చేజిక్కించుకోగా, మిగిలిన రెండు మ్యాచ్‌లు నామమాత్రం కానున్నాయి. అభిషేక్ శర్మకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు లభించింది.

**మా ప్లాన్ చాలా సింపుల్.. వైభవ్ తో ఓపెనింగ్ పై అభిషేక్ శర్మ ఆసక్తికర వ్యాఖ్యలు**

న్యూజిలాండ్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగి, కేవలం 38 బంతుల్లోనే 113 పరుగులు సాధించి టీమిండియాకు చిరస్మరణీయ విజయాన్ని అందించిన తర్వాత, యువ సంచలనం అభిషేక్ శర్మ తన విధ్వంసక ఇన్నింగ్స్ వెనుక ఉన్న అసలు రహస్యాన్ని పంచుకున్నాడు. తాను, మరో ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడటమే తమ ప్రణాళిక అని, ముఖ్యంగా పవర్‌ప్లేను సద్వినియోగం చేసుకోవాలని ముందే నిర్ణయించుకున్నామని తెలిపాడు. మ్యాచ్ అనంతరం 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు అందుకున్న అభిషేక్ తన మనసులోని మాటలను వెల్లడించాడు. న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా వెల్లింగ్టన్‌లోని హెన్రీ స్టేడియంలో జరిగిన మూడో టీ20లో టీమిండియా 6 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 198 పరుగుల భారీ స్కోరు చేసింది. అనంతరం 199 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్, అభిషేక్ శర్మ (38 బంతుల్లో 113; 9 ఫోర్లు, 11 సిక్సర్లు) సునామీ సెంచరీతో కేవలం 13.2 ఓవర్లలోనే 4 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. ఈ విజయంతో 5 మ్యాచ్‌ల సిరీస్‌ను భారత్ 3-0 తేడాతో కైవసం చేసుకుంది.

స్పోర్ట్స్

### రంజీ ట్రోఫీ..
### డబుల్ సెంచరీలతో మోతెక్కించిన బ్యాటర్లు



దేశవాళీ టోర్నీ రంజీ ట్రోఫీ 2026-27లో ఆయా జట్ల బ్యాటర్లు డబుల్ సెంచరీలు, శతకాలతో హోరెత్తిస్తున్నారు. ఎలైట్ గ్రూప్-ఏలో జార్ఖండ్‌తో మ్యాచ్‌లో ఢిల్లీ బ్యాటర్ ఆయుశ్ బదోని డబుల్ సెంచరీతో చెలరేగగా, సుమిత్ మాథూర్ సెంచరీ సాధించాడు. తద్వారా ఢిల్లీ భారీ స్కోరు దిశగా సాగుతుంది. ప్రస్తుతం 126 ఓవర్లు ముగిసేసరికి ఢిల్లీ జట్టు 5 వికెట్ల నష్టానికి 474 పరుగులు చేసింది. బదోని (201), సుమిత్ మాథూర్ (118) క్రీజులో ఉన్నారు. ఈ ఇద్దరు ఆరో వికెట్‌కు అజేయంగా రికార్డు స్థాయిలో 293 పరుగులు జోడించడం విశేషం. ఎలైట్ గ్రూప్-డిలో హిమాచల్ ప్రదేశ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో చండీగఢ్ భారీ స్కోరు దిశగా సాగుతున్నది. 118 ఓవర్లు ముగిసేసరికి చండీగఢ్ 2 వికెట్ల నష్టానికి 528 పరుగులు చేసింది. ఓపెనర్ నిహాల్‌పజిని (324 బంతుల్లో 202 బ్యాటింగ్; 23 ఫోర్లు, 2 సిక్సర్లు) అజేయ డబుల్ సెంచరీతో విధ్వంసం సృష్టించగా, అరస్లాన్ ఖాన్ (99) పరుగు తేడాతో సెంచరీ చేజార్చుకున్నాడు.

**ప్రియాన్ష్ డబుల్.. మహేశ్ సెంచరీ**

ఎలైట్ గ్రూప్-ఏలో భాగంగా జమ్మూ కశ్మీర్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో బరోడా బ్యాటర్ ప్రియాన్ష్ మోలియా ద్విశతకం మార్క్ సాధించాడు. 354 బంతుల్లో డబుల్ సెంచరీ సాధించిన ప్రియాన్ష్ ఇన్నింగ్స్‌లో 22 ఫోర్లు, ఒక సిక్సర్ ఉన్నాయి. ప్రస్తుతం బరోడా 128 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 430 పరుగులు చేసింది. మహేశ్ పితియా కూడా 210 బంతుల్లో శతకం మార్క్ అందుకున్నాడు. ఏడో వికెట్‌కు ఈ జోడి అజేయంగా 233 పరుగులు జోడించింది.

**పటీదార్ శతకం..**

ఇక ఎలైట్ గ్రూప్-ఏలో బీహార్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో మధ్యప్రదేశ్ కెప్టెన్ రజత్ పటీదార్ శతకం సాధించాడు. 133 బంతుల్లో 109 పరుగులు చేసిన పటీదార్ అనూహ్యంగా రనౌట్ అయ్యాడు. అంతకముందు వికెట్ కీపర్ సాక్షమ్ పురోహిత్ (132) కూడా సెంచరీతో ఆకట్టుకున్నాడు. ఇక మధ్యప్రదేశ్ తమ తొలి ఇన్నింగ్స్‌ను 8 వికెట్ల నష్టానికి 407 పరుగుల వద్ద డిక్లేర్ చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో బీహార్ 99 పరుగులకే కుప్పకూలడంతో, మధ్యప్రదేశ్ 308 పరుగుల భారీ ఆధిక్యంలో నిలిచింది.

**పంజాబ్ 431 ఆలౌట్**

ఎలైట్ గ్రూప్-బిలో హైదరాబాద్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో పంజాబ్ జట్టు 431 పరుగులకు ఆలౌటైంది. సలీల్ అరోరా (151) భారీ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకోగా, చివర్లో రమన్‌దీప్ సింగ్ (52) అర్ధసెంచరీ సాధించాడు. చివర్లో ఉమేశ్ యాదవ్ (37 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్ ఆడాడు. హైదరాబాద్ బౌలర్లలో సీవీ మిలింద్ నాలుగు వికెట్లతో చెలరేగగా, రక్షణ్ మూడు వికెట్లు, తనయ్ త్యాగరాజన్, అనికేత్ రెడ్డిలు ఒక్కో వికెట్ పడగొట్టారు.




# రష్మిక పాత్ర కోసం వెళ్లి సీతగా.. 'సీతారామం' చిత్రంలో మృణాల్ ఠాకూర్ ఎంపిక వెనుక అసలు కథ ఇదే.!

యువ నటి మృణాల్ ఠాకూర్ కెరీర్‌లో టాలీవుడ్ బ్లాక్‌బస్టర్ 'సీతారామం' ఎంతటి మైలురాయిగా నిలిచిందో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. అయితే ఈ చిత్రంలో ఆమెను మొదట 'అఫ్రీన్' పాత్ర కోసమే సంప్రదించారట. కానీ కథ చెప్పే క్రమంలో దర్శకుడు హను రాఘవపూడి ఆమెను చూసి మనసు మార్చుకుని, ఏకంగా 'సీత మహాలక్ష్మి' ప్రధాన పాత్రకు ఎంపిక చేయడం విశేషం. దర్శకుడు హను రాఘవపూడి దాదాపు ఐదు గంటల పాటు ఎంతో ఓపికగా, భావోద్వేగాలతో ఈ కథను తనకు వినిపించారని, ఆ నెరేషన్ తనను ఎంతగానో కదిలించిందని మృణాల్ పలు సందర్భాల్లో గుర్తుచేసుకున్నారు. నాగ్ అశ్విన్ ద్వారా టాలీవుడ్‌కు పరిచయమైన ఈ బ్యూటీ, సీత పాత్రలో ఒదిగిపోయి తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. ఆ పాత్రలోని స్వచ్ఛత, అంకితభావం ఈ సినిమాను టాలీవుడ్‌లో ఒక కల్ట్ క్లాసిక్‌గా నిలబెట్టాయి.

# నాకు భర్త అవ్వాలంటే.. ఇవి ఉండాలి

తెలుగు సినీ పరిశ్రమలో వరుస సినిమాలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది యువ కథానాయిక రితికా నాయక్. 'అశోకవనంలో అర్జున కల్యాణం', 'మిరాయ్' చిత్రాలతో ప్రేక్షకులకు దగ్గరైన ఈ బ్యూటీ.. నేడు పుట్టినరోజు నిర్వహించుకుంటోంది. ఈ సందర్భంగా ఆమెకు సంబంధించిన ఆసక్తికర విషయాలు మరోసారి చర్చకు వస్తున్నాయి. గతంలో ఓ ఇంటర్వ్యూలో తనకు నచ్చిన హీరో ఎవరో చెప్పిన రితికా.. తనను పెళ్లి చేసుకునే వ్యక్తిలో ఎలాంటి లక్షణాలు ఉండాలో కూడా వెల్లడించింది. ఇప్పుడీ వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి.

సినిమా రంగంలో కథానాయికగా గుర్తింపు తెచ్చుకోవాలంటే అందం ఒక్కటే సరిపోదు. నటనతో ప్రేక్షకుల మనసుల్లో స్థానం సంపాదించుకోవాలి. ఇదే ఆలోచనతో ముందుకు సాగుతోంది రితికా నాయక్. తనకు అందమైన రూపం ఉందని మాత్రమే కాకుండా.. 'బాగా నటిస్తుంది' అని ప్రేక్షకులు అనుకోవాలన్నదే తన లక్ష్యమని ఓ ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చింది. అన్ని రకాల పాత్రల్లో నటించాలని ఉందని, ఒక్క తరహా పాత్రలకే పరిమితం కావడం తనకు ఇష్టం లేదని స్పష్టం చేసింది.

మీ క్రష్ ఎవరని రితికాను ఓ సందర్భంలో అడగ్గా.. తనకు అల్లు అర్జున్‌పై క్రష్ ఉందని రితికా నాయక్ చెప్పుకొచ్చింది. అదే సందర్భంలో జీవిత భాగస్వామి విషయంలోనూ ఆమెకు కొన్ని ప్రత్యేకమైన అభిప్రాయాలు ఉన్నాయని తెలిపింది. తనను ఎంతో ప్రేమించే వ్యక్తి కావాలని, బంధంలో నమ్మకానికి ప్రాధాన్యమివ్వాలని తెలిపింది. అంతేకాదు.. తన వృత్తిని అర్థం చేసుకుంటూ, కెరీర్‌లో ముందుకు సాగేందుకు ప్రోత్సహించే వ్యక్తి తనకు భర్తగా రావాలని కోరుకుంటున్నట్లు పేర్కొంది. కాగా ఇటీవల కొరియన్ కనకరాజుతో తెలుగు ప్రేక్షకులను పలకరించిన రితికా.. వరుస అవకాశాలతో బిజీగా ఉంది. ప్రస్తుతం వరుణ్‌తేజ్‌తో కలిసి 'ద్యూయెట్' అనే సినిమాలో నటిస్తోంది.






# అయ్యప్పపై 'మాలికాపూరం' దర్శకుడి కొత్త చిత్రం.. 'మణికంఠ' ఫస్ట్ లుక్ విడుదల

మలయాళంలో సంచలన విజయం సాధించిన బ్లాక్‌బస్టర్ చిత్రం 'మాలికాపూరం' దర్శకుడు విష్ణు శశి శంకర్ నుంచి మరో ఆధ్యాత్మిక చిత్రం రాబోతోంది. తంత్రా ఫిలిమ్స్ పతాకంపై తెరకెక్కుతున్న తాజా చిత్రం 'మణికంఠ' అయ్యప్ప స్వామి నేపథ్యంలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను తాజాగా మేకర్స్ అధికారికంగా విడుదల చేశారు. '(అయ్యప్ప దర్శనానికి సిద్ధం కండి) అంటూ సాగిన ఈ పోస్టర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో వైభవ్ టైటిల్ రోల్‌లో నటించబోతుండగా, మీనాక్షి గోవిందరాజన్ అరవింద్ ఆకాష్ జె.కె. శరవణ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకు ప్రేమ్ గి అమరన్ సంగీతం అందిస్తుండగా, సూర్య రాజీవన్, శతశ్ కుమార్ తదితరులు ఇతర సాంకేతిక విభాగాల్లో పని చేస్తున్నారు. అయ్యప్ప భక్తులను, ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకునేలా రూపొందుతున్న ఈ 'మణికంఠ' సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే సినిమాకు సంబంధించిన మరిన్ని వివరాలు వెలువడనున్నాయి.

# ఇటు సీత.. అటు ఐపీఎస్ ఆఫీసర్

సాయిపల్లవి.. ఈ పేరు రాబోయే నెలరోజుల్లో కాస్త గట్టిగానే వినిపించనుంది. ఎందుకంటే చాన్నాళ్లుగా దక్షిణాది సినిమాల్లో కనిపించని ఈ బ్యూటీ.. కేవలం 15 రోజుల వ్యవధిలో రెండు క్రేజ్ ఉన్న మూవీస్‌తో రాబోతుంది. ఆయా పాత్రలు, సదరు చిత్రాల్లో సాయిపల్లవే మెయిన్ హైలైట్‌గా కానుందని అనిపిస్తోంది. మొదటగా 'రామాయణ' విషయానికొస్తే ఇందులో ఈమె సీత పాత్ర పోషించింది. వచ్చే శుక్రవారం అంటే నవంబర్ 05న పాన్ ఇండియా రేంజులో ఈ మూవీ రిలీజ్ కానుంది. టీజర్ వచ్చినప్పుడు సీత పాత్ర, ఆహార్యాన్ని సందేహిస్తూ కొందరు ట్రోల్స్ చేశారు. ట్రైలర్, సాంగ్స్ వచ్చిన తర్వాత ఇవి కాస్త తగ్గినట్లే కనిపించాయి. ప్రమోషనల్ కంటెంట్‌పై ఎన్ని విమర్శలైనా రావొచ్చు కానీ మూవీ వచ్చిన తర్వాత అందులో సీత పాత్ర ఆకట్టుకుంటే మాత్రం ఇవన్నీ పక్కకువెళ్లిపోతాయి. 'ఓం' విషయానికొస్తే.. ధనుష్ హీరోగా చేసిన తమిళ సినిమా ఇది. ఇందులో ఐపీఎస్ నిత్యారెడ్డి అనే పవర్‌ఫుల్ పోలీస్ అధికారిగా సాయిపల్లవి నటించింది. ఈమె పాత్రకు సంబంధించిన గ్లింప్స్ అయితే అదిరిపోయింది. ధనుష్, మమ్ముట్టి పాత్రలతో పాటు ఈమెది ఎక్కువగా హైలైట్ అయ్యేలా ఉందనిపిస్తోంది. ఈ మూవీ నవంబర్ 20న తెలుగు, తమిళంలో రిలీజ్ కానుంది. గతేడాది ఫిబ్రవరిలో 'తండేల్' మూవీతో థియేటర్లలోకి వచ్చిన సాయిపల్లవి.. అద్భుతమైన సక్సెస్ అందుకుంది. మళ్లీ ఈ ఏడాది మే నెలలో 'ఏక్ దిన్' అని హిందీలోకి ఎంట్రీ ఇచ్చింది కానీ ఇది ఘోరంగా డిజాస్టర్ అయింది. దీంతో ఆశలన్నీ 'రామాయణ' మీదే పెట్టుకుంది. ఒకవేళ ఈ రెండు సినిమాలు హిట్ అయి, సాయిపల్లవి పాత్రలకు పేరొస్తే ఈ నవంబర్ ఈమెకు స్పెషల్ అవుతుంది. లేదంటే కష్టమే!



printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512